

ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర పెంపు

19 కేజీల ఎల్పీజీ రూ.62 పెరుగుదల

తక్షణమే అమల్లోకి

చిరు వ్యాపారులు, వినియోగదారులపై భారం

వివరాలు 3లో..



అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 02-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 303 Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar 14 పేజీలు వెల : 6.50

రాష్ట్రవ్యాప్తంగా వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లూ చేశామని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు అంతగా లేవు. దీంతో ఒకడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. అనుకున్న స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొన్ని చోట్ల ప్రారంభం అయినా కొనుగోళ్లు జరగడం లేదు. జీవో 27 వల్ల మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లపై మొండికేయడంతో ధాన్యం కాంటాలు ముందుకు సాగడం లేదు. మరోవైపు వర్షాలతో కల్లాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దవుతున్నాయి. ఏం చేయాలో తోచక రైతులు కొందరు ప్రయివేటు వ్యాపారులు, మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. ధాన్యం ఎలా ఉన్నా కొనేస్తాం.. డబ్బులు ఇచ్చేస్తామంటూ.. దళారులు ఆశలు చూపి రైతుల రెక్కల కష్టాన్ని దోచేసుకుంటున్నారు. క్వింటాల్ రూ.1800 నుంచి రూ.1900కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఇక ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ, సహకార సంఘం, మెప్మా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జీవో 27 వల్ల పంటను అమ్ముకోవడం కోసం అన్నదాత అరిగోస పడుతున్నాడు. సన్న, దొడ్డు రకాలను ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సన్నాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు వేర్వేరుగా కేంద్రాలు పెట్టినా.. సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. దొడ్డు రకం ధాన్యాన్నే ప్రభుత్వ, ప్రయివేటు కేంద్రాల్లో కొనుగోలు చేస్తుండటం గమనార్హం.

కన్నీళ్లు..



ముందుకు సాగని ధాన్యం కొనుగోళ్లు

ఒకవైపు వర్షం.. మరోవైపు కల్లాల్లో రాశులు

- కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల అవస్థలు
- ప్రయివేటు మిల్లుల వైపు మొగ్గు చూపుతున్న రైతులు
- క్వింటాల్ రూ.1800 నుంచి రూ.1900కే కొనుగోలు
- సన్న రకాన్ని కొనుగోలు చేయని మిల్లర్లు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి/విలేకరులు

రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాల్లో వరిపంట సాగైంది. ఉత్పత్తి 146.70 లక్షల టన్నులు వస్తుందని, కొనుగోలు కేంద్రాలకు 80 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 7,139 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని దశల వారీగా ఏర్పాటు చేస్తామని ప్రకటించినట్టుగానే ముందుగా నల్లగొండ, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్..ఇలా వరుసగా జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తూ వచ్చారు. వానాకాలం నుంచి సన్నాలకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో.. ఆ దిశగా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేశారు. కానీ, నేటికి సన్నధాన్యం కిలో కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 871 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేసింది. అయినప్పటికీ నల్లగొండ(375 కొనుగోలు కేంద్రాలు) మినహా సూర్యాపేట(206), యాదాద్రిభువనగిరి(290) జిల్లాల్లో ఇంకా పూర్తిస్థాయిలో కొనుగోలు ప్రారంభం కాలేదు.

నల్లగొండలో 12960 టన్నుల దొడ్డు రకం కొనుగోలు

రాష్ట్రంలోని మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రోడ్లు, భవనాలు సినిమా ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పదేపదే అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి కేంద్రాలను ప్రారంభించాలని ఆదేశించారు. వంద కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం వరకు జిల్లాలో 12960 టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3 లక్షల 3 వేల 927 ఎకరాల్లో సన్నాలు సాగు చేసినట్టు అధికారులు వెల్లడించారు. అందులో నల్లగొండలో 2లక్షల 68 వేల 778 ఎకరాల్లో సాగు చేశారు. సూర్యాపేట జిల్లాలో 93 వేల 188 ఎకరాలు, భువనగిరి యాదాద్రి జిల్లాలో 31,961 ఎకరాల్లో సాగు చేశారని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అలాగే, నల్లగొండలో 2 లక్షల 41,404, సూర్యాపేట జిల్లాలో 3లక్షల 9 వేల 746 ఎకరాలు, భువనగిరి యాదాద్రి జిల్లాలో 2,27,537 ఎకరాల్లో ...6లో


జీవో 27 తో మిల్లర్ల కొర్రీ

ప్రభుత్వం మిల్లర్ల ఆగడాలను అరికట్టేందుకు జీవో నెంబర్ 27ను తీసుకొచ్చింది. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు మిల్లర్లు దించుకోవాలంటే గ్యారంటీ ఇవ్వాలని జీవో నెంబర్ 27 ద్వారా ప్రతిపాదన తెచ్చింది. జియోట్యాగ్ అయిన ప్రతి మిల్లర్ కూడా ప్రభుత్వానికి గ్యారెంటీ ఇస్తేనే ధాన్యాన్ని పంపించే విధంగా ప్రణాళిక రూపొందించారు. తద్వారా ఎలాంటి బకాయిలూ లేని మిల్లర్లు 10 శాతం గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. కొంతమేరకు బకాయి ఉన్న మిల్లర్లు 20శాతం గ్యారంటీ రుణాన్ని చెల్లించాలి. బకాయిపడి బ్యాడ్ రికార్డు ఉన్న మిల్లర్లు 30 శాతం గ్యారంటీ రుణాన్ని చెల్లించాలి. ఇలా మూడు గ్రేడ్‌లుగా నిర్ధారించారు. దీంతో "ఈ జీవో నెంబర్ 27 మాకొద్దు మేము గ్యారంటీ రుణాన్ని చెల్లించం.. ధాన్యాన్ని దించుకోం" అని మిల్లర్లు మొండికేస్తున్నారు. దీంతో ...6లో

ప్రాథమిక ఉపాధ్యాయులతోనే

కులగణన

6 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం



- మూడు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశం
- 36,559 మంది ఎస్జీటీలు, 3,414 మంది పీఎస్‌హెచ్‌ఎంల భాగస్వామ్యం
- 6,256 మంది ఎంఆర్సీలు, 2 వేల మంది మినిస్టీరియల్ సిబ్బంది కూడా
- ఉత్తర్వులు విడుదల
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల టీచర్లకు మినహాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల ఆరో తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కులగణన సర్వేకు ప్రాథమిక ఉపాధ్యాయులనే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఈనెల ఆరో తేదీ నుంచి మూడు వారాల వ్యవధిలో (ఈనెల 30 వరకు) కులగణన సర్వేను పూర్తి చేయడానికి ఉపాధ్యాయులతో సహా 80 వేల మంది ఎంఆర్‌వో ఉద్యోగులు, ఎండీవో, ఎంపీవోలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్ల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులకు ప్రాధాన్యత ఇస్తున్నామనీ, సిబ్బంది కొరత తీవ్రంగా ఉన్నందున ...5లో

ఎక్సైజ్ పీఎస్‌లో రాజ్ పాకాల

విచారణకు హాజరైన కేటీఆర్ బావమరిది

13లో..



భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త

పాదయాత్ర

కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపం

ప్రజల పక్షాన కొట్లాడటం మా బాధ్యత

కేసీఆర్ ఆరోగ్యంగా ఉన్నారు : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ కార్యకర్తల కోరిక మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్రను చేపడతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే.తారక రామారావు తెలిపారు. రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన శాపంగా మారిందంటూ ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశమే ఆ పార్టీకి లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కేటీఆర్ గురువారం నెటిజన్లతో సంభాషించారు. కాంగ్రెస్ పాలన, ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల ...6లో



కొత్త డైట్‌ను అందుబాటులోకి తేవాలి

ఉన్నతాధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యార్థులకు పోషకాహారం అందేలా డైట్‌లో మార్పులు, చేర్పులు చేయాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. పది రోజుల్లో కొత్త డైట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని వారిని ఆదేశించారు. ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన ...13లో



సీపీఐ(ఎం) ఎంపీ వెనిజులా పర్యటనకు

కేంద్రం నిరాకరణ

ఎఫ్‌సీఆర్ఏ క్లియరెన్స్ తరువాత కూడా అనుమతి తిరస్కరణ

- కారణం తెలపకుండానే లేఖ
- ఫాసిజానికి వ్యతిరేకంగా వెనిజులా ప్రభుత్వ కార్యక్రమం
- శివదాసన్‌కు ఆహ్వానం
- ఏఐఎడబ్ల్యూయూ ఖండన

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్ వెనిజులా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించింది. వెనిజులా ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఫాసిజానికి వ్యతిరేకంగా ప్రపంచ పార్లమెంటరీ ఫోరమ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజ్యసభ ఎంపీ వి.శివదాసన్‌కు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతిని తిరస్కరించింది. నవంబర్ 4, 5 తేదీల్లో వెనిజులా రాజధాని కారకాస్‌లో జరగనున్న 'పార్లమెంటరీ ఫోరమ్ ఎగైనెస్ట్ ఫాసిజం'లో ప్రపంచవ్యాప్తంగా 300 మంది ఎంపీలు పాల్గొననున్నారు. అందులో పాల్గొనేందుకు వెనిజులా ప్రభుత్వం భారత్ నుంచి సీపీఐ(ఎం) ఎంపీ శివదాసన్‌ను ఆహ్వానించింది. కానీ భారత ప్రభుత్వం ఆయనకు అనుమతి నిరాకరించింది. ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) క్లియరెన్స్ తరువాత కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపినప్పటికీ అనుమతి నిరాకరించారు. ఎటువంటి కారణం చెప్పకుండా కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖ అనుమతి నిరాకరించినట్టు పేర్కొంది.

రాజకీయ కోణం నుంచే క్లియరెన్స్ తిరస్కరణ : సీపీఐ(ఎం) ఎంపీ వి. శివదాసన్

గత నెలలో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపిన ఆహ్వాన లేఖలో ఈ కార్యక్రమం కోసం వి. శివదాసన్‌కు ప్రయాణాన్ని సులభతరం చేసినందుకు భారత ప్రభుత్వానికి వెనిజులా వైస్ ప్రెసిడెంట్ పెడ్రో ఇన్ఫాంటే కృతజ్ఞతలు తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. మంత్రిత్వ శాఖ చర్యకు వ్యతిరేకంగా తన నిరసనను వ్యక్తం చేస్తూ రాజ్యసభ ఎంపీ వి. శివదాసన్, విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్‌కు లేఖ రాశారు. "ఫాసిజానికి వ్యతిరేకంగా జరిగే పార్లమెంటరీ ఫోరమ్‌లో పాల్గొనడానికి నిరాకరించడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. రాజకీయ కోణం నుంచి క్లియరెన్స్ తిరస్కరించబడింది. ఇది నా హక్కులపై దాడి " అని అన్నారు. ఇండియా, వెనిజులా సంబంధాలు బాగున్నాయని, ఇటీవల ఏర్పడిన అంతర్జాతీయ సోలార్ అలయన్స్‌తో సహా అనేక బహుళ పార్శ్వ ప్లాట్ ఫారమ్‌లలో భాగమైన ఈ కార్యక్రమానికి హాజరు కావడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించడం ఆశ్చర్యంగా ఉందని శివదాసన్ లేఖలో పేర్కొన్నారు. ఇండియా, వెనిజులా అలీనోద్యమంలో సభ్యదేశాలని కూడా ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రపంచ రాజకీయ పరిస్థితులలో ఒక ముఖ్యమైన ముప్పుపై తమ అభిప్రాయాలను పంచుకోవడానికి వెనిజులా పార్లమెంటు ఆహ్వానించిన వివిధ దేశాల పార్లమెంటేరియన్ల సమావేశం ఈ కార్యక్రమమని ఆయన తెలిపారు.

గాజాపై ఆగని ఇజ్రాయిల్ నరమేధం



గాజా, బీరుట్ : సెంట్రల్ గాజాలోని డేర్ ఎల్ బాలాహ్, నుస్రత్ శరణార్థ శిబిరం, అజ్ జవైదా ఏరియాల్లో ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపించడంతో 55మంది మరణించగా, పదుల సఖ్యలో గాయపడ్డారని పాలస్తీనా వార్తా సంస్థ వఫా తెలిపింది.

55మంది మృతి

బీరుట్‌లో పదిసార్లకు పైగా దాడులు

కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ సుముఖంగా లేదన్న మికాతి

విపరీతమైన చలి, ఆకలితో అలమటిస్తున్న నిర్వాసితులు

గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం ఈ దాడులు కొనసాగాయి. మృతుల్లో మహిళలు, పిల్లలే ఎక్కువగా వున్నారు. 47 మృతదేహాలు ఆస్పత్రికి చేరుకున్నాయని అల్ అక్సా అమరవీరుల ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. నుస్రత్ ఏరియాలో ఇళ్ళపై జరిగిన దాడుల్లోనే ఎక్కువమంది మరణించారు. మొదటి దాడి నుండి బతికి బయటపడి తప్పించుకుని వెళుతున్న వారిపైనే మళ్లీ రెండోసారి దాడి జరగడంతో నష్టం ఎక్కువగా చోటు చేసుకుందని వఫా పేర్కొంది. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం గాలింపు చర్యలు కూడా మొదలయ్యాయని తెలిపింది. దక్షిణ గాజాలోని అల్ మావసి ఏరియాలో జరిగిన దాడిలో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించారు. గాజాలో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 43,259కి చేరింది. గాయపడిన వారి సంఖ్య 1,01,827కి పెరిగింది. గాజాలో ఊచకోతలను పాలస్తీనా సాయుధ గ్రూపులు తీవ్రంగా ఖండించాయి. బెయిల్ లాహియా, జాబాలియా, నుస్రత్, డేర్ ఎల్ బాలాహ్, షేక్ రాడ్వాన్ మార్కెట్ ఏరియాలతో సహా మొత్తంగా గాజాలో మారణహోమానికి ఇజ్రాయిల్ పాల్పడుతోందని విమర్శించాయి. పైగా ఇజ్రాయిల్ దూకుడు చర్యలకు అంతర్జాతీయ సంస్థలు ...6లో

కాళేశ్వరం కమిషన్ గడువు

మరోసారి పొడిగింపు?

నేడో, రేపో ఉత్తర్వులు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిషన్ గడువును మరోసారి పొడిగించే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే రెండుసార్లు కమిషన్ గడువు పెంచిన సర్కారు, మూడో సారి కూడా పెంచేందుకు ...13లో

సరోజినీదేవి ఆస్పత్రికి క్యూ

బాణసంచా పేలడంతో గాయాలతో ఆస్పత్రికి బాధితులు




నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీపావళి పండుగ వేళ బాణాసంచా పేల్చే క్రమంలో కంటికి గాయాలపాలైన పలువురు హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి క్యూ కట్టారు. గురువారం నుంచి శుక్రవారం ఉదయానికి ఆస్పత్రికి చికిత్స కోసం 48 మంది వచ్చారు. వీరిలో 8 మందికి తీవ్రగాయాలు కాగా వారిని ఆస్పత్రిలో చేర్చి చికిత్సనందిస్తున్నారు. మిగిలిన 40 మందిని అవుట్ పేషెంట్లుగా చికిత్సనందించి పంపించారు. ముందస్తు జాగ్రత్తగా ప్రత్యేకంగా వంద పడకలు, ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచినట్టు సరోజినీదేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదినీ తెలిపారు. గాయాలపై ఆస్పత్రికి వచ్చిన 48 మందిలో 20 మంది చిన్నారులుండగా, 28 మంది పెద్దలున్నారు. రోగుల్లో అత్యధికంగా 45 మంది హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, ముగ్గురు ఇతర జిల్లాలకు చెందిన వారున్నారు. అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముండటంతో దానికి తగినట్టు ఏర్పాట్లు చేసినట్టు వైద్యులు తెలిపారు. ప్రజల్లో అవగాహన పెరగడంతో గతేడాది కన్నా ఈ ఏడాది కేసులు తగ్గుతాయని ఆశిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. మరోవైపు ప్రమాదవశాత్తు కాలిన గాయాలతో ముగ్గురు చికిత్స కోసం రాగా వారికి చికిత్సనందించినట్టు ఆ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. వేడుకలు, శుభకార్యాలు, ఇతర ఉత్సవాల సమయంలో ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు. ముఖ్యంగా కంటి వంటి సున్నితభాగాలను కాపాడుకునే క్రమంలో పిల్లల పట్ల ఈ జాగ్రత్తలు మరింత అవసరమని డాక్టర్ మోదినీ సూచించారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు

లైంగిక వేధింపులు!



13లో..

మంత్రి ఉత్తమ్ పీఏనంటూ వాయిస్ మెసేజ్‌లు

ఐసీడీఎస్ సూపర్‌వైజర్లందరికీ కాల్స్ చేస్తున్నట్టు సమాచారం

రాష్ట్రంలో రూ.5,211 కోట్ల జీఎస్టీ వసూలు



- ఏపీలో రూ.3,815 కోట్లు
- దేశవ్యాప్తంగా 1.87 లక్షల కోట్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో రూ.5,211 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,815 కోట్ల జీఎస్టీ వసూలు అయ్యింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. 2024 అక్టోబర్ నెలకు సంబంధించి దేశవ్యాప్తంగా రూ.1.87 లక్షల కోట్లు జీఎస్టీ వసూలైందని, గతేడాది అక్టోబర్‌లో రూ.1,28,582 కోట్లు వసూళ్లయ్యాయని తెలిపింది. ఈ ఏడాది ఏకంగా 10.63 శాతం వసూళ్లు పెరిగాయని పేర్కొంది. తెలంగాణలో గతేడాది అక్టోబర్‌లో రూ.4,868 కోట్లు ...13లో

డైట్‌చార్జీలు పెంచాం..
పేద బిడ్డలను అక్కున చేర్చుకున్నాం

- విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజా ప్రభుత్వంలో డైట్‌చార్జీలను పెంచి పేదబిడ్డలను అక్కున చేర్చుకున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి ఉన్నతస్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. దీని ద్వారా మొత్తం 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పేద విద్యార్థుల అరిగోస తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని హాస్టళ్లలో ఉండే పిల్లలకు 40 శాతం డైట్‌చార్జీలను పెంచారని పేర్కొన్నారు. విద్యార్థులకు, విద్యార్థినులకు కాస్మోటిక్ చార్జీలను కూడా పెంచడం హర్షనీయమని తెలిపారు. డైట్ చార్జీల పెంపును ఒక బీసీ బిడ్డగా, మంత్రిగా తనకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లకాలంలో ఒక్కసారి కూడా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలు, నిరుపేద విద్యార్థుల కోసం అనునిత్యం పని చేస్తుందని స్పష్టం చేశారు. అందుకే, దీపావళి సందర్భంగా అట్టడుగు బిడ్డలను కాంగ్రెస్ సర్కారు ఆదుకున్నదని వివరించారు.

ఆస్ట్రేలియాకు శాసన సభ,మండలి సభ్యుల బృందం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరగనున్న 67వ కామన్వెల్త్ పార్లమెంట్ కాన్ఫరెన్స్ (సీపీసీ)లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి సభ్యుల బృందం వెళ్లనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి. నరసింహాచార్యులు శనివారం రాత్రికి బయలుదేరుతారు.

అనంతరం స్టడీ టూర్‌లో భాగంగా న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో బృందం పర్యటించనుంది. పర్యటన ముగించుకుని వారు ఈనెల 16న హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

పాడి రైతులకు సబ్యసాచి ఘోష్ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పాడి రైతులు పాల ఉత్పత్తిలో గణనీయ ప్రగతిని సాధించారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అభినందించారు. శుక్రవారం సచివాలయంలో ఉచిత పశువైద్య శిబిరాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. రాష్ట్రంలో పాడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్నదని తెలిపారు. 2024-25 బడ్జెట్‌లో ఈ శాఖకు రూ. 1980 కోట్లు సీఎం రేవంత్‌రెడ్డి కేటాయించారని గుర్తు చేశారు. 'రాష్ట్రీయ గోకుల్ మిషన్' సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 2210 ఉచిత పశువైద్య గర్భకోశ శిబిరాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరాల్లో దీర్ఘకాలికంగా ఎదకు రాకుండా గర్భం దాల్చని పశువులను గుర్తించి, వాటికి తగు చికిత్స చేయడం, ఎదలో ఉన్న పశువులలో కృత్రిమ గర్భధారణలు చేయడం, చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు, విటమిన్ ఇంజెక్షన్లు, పాడి పశువులలో పాల దిగుబడి పెంచేందుకు ఖనిజ లవణ మిశ్రమాలను అందించడం, ఇతర చికిత్సలు చేస్తామన్నారు. కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన దూడల ప్రదర్శన, పాడిపశువుల్లో పాల దిగుబడి పోటీలు నిర్వహించి రైతులకు కృత్రిమ గర్భధారణపై, అధిక పాల దిగుబడినిచ్చే మేలుజాతి పాడిపశువులపైన అవగాహన కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. చూలు నిలువక మళ్ళీ మళ్ళీ ఎదకు వచ్చే పశువుల్లోని గర్భకోశ వ్యాధులకు కూడా సకాలంలో చికిత్స చేయించడం వంటి విషయాల ప్రాధాన్యతను వివరిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించి ఉచిత పశువైద్య గర్భకోశ శిబిరాలు, దూడల ప్రదర్శన, పాడిపశువులలో పాల దిగుబడి పోటీలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సమీప గోపాల మిత్ర, పశువైద్య పశు వైద్యాధికారి, కార్యనిర్వహణాధికారి, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థను సంప్రదించాలని కోరారు.

ఇచ్చిన మాట ప్రకారం ఇంటింటి సర్వే

- ప్రభుత్వానికి పూర్తిగా సహకరించండి : సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బహిరంగ లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఈ నెల ఆరో తేదీనుంచి రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర సర్వేను నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రజలకు బహిరంగలేఖ రాశారు. గతేడాది ఎన్నికల సమ యంలో కామారెడ్డి బహిరంగ సభలో తమ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమక్షంలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించామని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారమే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మంత్రి వర్గ సమా వేశంలో సమగ్ర సర్వే(సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాది, రాజకీయ, కులాల సర్వే) కుల గణన చేపట్టాలని నిర్ణయించినట్టు గుర్తు చేశారు.

శాసన సభలో కూడా తీర్మానం చేసినట్టు తెలిపారు. దీనికి అనుగుణంగా జీవో 26ద్వారా కుల గణన చేసేందుకు తెలంగాణ బీసీ కమిషన్ తీర్మానాన్ని అనుసరించి బీసీ సంక్షేమ శాఖ ద్వారా రూ.150 కోట్లను విడుదల చేసేందుకు ప్రక్రియను ప్రారంభించిందని పేర్కొన్నారు. 30 లోపు సమాచార సేకరణ పూర్తి చేయాలనే ప్రణాళికలతో కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సర్వే రాబోయే కాలంలో అన్ని రకాల పథకాలను పొందేందుకు మెగా హెల్త్ చెకప్ లాగా ఉపయోగపడుతుందని తెలిపారు.

పౌరసరఫరాల వ్యవస్థను సరళీకృతం చేస్తాం

- కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాల వ్యవస్థను సరళీకృతం చేయనున్నట్టు కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆ శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌తో భేటీ అయ్యారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థాగత మార్పులు స్ఫూర్తిదాయకమని తెలిపారు. వ్యవస్థను మెరుగు పరిచడంలో కేంద్రం అండగా ఉంటుందని హామి ఇచ్చారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణా రాష్ట్రం రోల్‌మోడల్‌గా నిలుస్తోందని కొనియాడారు. రాష్ట్రంలో జనపోషణ కేంద్రాల పని తీరు భేష్ అంటూ ప్రశంసించారు. రేషన్‌డీలర్ల పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. వారి పనితీరుపై తెల్లరేషన్ కార్డు దారులు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. బియ్యం, గోధుమల సరఫరాలో నాణ్యత పరిణామాలు పాటిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చౌక ధరల డీలర్ల ఆదాయం సగటున రూ. 30 వేలు ఉందనీ, విక్రయాలను పెంచుకుంటే రూ.లక్ష దాకా ఆదాయముంటుందని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా పర్యటిం చిన చోప్రా పౌర సరఫరాల కార్యాలయం సందర్శించి, ధాన్యం కొనుగోలు వ్యవస్థాగత మార్పులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. హైదరాబాద్ ఏ.జీ కాలనిలో చౌక ధరల దుకాణాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు.

అక్కడ వినియో గదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, గోధుమల నాణ్యతను పరిశీలిం చారు. డీలర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిత్యావసర సరుకుల పంపిణీపై తెల్లరేషన్ కార్డుదారులతో ముఖాముఖి జరిపారు. తెలం గాణా ప్రభుత్వం దాన్యంకొనుగోలు అంశంలో తీసుకొచ్చిన వ్యవస్థాగత మార్పు లు బాగున్నాయంటూ అభినందించారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణా ప్రభు త్వం తీసుకొచ్చిన మార్పులు రోల్‌మోడల్‌గా ఉండేందుకు కేంద్రం దోహద డప డుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లు, అందులో తీసుకొచ్చిన వ్యవస్థాగత మార్పులను వివరించారు.

మహోన్నతంగా మహాత్మా ఘాట్

- ప్రపంచంలో ఎత్తయిన గాంధీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు
- ఎడ్యుకేషన్ హబ్‌గా ఆశ్రమం
- నమూనాలు, డిజైన్లపై ప్రభుత్వ సంప్రదింపులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మూసీ తీరంలోని బాపూఘాట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రపంచంలోనే ఎత్తయిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించిన విషయం విధితమే. అక్కడ బ్రిడ్జి కమ్ బ్యారేజీతో పాటు గాంధీ ఐడియాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. గాంధీ బోధనలు, ఆచరణ, ఆశయాలు ప్రతిబింబించేలా దాన్ని నిర్మించాలని సంకల్పించారు. దీంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఎథిక్స్ అండ్ వాల్యూస్ కోర్సులు నిర్వహించేందుకు వీలుగా ఎడ్యుకేషన్ హబ్‌గా గాంధీ ఆశ్రమాన్ని కూడా ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు కసరత్తు చేస్తున్నారు. విగ్రహాన్ని ఏ ఆకృతిలో తయారు చేయాలి? ఎంత ఎత్తుతో తయారు చేయించాలి? డిజైన్లు ఎలా ఉండాలి? తదితర అంశాలపై ఆయా రంగాల నిపుణుల సలహాలు, సూచనలను స్వీకరించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. దేశ విదేశాల్లో ఉన్న గాంధీ విగ్రహాలు, ఆశ్రమాల సమాచారం సేకరించి వెంటనే అధ్యయనం చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు సూచించినట్టు సమాచారం. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో ఏర్పాటు చేసిన 72 అడుగుల విగ్రహమే ఇప్పటి వరకు దేశంలో అత్యంత ఎత్తయింది. 2013లో దీన్ని కాంస్యంతో ఏర్పాటు చేశారు. రాష్ట్రానికి సంబంధించి అసెంబ్లీ ఎదుట ఉన్న గాంధీ విగ్రహమే ఇప్పటివరకు తెలంగాణలో పెద్దదిగా గుర్తింపు పొందింది. 2018లో గుజరాత్‌లోని నర్మదా నదీ తీరంలో 182 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేసిన సర్దార్ పటేల్ విగ్రహం ప్రపంచంలో అత్యంత ఎత్తైనదిగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా అత్యంత ఎత్తైన మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించింది. విగ్రహం ఏర్పాటులో ఎలాంటి విమర్శలకు తావు లేకుండా విస్తృత స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరపాలనీ, అవసరమైతే మేధావులు, పార్టీల నేతలు, ప్రజాప్రతినిధుల సలహాలు సూచనలను స్వీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ నిర్ణయించారు. ప్రపంచంలో అందరి మదిలో నిలిచేలా బాపూఘాట్‌లో గాంధీ విగ్రహం ఉండాలనే లక్ష్యంగా సర్కార్ అడుగులు వేస్తోంది.. ఈ నేపథ్యంలో అధికారులు విగ్రహం ఏర్పాటుకు సంబంధించి చర్యలు చేపట్టారని సమాచారం.



నిషేధాన్ని ధిక్కరిస్తూ..

బాణాసంచా కాల్చిన ఢిల్లీవాసులు

- దేశరాజధానిలో పడిపోయిన ఏక్యూఐ
- కప్పేసిన పొగమంచు
- మూడేండ్లలో అత్యంత కాలుష్య దీపావళిగా నమోదు

న్యూఢిల్లీ : కాలుష్యం కలవరపెడుతున్నా.. బాణాసంచా కాల్చివేతపై నిషేధం, ఆంక్షలు ఉన్నా.. ఢిల్లీ ప్రజలు మాత్రం అవేమీ లెక్క చేయలేదు. దీపావళి నాడు ప్రభుత్వ ఆంక్షలను ధిక్కరిస్తూ బాణాసంచా కాల్చారు. దీంతో దేశ రాజధానిలో గాలి నాణ్యతా సూచీ (ఏక్యూఐ) పడిపోయింది. అది శుక్రవారం నాటికి 362కి చేరింది. పొగమంచు ఢిల్లీని దట్టంగా కప్పివేసింది. ఈ మూడేండ్లలోనే ఢిల్లీ అత్యంత కాలుష్య దీపావళిని నమోదు చేసుకోవటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) సమాచారం ప్రకారం.. దీపావళి రోజున గురువారం నగర సగటు ఏక్యూఐ 2023లో 218గా నమోదైతే.. అది ఈ సారి 330గా ఉండటం గమనార్హం. ఇక శుక్రవారం ఉదయం 9 గంటల నాటికి ఏక్యూఐ 362కి చేరుకొని 'చాలా పేలవం' విభాగంలోకి దేశ రాజధాని చేరుకున్నది. ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఏక్యూఐ 350కి పైనే నమోదు కావటం గమనార్హం. ఏక్యూఐ సున్నా నుంచి 50 మధ్య ఉంటే 'మంచిది', 51 నుంచి 100 మధ్య ఉంటే 'సంతృప్తికరం', 101 నుంచి 200 మధ్య ఉంటే 'మధ్యస్థం', 201 నుంచి 300 మధ్య ఉంటే 'పేలవం(పూర్)', 301 నుంచి 400 మధ్య ఉంటే 'చాలా పేలవం(వెరీ పూర్)', 401 నుంచి 450 మధ్య ఉంటే 'తీవ్రం', 450 కంటే ఎక్కువగా ఉంటే 'తీవ్రమైన ప్లస్(సివియర్ ప్లస్)'గా పరిగణిస్తారు. ఢిల్లీలో పీఎం2.5 గాఢత సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములను మించిపోయింది. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ఢిల్లీలో పీఎం2.5 గాఢత క్యూబిక్ మీటరుకు 207.8 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది.

గాలి కాలుష్యం ఢిల్లీకి ప్రధాన సమస్యగా ఉన్నది. ముఖ్యంగా, దీపావళి సమయంలో కాలుష్యం అతి దారుణంగా నమోదవుతుంది. దీంతో దీపావళి సమయంలో, ఆ తర్వాత కాలుష్యాన్ని ఎదుర్కోవటానికి ఢిల్లీ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగా వరుసగా ఐదో సంవత్సరం బాణాసంచాపై సమగ్ర నిషేధాన్ని అమలు చేసింది. వాటి తయారీ, నిల్వ, అమ్మకం, వినియోగాన్ని నిషేధించింది. 377 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలనూ ఏర్పాటు చేసింది. నిషేధాన్ని ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ఇప్పటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలకు, స్థానిక సంఘాలకు వివరించారు. దీపావళి సమయంలో పరిస్థితులను పర్యవేక్షించటం కోసం ప్రభుత్వం పోలీసు బృందాలనూ ఏర్పాటు చేసింది. అయినప్పటికీ.. ఢిల్లీవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆంక్షల ఉల్లంఘన జరిగింది. జౌనాపూర్, పంజాబీ బాగ్, బురారీ, కైలాష్ ఈస్ట్, ఢిల్లీ ఈస్ట్, వెస్ట్ వంటి ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

ట్రంప్ నోట ఓటమి మాట!

- సాకులు వెతుక్కుంటూ.. మళ్లీ ఫలితాలను సవాలు చేస్తారా?
- అతని ముందున్న ప్రత్యామ్నాయాలు ఏమిటి?



సెప్టెంబర్‌లో మిచిగాన్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ నవంబర్ 5న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో తన ప్రత్యర్థి డెమొక్రాట్ కమలా హారిస్‌పై గెలవకపోతే ఫలితాలను అంగీకరించబోమని చెప్పారు. "నన్ను ఓడించడానికి వాళ్ల మోసాలకు తెగబడవచ్చు. దాని వల్లే మనం ఓడిపోతాం" అని సెప్టెంబర్‌లో జరిగిన ర్యాలీలో ట్రంప్ అన్నారు.

ఈ వారం ప్రారంభంలో, వైట్ హౌస్ కోసం నువ్వానేనా అన్నట్టుగా జరుగుతున్న రేసు చివరి వారంలోకి ప్రవేశించినందున, 'అపరిమిత అధికారాన్ని' హస్తగతం చేసుకునేందుకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నానికి వ్యతిరేకంగా హారిస్ అమెరికన్ ఓటర్లను హెచ్చరించింది. "ట్రంప్ అస్థిరమైన, ప్రతీకారంతో రగిలిపోతున్న వ్యక్తి. అపరిమిత అధికారం కోసం ఏమైనా చెయ్యటానికి సిద్ధంగా వున్న వ్యక్తి" ట్రంప్ అని అమెరికన్ వైస్ ప్రెసిడెంట్ మంగళవారం వాషింగ్టన్‌లోని ఎలిప్స్ పార్క్ లో తన ముగింపు వ్యాఖ్యలలో పేర్కొంది.

ఫలితాలను ట్రంప్ సవాలు చేస్తారా?

2020 అమెరికా ఎన్నికలలో ట్రంప్ డెమొక్రాట్ జో బైడెన్ చేతిలో ఓడిపోయిన తర్వాత తనను మోసపూరితంగా ఓడించారని, దానికి వ్యతిరేకంగా పోరాడాలని వైట్ హౌస్ సమీపంలోని ఎలిప్స్ పార్క్ వద్ద మద్దతుదారులను కోరాడు. జనవరి 6, 2021న జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ ఓడిపోయిన రెండు నెలల తర్వాత అతని వందలాది మంది మద్దతుదారులు అమెరికా రాజధానిలోని కాపిటల్ హిల్‌పై దాడి చేసి, కాల్పులు జరిపారు, అల్లర్లకు పాల్పడ్డారు.

నవంబర్ 5 ఎన్నికల రోజు ముంచుకొస్తున్న తరుణంలో ట్రంప్ ఓడిపోతే ఫలితాలపై సవాలు విసురుతారనే భయం పెరుగుతోంది. ఈసారి తేడా ఏమిటంటే, 2020లా కాకుండా ట్రంప్ ప్రస్తుత అధ్యక్షుడు కాదు. అలాగే 2020లో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి అమెరికాలో అనేక చట్టాలు అమలులోకి వచ్చాయి. పోటాపోటీగా జరుగుతున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను వివాదాస్పదం చేసేందుకు ట్రంప్ శిబిరం సిద్ధం అవుతోంది. దీనికి రిపబ్లికన్ అధికారుల నుంచి మద్దతు, వ్యూహం ఉందని గార్డియన్ రాసింది.

వాన్స్ 2020 అమెరికా ఎన్నికలని ధ్రువీకరించలేదు

ట్రంప్ రన్నింగ్ మేట్, రిపబ్లికన్ సెనేటర్ జెడి వాన్స్ 2020 ఎన్నిక సర్టిఫికేట్ ఇచ్చేది కాదని అన్నాడు. ఇటీవలి చర్చలలో ట్రంప్ నాలుగేండ్ల క్రితం ఓడిపోయారని వాన్స్ చెప్పడం మానుకున్నాడు. "ఫలితాన్ని అణచివేయడానికి చేసే ప్రయత్నం మరింత ఆలోచించదగినది, మరింత వ్యూహాత్మకమైనది, మరింత వ్యవస్థీకృతమైనది, 2020లో కంటే మరింత సమన్వయంతో ఉంటుంది" అని అధికారి గార్డియన్ కి చెప్పాడు. రాయిటర్స్ వార్తా సంస్థ ప్రకారం, ట్రంప్ కూడా కోర్టులలో హారిస్ విజయాన్ని వివాదాస్పదం చేయవచ్చు లేదా మద్దతుదారులలో ఆమె విజయం చెల్లుబాటుపై సందేహాలను లేవనెత్తవచ్చు. ఇది ఊహించలేని పరిణామాలకు దారితీస్తుంది.

నవంబర్ 5న వెలువడనున్న ఫలితాలు మరింత ఆలస్యం అవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒకవేళ ట్రంప్ ఓడిపోతున్నట్టు కనిపిస్తే, ఈ జాప్యాన్ని తన ఎన్నికను మోసపూరితంగా మార్చారనడానికి కారణంగా చూపుతూ ఎన్నికల అధికారులపై విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసే అవకాశం ఏర్పడుతుందని, అదే సమయంలో తన మద్దతుదారులను నిరసనకు ప్రోత్సహించే అవకాశం కూడా ఉందని రాయిటర్స్ రాసింది. ఫలితాల ఆలస్యం గురించి అసాధారణమైనది ఏమీ లేదు. అయితే ట్రంప్ తనకు వ్యతిరేకంగా ఓటు రిగ్గింగ్ చేయబడిందని, అందుకు సాక్ష్యంగా స్లో కౌంట్ లో ఏదో తప్పు ఉందని ప్రకటించాలని యోచిస్తున్నట్టు రోలింగ్ స్టోన్, అమెరికన్ మాస పత్రిక అక్టోబర్‌లో నివేదించింది.

ట్రంప్‌ను పైకి ఎత్తుతున్న ఎలన్ మస్క్

రిపబ్లికన్‌లు ముందస్తుగా కీలకమైన స్వింగ్ స్టేట్‌లలో 100 కంటే ఎక్కువ వ్యాజ్యాలను దాఖలు చేశారు. పౌరులు కానివారు పెద్ద సంఖ్యలో ఓటు వేస్తారనే నిరాధారమైన వాదనలతో సహా ఎన్నికల అనంతర సవాళ్లకు పునాది వేశారు. ట్రంప్‌కు బహిరంగంగా మద్దతు ఇస్తున్న బిలియనీర్ ఎలన్ మస్క్ సోషల్ మీడియాలో 'పౌరులు కానివారు' ఓట్లు వేస్తున్నారని చేసిన ప్రచారం విపరీతంగా ప్రజల్లోకి పోయిందని వాషింగ్టన్ పోస్ట్ విశ్లేషించింది. రెండు పార్టీలు - రిపబ్లిక్ మరియు డెమొక్రాట్ - ఓట్ల లెక్కింపును పర్యవేక్షించడానికి , అవకతవకలను నివేదించడానికి వేలాది మంది శిక్షణ పొందిన వాలంటీర్లను పంపాలని ప్లాన్ చేస్తున్నాయి.

ఓట్ల లెక్కింపు సజావుగా జరగటానికి కొత్త చర్యలు

2020నాటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయకుండా ఉండటానికి అనేక కొత్త భద్రతా చర్యలను తీసుకోవటం జరిగింది. 2022లో ఆమోదించబడిన చట్టం - ఎలక్టోరల్ కౌంట్ రిఫార్మ్ యాక్ట్ - ఎన్నికల ఓటుపై అభ్యంతరాలను పరిమితం చేస్తుంది. ఉపాధ్యక్షుడు ఓట్ల గణనలను మార్చలేరని స్పష్టం చేసింది. రాష్ట్ర గవర్నర్లు మాత్రమే ఓటర్లను ధ్రువీకరించగలరని కూడా చట్టం నిర్దేశిస్తుంది. 2020 జనవరి 6 తిరుగుబాటు తరువాత కాంగ్రెస్ ఈ చట్టాన్ని రూపొందించింది.

ఎన్నికల సమగ్రతను బలపరిచే అనేక కోర్టు తీర్పులు ఇటీవల వెలువడినాయి. అమెరికన్ పాలనాయంత్రాంగం రాష్ట్ర ఎన్నికల అధికారుల అప్రమత్తతను పెంచింది. చట్టాన్ని అమలు చేసే సంస్థలచే దూకుడు చర్యను ప్లాన్ చేసింది. స్పష్టంగా చెప్పాలంటే, ఎన్నికల సవాళ్లు కాంగ్రెస్‌కు చేరుకుంటే, ట్రంప్‌కు అదనపు అడ్డంకులు ఎదురవుతాయి.

(మింట్ సౌజన్యంతో)

మతతత్వ శక్తులను ఓడించాలి

- రాష్ట్ర ప్రగతిని అణగదొక్కే ప్రయత్నాలు
- ప్రజలు మానవత్వాన్ని ఆదరించాలి : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేరళ సీఎం విజయన్ పిలుపు



తిరువనంతపురం : కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు సీఎం పినరయి విజయన్ ప్రజలను అప్రమత్తం చేశారు. మత రాజకీయ శక్తులు రాష్ట్ర అభివృద్ధిని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా ప్రజలు మానవత్వాన్ని ఆదరించాలని ఆయన కోరారు. పునరుజ్జీవనం, జాతీయ ఉద్యమాల పునాదులపై రాష్ట్ర నిర్మాణం జరిగిందనీ, రాష్ట్ర సాంస్కృతిక చరిత్రను ప్రజలు లోతుగా పరిశోధించాలని సీఎం సూచించారు. ఆరోగ్యం, విద్యా రంగంలో రాష్ట్ర ప్రగతిని విజయన్ నొక్కి చెప్పారు. "ఈ రోజు కేరళ ఆవిర్భావ దినోత్సవం. రాష్ట్రం ఏర్పడి 68 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ కాలంలో గణనీయమైన విజయాలు సాధించగలిగాం. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం అనే విలువలను ఎల్లవేళలా కాపాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలు, సంక్షేమంలో రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఆరోగ్య విద్యా రంగాల్లో సాధించిన విజయాలతో కేరళ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. జాతీయ, పునరుజ్జీవనోద్యమం వేసిన పునాది ఆధారంగానే వీటన్నింటినీ సాధించుకున్నాం. మతతత్వ రాజకీయ శక్తులు రాష్ట్ర ప్రగతిని దెబ్బ తీసే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. సవాళ్లను స్వీకరించి.. కేరళ కీర్తిని ప్రకాశింపజేద్దాం. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా మానవత్వాన్ని అలవర్చుకొని అందరం ముందుకు సాగుదాం. అందరికీ కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు" అని విజయన్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

కేరళలోని వాయనాడ్ కొండచరియల బాధితుల పునరావాసం విషయంలో కేంద్రం నుంచి ఆర్థిక సాయం లేకపోవటాన్ని రాష్ట్రావతరణ దినోత్సవానికి ఒకరోజు ముందు విజయన్ తప్పుబట్టారు. మోడీ సర్కారు తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. రాష్ట్రం పట్ల కేంద్రం దారుణమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నదని వివరించారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల కేంద్రంతో పాటు కాంగ్రెస్ సైతం విముఖంగా ఉన్నదని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన ఇతర రాష్ట్రాలకు కేంద్రం సత్వరమే సహాయమందించి, దక్షిణాది రాష్ట్రమైన కేరళకు ఏమీ అందించలేదని విజయన్ పేర్కొన్నారు. దీని వెనక ఉద్దేశపూర్వక, రాజకీయ నిర్లక్ష్యం కనిపిస్తున్నదని వివరించారు.



ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర పెంపు

19 కేజీల ఎల్‌పీజీ రూ.62 పెరుగుదల

- తక్షణమేఅమల్లోకి
- చిరువ్యాపారులు,వినియోగదారులపై భారం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధరను పెంచుతున్నట్టు ప్రకటించాయి. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 62 పెరిగింది. ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 15 పెరిగింది. ఈ పెరిగిన ధరలతో 19 కేజీల ఎల్‌పీజీ సిలిండర్ ధర ఢిల్లీలో రూ.1,802, ముంబయిలో రూ.1,754.50, కోల్‌కత్తాలో రూ.1,911.50, చెన్నైలో రూ.1,964.50గా ఉన్నది. దీంతో చిరు వ్యాపారులతో పాటు పెద్ద వ్యాపారులపైనా భారం పడనుంది. ఈ పెంపు తక్షణమే అమల్లోకి రానుంది. ఈ తాజా ధరల పెంపు రెస్టారెంట్లు, హోటళ్లు, రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్‌పీజీపై ఆధారపడే ఇతర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపనుంది. నిర్వహణ ఖర్చుల పెరుగుదల అంతిమంగా వినియోగదారులపై అధిక ధరలకు దారితీస్తుంది. అక్టోబర్ 2024లో చమురు మార్కెటింగ్ కంపెనీలు వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.48.50 పెంచాయి. దీంతో 19 కిలోల సిలిండర్ ధర రూ.1,691.50 నుంచి రూ.1,740కి పెరిగింది. ఐదు కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్‌పై కూడా రూ.12 పెరిగింది. సెప్టెంబర్ 1న మరోసారి చమురు మార్కెటింగ్ కంపెనీలు 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్‌పై రూ. 39 పెంచాయి. దీంతో ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ రిటైల్ విక్రయ ధర రూ.1,691.50కి పెరిగింది.

స్పెయిన్‌లో వరద బీభత్సం

- సునామీని గుర్తుకు తెస్తున్న దృశ్యాలు
- 158కి పెరిగిన మృతులు

బారియో డీ లా టోరె, స్పెయిన్ : కనివినీ ఎరుగని రీతిలో స్పెయిన్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు, వరద బీభత్సంతో ఇప్పటివరకు 158మంది మరణించారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే వుంది. దీంతో ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం వుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద బురదలో చిక్కుకుపోయిన కార్లలో, నానిపోయి కూలిన భవనాల్లో ఇంకా మృతదేహాలు వున్నాయేమోనని గాలిస్తున్నారు. వరదల ధాటికి తూర్పు వలెన్సియా ప్రాంతం బాగా దెబ్బతింది.



అక్కడే 155 మరణాలు నమోదయ్యాయి. సునామీని గుర్తు తెచ్చేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. కార్లు ఒకదానిపైకి ఒకటి ఎక్కేసి దొంతరలా కనిపిస్తున్నాయి. కూకటి వేళ్లతో సహా కూలిపోయిన వృక్షాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, చెల్లాచెదురైన ఇళ్లల్లోని సామాగ్రి ఇవన్నీ కూడా బురదలో కూరుకుపోయి కనిపిస్తున్నాయి. మధ్యధరా సముద్రతీరంలోని బార్సిలోనా దక్షిణ ప్రాంతమైన వలెన్సియాలో వీధులన్నీ అదే రీతిలో దర్శనమిస్తున్నాయి. ఇరుకైన వీధులను ముంచెత్తిన బురదతో కూడిన వరద ప్రవాహం తీవ్ర విపత్తుకు దారి తీసింది. అకస్మాత్తుగా సంభవించిన వరదల వల్ల వంతెనలు కూలిపోయాయి. రహదారులు గుర్తు పట్టడానికి వీల్లేకుండా ధ్వంసమయ్యాయి. ముందుగా బాధితులకు సాయమందించడమే తమ ప్రధాన కర్తవ్యంగా వుందని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ చెప్పారు.

రష్యాకు సాయం చేస్తున్నారంటూ...

- భారత్‌కు చెందిన 19 ప్రయివేటు సంస్థలు, ఇద్దరు భారతీయులపై అమెరికా ఆంక్షలు



వాషింగ్టన్ : భారత్‌కు చెందిన 19 ప్రయివేటు సంస్థలపై, ఇద్దరు భారతీయులపై ఆంక్షలు విధిస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధానికి సహాయ సహకారాలు అందిస్తున్నారన్న కారణంతో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 400 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధిస్తూ జాబితా రూపొందించింది. ఆంక్షలు పొందిన భారత కంపెనీల్లో ఫుట్రెవో,అసెండ్ యావియేషన్, టిఎస్ఎండి గ్లోబల్, మాస్క్ ట్రాన్స్ వున్నాయి. రష్యన్ కంపెనీలకు ఆంక్షలు విధించిన ఉత్పత్తులను విక్రయిస్తున్నట్టు ఈ కంపెనీలపై ఆరోపణలు చేశారు. డ్రోన్‌లు, విమానాల తయారీ సంస్థలు కూడా వీటిల్లో వున్నాయి. ఈ మేరకు అమెరికా విదేశాంగ మంత్రి బుధవారం ఒక ప్రకటన చేసింది. చైనా, భారత్, కజకస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇంకా తదితర దేశాలు వున్నాయి. ఉక్రెయిన్‌పై సాగించే యుద్ధానికి అవసరమైన ఆయుధ వ్యవస్థలను ఈ కంపెనీలు అందచేస్తున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూను హత్య చేయడానికి కుట్ర పన్నడంలో భారత జాతీయుని పాత్ర వుందన్న ఆరోపణలపై అమెరికాలో ఇప్పటికే దర్యాప్తు జరుపుతోంది.

పరిమిత వనరులతో వ్యూహాత్మ స్వయంప్రతిపత్తిని, అంతర్జాతీయ వాణిజ్యాన్ని దిశా నిర్దేశం చేస్తున్న భారతీయ కంపెనీలకు ఈ ఆంక్షలు సవాళ్లను సృష్టిస్తాయని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ వ్యాఖ్యానించారు. ఈసారి గణనీయమైన సంఖ్యలో భారత కంపెనీలను లక్ష్యంగా చేసుకుని అమెరికా విదేశాంగ శాఖ తీసుక్ను నిర్ణయం భారత పరిశ్రమలను, ప్రభుత్వాన్ని భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి అప్రమత్తం చేస్తోందని సంబంధిత వర్గాలు వ్యాఖ్యానించాయి.

డెమ్‌చాక్‌లో భారత్, చైనా బలగాల గస్తీ షురూ



న్యూఢిల్లీ : తూర్పు లడఖ్‌లోని డెమ్‌చాక్‌లో భారత్, చైనా బలగాలు సమన్వయ గస్తీని ఆరంభించాయని సైనిక వర్గాలు శుక్రవారం ధృవీకరించాయి. డెప్సాంగ్‌లో కూడా త్వరలోనే గస్తీ ప్రారంభమవుతుందని తెలిపాయి. ఇరు ప్రాంతాల్లో బుధవారం బలగాల ఉపసంహరణ పూర్తయిన నేపథ్యంలో ఈ గస్తీ చర్యలు ఆరంభించారు. దీంతో 2020 మేలో ప్రతిష్టంభన నెలకొన్న పాయింట్ల వద్ద నుండి పూర్తిగా బలగాలన్నీ వైదొలగినట్లైంది. దీపావళి సందర్భంగా గురువారం వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) పొడవునా పలు సరిహద్దు పాయింట్ల వద్ద ఇరు దేశాల బలగాలు మిఠాయిలు పంచుకున్నారు. నాలుగేళ్ళకు పైగా ఇరు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెర దించుతూ ఉభయ పక్షాల మధ్య ఒప్పందం కుదిరిందని గత నెల 21న ఢిల్లీలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ చెప్పారు.

వాయుకాలుష్యంతో 16 లక్షల మరణాలు

2021 ఎఫెక్ట్

- అత్యంత వేడి ఏడాదిగా '2023'
- రూ.11 లక్షల కోట్లకుపైగా
- విలువైన పని గంటలు నష్టం : లాన్సెట్ నివేదిక



న్యూఢిల్లీ : దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ప్రధానమైనది వాయు కాలుష్యం. దీని కారణంగా భారత్‌లో లక్షల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నాయి. 2021లో గాలి కాలుష్యం కారణంగా 16 లక్షల మంది మరణించారు. ఈ విషయాన్ని లాన్సెట్ నివేదిక వెల్లడించింది. 'ది లాన్సెట్ కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ ఛేంజ్ 2024' పేరిట ఈ నివేదిక విడుదలైంది.

లాన్సెట్ నివేదిక సమాచారం ప్రకారం.. "భారత్‌లోని వాయు కాలుష్యంలో బొగ్గు, ద్రవ సహజ వాయువు వంటి శిలాజ ఇంధనాల నుంచి వెలువడే ఉద్గారాల వాటా 38 శాతంగా ఉన్నది. శిలాజ ఇంధనాలు, బయోమాస్‌ల నిరంతర వినియోగం వాయుకాలుష్యానికి ప్రధాన కారణంగా ఉన్నది. ఇవి శ్వాసకోశ, హృదయ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల క్యాన్సర్, మధుమేహం, నరాల సంబంధిత సమస్యలు, గర్భధారణ సమస్యలకు కారణమవుతాయి. అవి చివరకు మరణాలకు దారి తీస్తాయి. 2000 ఏడాది నుంచి భారత్‌లో పునరుత్పాదక ఇంధన వినియోగం పెరిగింది. ఇది 2022లో దేశ విద్యుత్‌లో రికార్డు స్థాయిలో 11 శాతం అందించింది. అయితే, భారత్‌లోని విద్యుత్ ఉత్పత్తిలో ఇప్పటికీ బొగ్గు వాటానే అధికంగా 71 శాతంగా ఉన్నది. ఇది స్వచ్ఛమైన ఇంధన వనరులకు మారాల్సిన పరిస్థితిని నొక్కి చెప్తున్నది. 2022లో భారత్ 15.8 శాతం ప్రపంచ వినియోగ-ఆధారిత పీఎం 2.5 ఉద్గారాలను, 16.9 శాతం ఉత్పత్తి ఆధారిత ఉద్గారాలను కలిగి ఉన్నది. ఇది భారత్‌ను ప్రపంచ వ్యాప్తంగా పీఎం 2.5 రెండో ఉద్గారిణిగా మారేలా చేసింది.

ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేడిగా ఉన్న సంవత్సరంగా 2023 గుర్తించబడింది. ఆ ఏడాది తీవ్రమైన కరువులు, వేడి గాలులు, కార్చిచ్చులు, తుఫానులు, వరదలకు దారి తీసింది. ప్రజల ఆరోగ్యాన్ని, జీవనోపాధిని గణనీయంగా దెబ్బ తీసింది. దీని ప్రభావం భారత్‌పైనా కనబడింది. 2014-2023 మధ్య దేశంలోని శిశువులు ఏడాదికి సగటున 7.7 హీట్‌వేవ్ రోజులను ఎదుర్కొన్నారు. 65 ఏండ్లు పైబడిన పెద్దల విషయంలో ఇది 8.4 రోజులుగా ఉన్నది. 1990-99 మధ్య దశాబ్దంతో పోలిస్తే ఇది శిశువుల విషయంలో 47 శాతం, పెద్దల విషయంలో 58 శాతం ఎక్కువ కావటం గమనార్హం. 2023లో వేడి ప్రభావంతో భారత్ 18,100 కోట్ల పని గంటలను కోల్పోయింది. 1990-99 దశాబ్ద సగటు కంటే ఇది 50 శాతం అధికం. దీని కారణంగా దేశంలోని పౌరులకు రూ.11 లక్షల కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని అంచనా. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మారుతున్న వాతావరణ పరిస్థితులు డెంగ్యూ, మలేరియా, వెస్ట్‌నైల్ వైరస్ సంబంధిత వ్యాధులు, వైబ్రియోసిస్ వంటి ప్రాణాంతక రోగాల వ్యాప్తికి దారి తీస్తాయి. భారత్‌లో డెంగ్యూ వ్యాప్తి 1950 నుంచి 2014-23 మధ్య 85 శాతం పెరిగింది" అని నివేదిక పేర్కొన్నది.

ఈ నివేదికపై కాంగ్రెస్ స్పందించింది. దేశంలోని పాలనాపరమైన ప్రాధాన్యతల్లో భాగంగా గాలికాలుష్యంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ సూచించారు. వ్యవసాయ వ్యర్థాలను కాల్చటం అరికడితే సరిపోదని ఢిల్లీ కాలుష్యాన్ని ఉటంకిస్తూ ఆయన పేర్కొన్నారు. వాయు(కాలుష్యం నివారణ నియంత్రణ) చట్టం, 1981'ని పునరుద్ధరించాల్సిన అవసరమున్నదని ఎక్స్ వేదికగా ఆయన సూచించారు.

మా ఫిర్యాదులపై విచారణ కోసం కోర్టును ఆశ్రయిస్తాం

ఈసీని హెచ్చరించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయనే తమ ఫిర్యాదులపై విచారణ కోసం న్యాయపరమైన మార్గాలను అన్వేషిస్తామని, కోర్టును కూడా ఆశ్రయిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను శుక్రవారం హెచ్చరించింది. హర్యానా ఎన్నికల్లో అక్రమాలపై తమ ఫిర్యాదులను ఈసీ తిరస్కరించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. తటస్థంగా ఉంటడం అనే అనే లక్షణాన్ని కూడా ఈసీ వదులుకుందని కాంగ్రెస్ మండిపడింది. తమ ఫిర్యాదులను ఇసి తిరస్కరించడం మొత్తం ఫలితాల విశ్వసనీయతపై అనుమానం వ్యక్తమవుతుందని పేర్కొంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఈసీకి లేఖ రాసింది. ఈ లేఖపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు కెసి వేణుగోపాల్, అశోక్ గెహ్లాట్, భూపీందర్ హుడా, జైరాం రమేష్, పవన్ ఖేరా, అజయ్ మాకెన్, అభిషేక్ సింఘ్వీ, ఉదయ్ భాన్, పర్తాప్ బజ్వా అనే తొమ్మిది మంది సంతకాలు చేశారు. 'కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదులపై ఇసి ప్రతిస్పందనను జాగ్రత్తగా అధ్యయనం చేశాం. హర్యానా ఎన్నికలకు ఈసీ క్లీన్‌చిట్ ఇచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఈసీ ప్రతిస్పందనపై స్పందించాలని మేం ముందుగా అనుకోలేదు. అయితే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఈసీ ఉపయోగించిన భాష, కాంగ్రెస్‌పై ఇసి చేసిన ఆరోపణలు మమల్ని స్పందించేవిధంగా చేశాయి' అని లేఖలో నాయకులు పేర్కొన్నారు. అలాగే, తమ ఫిర్యాదులపై ఈసీ ఇచ్చిన ప్రత్యుత్తరం అణిచివేసే స్వరంలో ఉందని విమర్శించారు. ఇసి తటస్థత అనే లక్షణాన్ని వదిలివేసుకుంటుందనే అభిప్రాయం కలుగుతోందని, నిర్ణయాలను తీసుకోవాల్సిన వ్యక్తులు ఫిర్యాదులు చేసే పార్టీపై దాడి చేయరని లేఖలో కాంగ్రెస్ నాయకులు లేఖలో అన్నారు.

సంపాదకీయం

రష్యాపై ఉక్రోశం-అమెరికా మరిన్ని ఆంక్షలు



ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక చర్యకు 980 రోజులు నిండాయి. అది ఎప్పుడు ముగుస్తుందో ఎలా అంతమవుతుందో తెలియని స్థితి. అమెరికా నాయకత్వంలోని నాటో కూటమి దేశాలు ఎన్ని ఆయుధాలు, డాలర్లు ఎన్ని కుమ్మరించినా రోజురోజుకూ కొత్త ప్రాంతాల్లోకి రష్యా సేనలు చొచ్చుకుపోతున్నాయి. యుద్ధరంగంలో విజయం మాట అటుంచి నిలదొక్కుకొనేందుకే ఇబ్బందులు పడుతున్నాయని జెలెన్‌స్కీ దళాల గురించి ఎకనమిస్ట్ వంటి పత్రికలు రాస్తున్నాయి. అయినప్పటికీ మరోసారి చూడవలే అన్నట్లుగా అమెరికా రంగంలోకి దిగింది. ఇప్పటికే వేలాది కంపెనీలు, వ్యక్తుల మీద, రష్యా మీద అనేక ఆంక్షలను ప్రకటించిన అమెరికన్లు బుధవారం నాడు చైనాతో సహా పన్నెండు దేశాలకు చెందిన మరో నాలుగువందల కంపెనీలు, కొందరు వ్యక్తుల మీద కొత్తగా ఆంక్షలు విధించారు. వీటిలో మన దేశానికి చెందిన పందొమ్మిది కంపెనీలు, ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. అటు ప్రజోపయోగానికి, దాన్నే మిలిటరీ అవసరాలకు వినియోగించే కీలక, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను ఈ కంపెనీలు రష్యాకు సరఫరా చేస్తున్నాయన్నది అమెరికా ఆరోపణ. తమ సాంకేతిక పరిజ్ఞాన అపహరణ, దిగుమతి, కొన్ని రకాల పరికరాలను, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న వాటిని భారత కంపెనీలు రష్యాకు మళ్లించి అక్కడ డ్రోన్ల వంటి ఆయుధాల తయారీకి తోడ్పడుతున్నాయని అంటోంది. అలా జరుగుతోందో లేదో ఎలాంటి రుజువులు లేవు.

అయితే ఏ నిబంధనల ప్రకారం అమెరికా వందల కోట్ల డాలర్ల ఆధునిక ఆయుధాలు, నగదు ఉక్రెయిన్‌కు అందిస్తున్నట్లు? అడ్డగోలు వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇది రాసిన సమయానికి ఈ పరిణామంపై మన దేశ స్పందన లేదు. ఉక్రెయిన్ వివాదంలో తటస్త వైఖరితో ఉన్న సంగతి తెలిసిందే. ఎటూ మొగ్గకపోయినప్పటికీ అమెరికా ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు, ఎరువులు, ఇతర వస్తువులు, మిలిటరీ సామగ్రి, ఆయుధాలను మనదేశం కొనుగోలు చేస్తున్నది.అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా ఇప్పటి వరకు రష్యా ఆయుధ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయమూ కలిగినట్లు వార్తలు లేవు.

అయితే ఏ నిబంధనల ప్రకారం అమెరికా వందల కోట్ల డాలర్ల ఆధునిక ఆయుధాలు, నగదు ఉక్రెయిన్‌కు అందిస్తున్నట్లు? అడ్డగోలు వ్యవహారం తప్ప మరొకటి కాదు. ఇది రాసిన సమయానికి ఈ పరిణామంపై మన దేశ స్పందన లేదు. ఉక్రెయిన్ వివాదంలో తటస్త వైఖరితో ఉన్న సంగతి తెలిసిందే. ఎటూ మొగ్గకపోయినప్పటికీ అమెరికా ఆంక్షలను ఖాతరు చేయకుండా రష్యా నుంచి పెద్ద ఎత్తున ముడి చమురు, ఎరువులు, ఇతర వస్తువులు, మిలిటరీ సామగ్రి, ఆయుధాలను మనదేశం కొనుగోలు చేస్తున్నది. అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా ఇప్పటి వరకు రష్యా ఆయుధ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయమూ కలిగినట్లు వార్తలు లేవు. అదే విధంగా అంతకు ముందు కంటే ముడి చమురును కూడా ఎక్కువగా ఎగుమతి చేస్తోంది.ఈ కారణంగానే ఉక్రోశంతో మరిన్ని ఆంక్షలకు అమెరికా తెగబడుతోంది.ఉత్తర కొరియా నుంచి వచ్చిన సైనికులు రష్యా తరపున ఉక్రెయిన్‌లో దాడులు చేస్తున్నారని కూడా కొద్ది రోజులుగా కొత్త పల్లవి అందుకుంది. ఉక్రెయిన్‌లో నాటో దేశాలు వివిధ దేశాల నుంచి రప్పించిన కిరాయి మూకలు రష్యన్ల మీద దాడులకు వినియోగిస్తున్నారనే వార్తలు వెలువడిన పూర్వరంగంలో రష్యా మీద ఎదురుదాడికి ఉత్తర కొరియాను లాగటం తప్ప ఇంతవరకు అలాంటి ఆధారాలున్నట్లు అమెరికా కూడా చెప్పటం లేదు.

రానున్న వారాల్లో వస్తారని ఒకసారి, ఇప్పటికే పదివేల మందిని సిద్ధం చేశారు, శిక్షణ ఇప్పిస్తున్నారంటూ మరోసారి పెంటగన్, సిఐఏ కట్టుకథలను వ్యాపింపచేస్తున్నాయి.అమెరికా రక్షణ మంత్రి లాయడ్ ఆస్టిన్ పైకి ఎన్ని కబుర్లు చెప్పినా, యుద్ధరంగంలో ఉన్న ఉక్రెయిన్ మిలిటరీ కమాండర్లు, పశ్చిమదేశాలకు చెందిన వారు రానున్న ఆరునెలల్లో రష్యా దళాలను అడ్డుకోవటం, అసలు పోరు ఎటుపోతున్నదో అర్థం కావటం లేదంటూ ప్రయివేటు సంభాషణల్లో చెబుతున్నారని ఎకనమిస్ట్ పత్రిక రాసింది. ఒకటి రెండు చోట్ల పుతిన్ సేనలను నిలువరించినా అనేక ప్రాంతాల్లో రష్యా చొచ్చుకుపోతున్నదని పేర్కొన్నది. కొన్నిసార్లు పెద్దగా సాధించిందేమీ లేకపోయినా మొత్తం మీద రష్యా సేనలు ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలో ముందుకు పోతున్నాయని అమెరికా అగ్రపత్రిక న్యూయార్క్ టైమ్స్ కూడా రాసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు రష్యా అదుపులోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాలలో సగం గత మూడునెల్లో సాధించినవే అని, ఉక్రెయిన్ సేనలు డాన్‌బాస్ ప్రాంతంలో నిలవటం కష్టమని నిపుణులను ఉటంకిస్తూ ఆ పత్రిక రాసింది.

తాను నేరుగా రంగంలోకి దిగేందుకు నాటోకూటమి భయపడుతున్నది. ఎన్ని ఆయుధాలిచ్చినా బూడిదలో పోసిన పన్నీరుగా మారుతున్నాయి.ఉక్రెయిన్‌లో రోజురోజుకూ శిక్షణ పొందిన సైనికుల సంఖ్య కూడా తగ్గుతున్నది, నాటో ఇచ్చిన ఆధునిక ఆయుధాలను జెలెన్‌స్కీ సేనలకు అందచేస్తే అవెక్కడ రష్యన్ల పరం అవుతాయోమోన్న భయం కూడా ఉంది.అందుకే వినియోగించేందుకు నిపుణుల పేరుతో అమెరికా, ఇతర దేశాల నుంచి పరిమితంగా మిలిటరీని దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.అక్కడ పరిస్థితి ఇలా ఉంది గనుకనే అమెరికా ఉక్రోశం రోజు రోజుకూ పెరిగిపోతున్నట్లు కనిపిస్తోంది.

కరువును జయించేదెలా?



కరువులు దేశాభివృద్ధికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. అడవుల నిర్మూలన, వాతావరణ ప్రతికూలతలు, మానవ చర్యలు వెరసి, సారవంతమైన, బంజరు భూములు కూడా ఎడారులుగా తయారవుతున్నాయి! సహజంగా ఒక ప్రాంతంలో ఎక్కువ కాలం వర్షాలు కురవక రావాల్సినంత పంట దిగుబడి రాకపోతే దాన్ని కరువు అంటారు. భారత వాతావరణ శాఖ తెలిపినట్టు ఏ ప్రదేశంలోనైనా సరే సగటు వార్షిక వర్షపాతం 25 శాతం కంటే తక్కువగా ఉంటే ఆ ప్రాంతం కరువులో ఉన్నట్టే లెక్క. సగటున ఇండియా 118 సెం.మీ వార్షిక వర్షపాతాన్ని పొందుతున్నది. సగటు స్థాయి కంటే 25 నుండి 50శాతం మధ్య వర్షపాతం ఉంటే మితమైన కరువు, సగటు కంటే 50శాతం ఎక్కువ వర్షపాతం తగ్గినప్పుడు తీవ్రమైన కరువు ఏర్పడుతుంది. చాలాకాలం పాటు తగినంత వర్షపాతం లేనప్పుడు వాతావరణ కరువు, నేలలో తేమ, వర్షపాతం లేనప్పుడు వ్యవసాయ కరువు సంభవిస్తాయి. నదులు, సరస్సులు, జలాశయాలు, వివిధ రిజర్వాయర్లు లేదా నిల్వలలో ఉండాల్సిన నీటి మట్టం కంటే దిగువకు పడిపోయినప్పుడు కూడా ఇలాంటి పరిస్థితులు దాపురిస్తాయి. నీటి కొరత వల్ల జలకరువు, తగినంత నీటి సరఫరా లేని కారణంగా సహజ పర్యావరణ వ్యవస్థ ఉత్పాదకత తక్కువగా ఉన్నట్లయితే పర్యావరణ కరువులు ఏర్పడతాయి.

స్వాతంత్ర్యం తరువాత మనదేశం 1965 -67, 1972 -73, 1979-80, 1985-88 ఏండ్లలో పెద్ద కరువులను ఎదుర్కొన్నది. మన వ్యవసాయం ఎక్కువగా రుతుపవనాల వర్షపాతంపై ఆధారపడి ఉంటుంది. వ్యవసాయ యోగ్యమైన భూమిలో దాదాపు మూడింట రెండు వంతులు వర్షాధారమే. మొత్తం భౌగోళిక ప్రాంతం 32.872 కోట్ల హెక్టార్లలో 29.7 శాతం అంటే సుమారు 9.785 కోట్లు హెక్టార్ల విస్తీర్ణం భూక్షీణతకు గురైంది. మొత్తం విస్తీర్ణంలో 16 శాతం, జనాభాలో 12 శాతం మంది కరువు బారిన పడుతున్నారు. సగటు కరువు పీడిత ప్రాంతం 10 లక్షల చదరపు కి.మీ లేదా దేశంలోని మొత్తం భూభాగంలో మూడింట ఒక వంతుగా ఉండొచ్చని నిపుణుల అంచనా. భారత్‌లో మొత్తం 29 రాష్ట్రాలకుగాను 26 రాష్ట్రాల్లో గత పదేళ్లలో ఎడారి ప్రాంతం బాగా పెరిగింది. రాజస్థాన్, ఢిల్లీ, గోవా, మహారాష్ట్ర, జార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రోజురోజుకీ సారవంతమైన భూములు తగ్గిపోతున్నాయి. మిజోరంలో లంగ్లే ప్రాంతంలో అధికంగా నేల పెలుసుబారుతున్నది. 2003 నుండి 2011 మధ్యలో అత్యధికంగా18 లక్షల హెక్టార్ల భూమి ఎందుకూ పనికిరాకుండా పోయింది. తెలంగాణలో 31.40 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 14.35 శాతం భూములు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి అనంతపురం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అధికంగా ఎడారీకరణ జరుగుతోంది.

దీనివల్ల వచ్చే నష్టాల్ని గమనిస్తే గనుక..ఈ కరువుల వలన వృక్ష సంపద నాశనమవుతుంది. నేలకోతకు గురవుతుంది. నీరు కలుషితం అవుతుంది. కొన్నిరకాల జాతులు నశించి జీవవైవిధ్యం దెబ్బతింటుంది. ఈ కరువు సమాజంలోని బలహీన వర్గాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. పేదరికం పెరుగుతుంది. కరువు ఫలితంగా సాగు విస్తీర్ణం తగ్గి వ్యవసాయోత్పత్తి తగ్గుతుంది. ప్రజల కొనుగోలుశక్తి మందగిస్తుంది. వ్యవసాయ కార్మికులకు ఉపాధి ఉండదు, తాగునీరు, పశుగ్రాసం, ఆహార కొరత ఏర్పడుతుంది.ప్రజలు పోషకాహార లోపానికి గురవుతారు. జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసబాట పట్టాల్సి వస్తుంది. ఆహార భద్రత సమస్యలు ఏర్పడతాయి. ఇది మొత్తంగా దేశ జీడీపీ మీద ప్రభావం చూపి ద్రవ్యోల్బణానికి కారణమవుతుంది. అయితే దీనికి పరిష్కార మార్గాలను ప్రభుత్వాలు అన్వేషించాలి. నదులను అనుసంధానం చేసి, మరిన్ని రిజర్వాయర్లు, ఆనకట్టల నిర్మాణానికి రూపకల్పన జరగాలి. కరువు నిరోధక పంటలను ప్రోత్సహించాలి. అడవులను కాపాడుకుంటూనే, వృక్షాలను పెంచి పచ్చదనం పెంపుచేయాలి. నీటి సంరక్షణలో భాగంగా వర్షపు నీరు నదులు, సముద్రాలలో కలసిపోకుండా చెక్ డ్యామ్‌లను నిర్మించాలి. నేల స్థిరీకరణ కోసం షెల్టర్ బెల్టలను, వుడ్‌లాట్‌లను ఉపయోగించాలి. వుడ్‌లాట్ అనేది చెట్ల చిన్న ప్రాంతం. వుడ్‌లాట్‌లు నేల కోతను నిరోధించడం లో స్థానిక వాతావరణాన్ని మెరుగుపరచడంలోను, గాలిని శుద్ధి చేయడంలోనూ సహాయపడతాయి. భూసార పరిరక్షణ, జీవ వైవిధ్యం పెంపుతో పాటుగా వ్యవసాయ భూముల్లో గృహాలు, పెద్ద పెద్ద భవనాలు నిర్మాణాలు చేయకూడదు. పరిమితికి మించి వ్యవసాయ బోర్లు తవ్వకూడదు. అలాగే నివాసాల్లో మంచి నీటి బోర్లను అవసరానికి మాత్రమే వేసుకోవాలి.ఇలా చేస్తేనే కరువు నుంచి దేశాన్ని కాపాడుకోగలం.

- జనక మోహన రావు దుంగ, 8247045230

భారతదేశంలో పెరుగుతున్న ఆర్థిక విభజన


ప్రొ.అరుణ్‌కుమార్

ఈ సంవత్సరం సెప్టెంబర్ మాసంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం), 'రిలేటివ్ ఎకనామిక్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్: 1960-61 టు 2023-24' శీర్షికతో ఒక పత్రాన్ని విడుదల చేసింది. ఇది, దేశ ఆదాయంలో ప్రతి రాష్ట్ర వాటాను, అఖిల భారత సగటుతో పోల్చితే తలసరి ఆదాయ వివరాలను తెలియజేస్తుంది.ఈ వివరాలు, దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రతీ రాష్ట్ర ప్రాముఖ్యతను, అఖిల భారత స్థాయికి సంబంధించి ప్రతి రాష్ట్ర పౌరుల సగటు సంక్షేమాన్ని తెలియజేస్తాయి. ఈ సగటు, అసమా నతల్ని దాస్తుంది. ఉదాహరణకు, దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యధికంగా సహాయపడే మహారాష్ట్ర, జాతీయ సగటులో 150 శాతం తలసరి ఆదాయాన్ని కలిగి ఉంది. అయితే దానిలో ధనిక ప్రాంతమైన ముంబై, పేదరికం కారణంగా రైతు ఆత్మహత్యలకు ప్రసిద్ధి చెందిన విదర్భ ప్రాంతాలు ఉన్నాయి. ముంబైకి చెందిన ధనికులు అత్యధిక మొత్తంలో ప్రత్యక్ష పన్నులు చెల్లిస్తారు, ముంబై నగర మున్సిపాలిటీ దేశంలోనే ధనికమైనది. కానీ అక్కడ పౌర జీవనానికి ఇబ్బందికరంగా పెద్దపెద్ద మురికివాడలున్నాయి.

ప్రాంతాల మధ్య అసమానతలు

ఈ నివేదిక, భారతదేశ పశ్చిమ, దక్షిణాది ప్రాంతాలు స్థిరమైన మెరుగైన పనితీరును, తూర్పు రాష్ట్రాల బలహీనమైన పనితీరును సూచిస్తుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో హర్యానా, ఢిల్లీ మినహా అన్ని రాష్ట్రాల పనితీరు బలహీనంగా ఉంది. మొత్తంగా చూస్తే, దేశంలో ఆర్థిక విభజన పెరుగుతుంది, ఇది సమాఖ్య(ఫెడరల్) వ్యవస్థ, వైవిధ్యం కలిగిన భారతదేశం లాంటి దేశానికి మంచిది కాదు.ఈ పెరుగుతున్న అంతరం ఫెడరలిజాన్ని (సమాఖ్యావాదం) ప్రశ్నించడానికి దారితీస్తుంది. ఇటీవల కాలంలో ధనిక రాష్ట్రాల ప్రతినిధులు కేరళలో ఒక సమావేశాన్ని నిర్వహించి, కేంద్రం నుండి తమకు న్యాయబద్ధంగా అందాల్సిన వనరులు అందడం లేదని వారన్నారు. కేంద్రం, తమకు తిరిగి ఇచ్చే నిధుల కన్నా తాము కేంద్ర నిధికి సమకూర్చేది ఎక్కువగా ఉంటుందని వారంటున్నారు. 2000 సంవత్స రంలో కూడా పదకొండవ ఆర్థిక సంఘం చేసిన అధికార మార్పిడికి నిరసనగా 'విజయవంతమైన రాష్ట్రాల సమావేశం' ఒకటి జరిగింది. ఆ విధంగా సమాఖ్య స్ఫూర్తి నెమ్మదిగా బలహీనపడుతూ వస్తుంది.

దక్షిణాది రాష్ట్రాలు మెరుగ్గా పని చేయడం ప్రారంభించడానికి చిహ్నంగా ఈ నివేదిక సరళీకరణ విధానాన్ని (లిబరలైజేషన్) చేర్చింది.కానీ ఇది కారణాల వివరాల్లోకి వెళ్లడం లేదు. ఇది ఒడిశా ఉన్న తూర్పు తీర ప్రాంతాలను కూడా మెరుగైన ప్రాంతాలుగానే సూచిస్తుంది. అయితే కొన్ని రాష్ట్రాల బలహీనమైన పనితీరు, మరికొన్ని రాష్ట్రాల మెరుగైన పనితీరుతో ముడిపడి ఉంటుందా? పెట్టుబడులే ఉత్పత్తిని నిర్ణయించే ముఖ్యమైన అంశం. పెట్టుబడి స్థాయి ఎంత ఎక్కువగా ఉంటే ఆర్థిక వ్యవస్థ పరిమాణం కూడా అంతే ఎక్కువ స్థాయిలో ఉంటుంది. కాబట్టి, ఇంకా సంపూర్ణ విశ్లేషణ జరగాలంటే, ప్రతి రాష్ట్రంలోని పెట్టుబడి స్థాయి మరియు పెట్టుబడి రేటును అధ్య యనం చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక ప్రయోజనాలు సాధించిన రాష్ట్రాల పెట్టుబడుల రేటు, పేద రాష్ట్రాల కంటే ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆ రాష్ట్రాల పనితీరు మెరుగ్గా ఉంటుంది.

పెట్టుబడులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల నుండి వస్తాయి. మొదటిది విధాన నిర్ణయాలపై ఆధారపడి ఉంటుండగా, రెండోది లాభాల అంచనాల పై ఆధారపడి ఉంటుంది. స్వల్పకాలిక లాభాలు సమకూరక పోయినప్పటికీ కూడా ప్రభుత్వం ఒక వెనుకబడిన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడులు పెట్టవచ్చు. కానీ పన్ను మినహాయింపులు, విద్యుత్ ధరల్లో రాయితీలు లాంటివి ప్రభుత్వం కల్పించకుంటే ప్రైవేట్ రంగం పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధపడదు. ఖచ్చితంగా లాభాలు ఉంటాయనే హామీ గల పెద్ద మార్కెట్లున్న అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనే స్వంతంగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రైవేట్ రంగం ముందుకొస్తుంది. కాబట్టి, ముంబై, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి పట్టణ ప్రాంతాలను పెట్టుబడికి గమ్యస్థానాలుగా ప్రాముఖ్యతను ఇస్తున్నారు. ఢిల్లీని ఆనుకొని ఉన్న హర్యానా (అత్యంత ఎక్కువ తలసరి ఆదాయంతో) కూడా బాగానే లాభపడింది. ఇతర కారణాలతో కోల్‌కతాకు ప్రాధాన్యత ఇవ్వలేదు. ఎగుమతుల ద్వారా బయటి మార్కెట్లకు చౌకగా సమీపించే అవకాశాలు ఉండడం వల్ల కోస్తాతీర ప్రాంతాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. పెట్టుబడికి అవసరమయ్యే దిగుమతులు కూడా చాలా చౌకగా అందుబాటులో ఉండవచ్చు.

రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండడం, నాణ్యమైన పరిపాలన,లాభాల్ని నిర్ణయించే కీలకమైన అంశాలుగా ఉంటాయి. ధనిక రాష్ట్రాలు ఈ రెండు అంశాల్లో మెరుగ్గా ఉంటూ, ఎక్కువ పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. మెరుగైన పాలన కూడా మెరుగైన, నాణ్యమైన విద్య, ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. ఇది, మరింత ఉత్పాదకశక్తి అందుబాటులో ఉండేందుకు దారి తీస్తుంది. కానీ, పేద రాష్ట్రాల నుండి ధనిక రాష్ట్రాలకు భారీగా వలసలు ఉంటున్న కారణంగా ఇది కీలకమైన అంశం కాదు. మొత్తం పెట్టుబడిలో, ప్రైవేట్ పెట్టుబడి 75 శాతంగా ఉంది. 1991లో నూతన ఆర్థిక విధానాల(ఎన్ఈపి) ప్రారంభం తరువాత ప్రముఖ రంగంగా ఉన్న ప్రభుత్వ రంగం పాత్ర మార్కెట్లకు మారింది. కాబట్టి, లాభాలు ఎక్కువగా ఉంటున్న ధనిక రాష్ట్రాలకు ఎక్కువ పెట్టుబడులు తరలిపోతున్నాయి. 1991 తరువాత పెట్టుబడులకు మార్గనిర్దేశం చేసే ఆర్థిక రంగం మరింత ప్రముఖ రంగంగా మారింది. పేద రాష్ట్రాల్లో గృహ పొదుపులు గణనీయంగా ఎక్కువ లాభాలు అందించే ధనిక రాష్ట్రాలకు మళ్లిస్తున్నారు. ధనిక రాష్ట్రాలతో పోల్చి చూసినప్పుడు పేద రాష్ట్రాల డిపా జిట్లు పరపతి నిష్పత్తి తక్కువగా ఉండటాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. ఈ పెట్టుబడి మళ్లింపు హెచ్చుతగ్గుల పెరుగుదలకు దారితీస్తుంది.చివరిగా, తక్కువ ఉత్పాదకత, తక్కువ ఆదాయాలు గల అసంఘటిత రంగంలో పనిచేసే పేద రాష్ట్రాలు పెద్ద వాటాను కలిగి ఉన్నాయి. ఈ నూతన ఆర్థిక విధానం, సంఘటిత రంగానికి చాలా అనుకూలంగా ఉంటూ వస్తోంది. ఈ సంఘటిత రంగానికి సరుకు రవాణా కారిడార్లు, హైవే ల నిర్మాణం తోడ్పడింది. కాబట్టి, సంఘటిత రంగం, అసంఘటిత రంగాన్ని దెబ్బతీసి, ధనిక రాష్ట్రాల వేగవంతమైన అభివృద్ధికి ఆజ్యం పోసింది.

క్లుప్తంగా చెప్పాలంటే, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి పత్రం తెలిపిన విధంగా, 'సరళీకరణ విధానాల' ప్రారంభం నుండి రాష్ట్రాల మధ్య విభజన పెరుగుదలలో నూతన ఆర్థిక విధానాలు



రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండడం, నాణ్యమైన పరిపాలన,లాభాల్ని నిర్ణయించే కీలకమైన అంశాలుగా ఉంటాయి. ధనిక రాష్ట్రాలు ఈ రెండు అంశాల్లో మెరుగ్గా ఉంటూ, ఎక్కువ పెట్టుబడుల్ని ఆకర్షిస్తున్నాయి. మెరుగైన పాలన కూడా మెరుగైన, నాణ్యమైన విద్య, ఆరోగ్యంతో ముడిపడి ఉంటుంది. ఇది, మరింత ఉత్పాదకశక్తి అందుబాటులో ఉండేందుకు దారి తీస్తుంది. కానీ, పేద రాష్ట్రాల నుండి ధనిక రాష్ట్రాలకు భారీగా వలసలు ఉంటున్న కారణంగా ఇది కీలకమైన అంశం కాదు. మొత్తం పెట్టుబడిలో, ప్రైవేట్ పెట్టుబడి 75 శాతంగా ఉంది. 1991లో నూతన ఆర్థిక విధానాల(ఎన్ఈపి) ప్రారంభం తరువాత ప్రముఖ రంగంగా ఉన్న ప్రభుత్వ రంగం పాత్ర మార్కెట్లకు మారింది. కాబట్టి, లాభాలు ఎక్కువగా ఉంటున్న ధనిక రాష్ట్రాలకు ఎక్కువ పెట్టుబడులు తరలిపోతున్నాయి.

(ఎన్ఈపి) ఒక ప్రధానమైన పాత్రను పోషించాయి. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల సమస్యలు ప్రత్యేకమైన కోవకు చెందినవి. రెండు రాష్ట్రాల్లో కూడా వామపక్ష ఉద్యమాలు, కార్మిక సమరశీలత చాలా బలంగా ఉన్నాయి. కాబట్టి, ప్రైవేట్ రంగం ఈ రాష్ట్రాల్లో చాలా తక్కువగా పెట్టుబడులు పెట్టాయి. వ్యూహాత్మక కారణాలతో భారతదేశ సరిహద్దు రాష్ట్రాలకు చాలా తక్కువ ప్రభుత్వ పెట్టుబడులు అందాయి. ప్రైవేట్ రంగాలను భయపెట్టిన తిరుగుబాట్ల వల్ల కూడా పెట్టుబడులు తక్కువగా వచ్చాయి.

ప్రభుత్వ పెట్టుబడితో కేంద్రం రాజకీయాలు చేస్తుందని ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. తరచుగా వినిపించే 'డబుల్ ఇంజన్‌కి సర్కార్' అనే నినాదమే దీనికి నిదర్శనం. రాజకీయ సంకేతాలు ముఖ్యమైనవి కాబట్టి భారతదేశంలో పెరుగు తున్న ఆశ్రితవాదం (క్రోనిజం) కూడా పెట్టుబడి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. ఇది, ఇతరులకు చిక్కులు పెంచే క్రమంలో ఆశ్రితులకు నష్టాలు తగ్గించడం ద్వారా పెట్టుబడి వాతావరణాన్ని చెడగొడుతుంది. ఫలితంగా పేద రాష్ట్రాలపై ప్రభావాన్ని చూపే మొత్తం పెట్టుబడి రేటులో ఒక క్షీణత ఏర్పడుతుంది.నల్ల ఆర్థిక వ్యవస్థ కూడా పేద రాష్ట్రాల్లో దామాషా ప్రకారం ఎక్కువగానే ఉంది. ఇది, విధాన వైఫల్యం, బలహీన పాలన కారణంగా పెట్టుబడి వాతావరణాన్ని చెడగొట్టి, వారు స్వీకరించే పెట్టుబడిని తగ్గిస్తుంది. కాబట్టి, ఇది వాటి పెరుగుదల సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.

సమాఖ్య వ్యవస్థకు ముప్పు

వివిధ రాష్ట్రాల ఆర్థిక పనితీరులో కొనసాగుతున్న వ్యత్యాసాలు సమాఖ్య వ్యవస్థకు ముప్పు తెస్తున్నాయి. అందుకే ఈ ధోరణిని తిప్పికొట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యత్యాసాల్ని కొనసాగించడం కూడా సరైనది కాదు. దీనికి వెనుకబడిన రాష్ట్రాల్లో ప్రైవేట్ పెట్టుబడుల ధోరణి, బలహీన పరిపాలన, నాసిరకం మౌలిక సౌకర్యాల ధోరణిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

కేంద్రం, రాష్ట్రం రెండూ చర్యలు చేపట్టాలి. రాష్ట్రాలు, వాటి అధికార పరిధిలో పాలనను మెరుగుపరిచి, అవినీతిని అరికట్టాలి. సామాజిక రంగాల్లో ప్రభుత్వ వ్యయాలను గణనీయంగా పెంచాలి. మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో అధికారిక ఆజ్ఞల తో పేద రాష్ట్రాల్లో ప్రైవేట్ పెట్టుబడులు పెంచకూడదు. అసంఘటిత రంగాన్ని దెబ్బతీసి సంఘటిత రంగానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న కేంద్ర వైఖరిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. అసంఘటిత రంగం పై దృష్టి సారిస్తే, అట్టడుగు వర్గాల ఆదాయాలు పెరగడం, ఆ పెరుగుదల పేద రాష్ట్రాల్లో డిమాండ్, ఉత్పత్తిని పెంచుతుంది. ఈ రాష్ట్రాల్లో డిమాండ్ పెరగడం వల్ల, ఆ డిమాండ్ ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తుంది.

డిమాండ్ కొరత కారణంగా సంఘటిత రంగానికి కూడా లాభం జరుగుతుంది. వారికి పెట్టుబడిని పెంచుకోడానికి తగినన్ని వనరులు ఉన్నాయి కాబట్టి వారికి ప్రభుత్వం నుండి మరిన్ని రాయితీల అవసరమేమీ లేదు. అంటే ఈ విధానపరమైన మార్పుల వల్ల, ధనిక రాష్ట్రాలు అభివృద్ధి చెందవని కాదు, కేవలం అసమానతలు తగ్గుతాయి. ఇది ఫెడరలిజంను బలోపేతం చేసే, దేశ ఐక్యతను కాపాడేందుకు సహాయపడే అభివృద్ధి అవుతుంది.

("ద హిందూ" సౌజన్యంతో)
అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

పంటల బీమా రైతులకా? కార్పోరేట్ సంస్థలకా?


సారంపల్లి మల్లారెడ్డి
9490098666

అనేక రైతాంగ ఆందోళనల ఫలితంగా దేశంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం 15జనవరి2016న "పిఎం ఫసల్‌బీమా"ను తెచ్చింది. ఈ బీమా దేశంలోని రైతాంగానికి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ఏర్పడిన నష్టాలను పూరించడానికి "బ్రహ్మాండమైన పథకం"గా ప్రధాని మోడీ వర్ణించారు. ఈ పథకం అమలు ప్రారంభించకముందు "మాడిఫైడ్ నేషనల్ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్" ఉంది. దీనితో పాటు వర్ష బీమా కూడా అమలు జరిపారు. ఈ పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరిపాయి. 1947 నుండి కాంగ్రెస్ ప్రభుత్వాలు పంటల బీమాపై ప్రయోగాలు చేస్తునేవున్నాయి. కానీ ఇది రైతులకు అంతగా ఉపయోగపడలేదు. 1970లో ధర్మనారాయణ కమిటీ అధ్యయనం చేసింది. ఇది అమలు కష్టమని ప్రొ ఫెసర్ దండేకర్ వ్యతిరేకించారు. 1975లో ప్రీమియం ఉండకూడదని కూడా నిర్ణయించారు. వీటన్నింటిని తోసిపుచ్చి కేంద్ర ప్రభుత్వం ప్రధాని ఫసల్‌బీమాను అమలులోకి తెచ్చింది. ఈ పథకం వలన పది ప్రైవేట్ కార్పోరేట్ భీమా కంపెనీలను రంగంలోకి దించింది. ప్రభుత్వం రైతులనుండి బ్యాంకు రుణాలపై కరీఫ్‌లో 2 శాతం, రబీలో 1.5 శాతం, పసుపు, మిరపలకు 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించాలి. వేలం పాటలో నిర్ణయించిన మిగిలిన అదనపు ప్రీమియంను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమానంగా భరించాలి. వరికి ఆగస్టు 30వరకు, మెట్ట పంటలకు జూలై 31 వరకు, పత్తికి జూలై 15వరకు, మిర్చి, టమాటకు ఆగస్టు 31వరకు, వేరుశనగకు నవంబర్ 30వరకు, ప్రీమియం చెల్లించు గడువు నిర్ణయించారు. ఈ గడువు తరువాత బీమా కంపెనీలు ప్రీమియం తీసుకోవు. అయినప్పటికీ కొన్ని బ్యాంకులు రైతులను మోసం చేసి గడువు గతించిన తరువాత ఇచ్చు పంటరుణాలనుండి ప్రీమియం వసూలు చేశారు. ఈ మొత్తాలు బీమా కంపెనీలకు ఇవ్వకుండా, రైతులకు తిరిగి ఇవ్వకుండా, బ్యాంకులు కోట్ల రూపాయలు కాజేశాయి. 30 శాతానికి తక్కువ పంట పండితేనె బీమాకు గుర్తిస్తారు. ఈ దిగువ సూత్రం అమలు ద్వారా బీమా పరిహారాన్ని నిర్ణయిస్తారు.

ఐదేండ్ల సగటు పంట - వాస్తవ దిగుబడి × బీమా చేసిన మొత్తం
ఐదేండ్ల సగటు దిగుబడి

పైసూత్రం ప్రకారం క్రాప్ కటింగ్ చేసి దిగుబడులు నిర్ణయిస్తారు. పన్నెండు పంటలకు మాత్రమే ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. ఇప్పటివరకు 2016 నుండి 2020 వరకు కార్పోరేట్ సంస్థలు వసూలు చేసిన ప్రీమియం, చెల్లించిన క్లైమ్‌లు ఈ విధంగా ఉన్నాయి. (రూ.కోట్లలో)

సంవత్సరం	ప్రీమియం (రూ.కోట్లలో)	క్లైయిమ్‌లు (రూ.కోట్లలో)	కంపెనీలకు లాభాలు రూ.కోట్లలో
2016-17	22,345.51	16,177.72	6,167.79
2017-18	36,085	32,920	3,165.00
2018-19	25,314.01	23,271.04	2,042.97
2019-20	27,516.47	25,739.03	1,777.44
2020-21	30,000.98	19,461.12	10,539.86
2021-22	30,375	18,745.95	11,632.13
2022-23	31,592.22	16,919.62	14,672.60
2023-24	30,112.67	12,483.06	17,629.61

ఎనిమిదేండ్ల పది కార్పోరేట్ బీమా కంపెనీలు రూ.68,627.40 కోట్లు ఆర్జించాయి. కానీ, బీమా అమలు విధానం రైతులకు ఏమాత్రం ప్రయోజనం కలిగించలేదు. దేశంలో 43కోట్ల ఎకరాలు సాగౌతుండగా, ప్రభుత్వం బీమా మాత్రం వానాకాలం 6-7 కోట్ల ఎకరాలకు, యాసంగి 4కోట్ల ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. దేశంలో 14.57కోట్ల మంది రైతులుండగా సగటున 2.5 కోట్ల మందికి మాత్రమే భీమా వర్తింపచేశారు. ఇందులో పరిహారం పొందినవారు సగటున 1.08 కోట్లు మాత్రమే ఇందులో సన్నకారు 16శాతం, చిన్నకారు 70శాతం, ఇతరులు 14 శాతం ఉండగా దళి తులు 6.26శాతం, గిరిజనులు 8శాతం, జనరల్ 33శాతం, ఓబీసీలు 52శాతం ఉన్నారు. దీన్నిబట్టి ఎంతమందికి వర్తిస్తుందో అర్థం చేసుకోవచ్చు. 17.15శాతం రైతులకు మాత్రమే బీమా వర్తించ బడింది. అదికూడా కొన్ని పంటలకే అమెరికాలో వంద పంటలకు బీమాను వర్తింపచేయడమేకాక, ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తున్నది. కానీ ఇక్కడ రైతులు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెల్లించిన వేల కోట్ల ప్రీమియంను కార్పోరేట్ సంస్థలు కాజేస్తున్నాయి. ప్రతియేటా ప్రీమియంకు వేలం పాటలు ఉంటాయి. గతేడాది తీసుకున్న ప్రీమియం క్లైమ్‌లు చెల్లించకుండా బకాయిపెట్టి మరో ప్రాంతంలో కంపెనీ వేలం పాటలో పాల్గొనడంతో గత బకాయిలకు ఎగనామం పెడుతున్నారు. ప్రభుత్వం ఎగనామం చేసిన కంపెనీల నుండి రైతులకు పరిహారం ఇప్పించడం లేదు. క్రాప్ కట్టింగ్ సందర్భంగా కంపెనీలు ఆసంస్థతో కుమ్మక్కై పరిహారాన్ని తగ్గించడానికి పంటల దిగుబడిని పెంచిచూపుతున్నారు.



వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం

జీవో నెంబర్ 157 ద్వారా 03మే2019న ఈ పథకం జారీ చేయబడింది. జూలై 15 వరకు విత్తనం వేయాలి. 40రోజులు వర్షం పడకపోతే బీమా వర్తిస్తుంది. కరీఫ్ ఎండుమిర్చి 16 జిల్లాలకు అనగా, భద్రాద్రి, వరంగల్ రూరల్, అర్బన్, జయశంకర్‌జిల్లా, జనగాం, మహబుబాబాద్, ములుగు, సూర్యాపేట, జోగులాంబ, జగిత్యాల, నిర్మల్, మంచిర్యాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ జిల్లాలకు వర్తిస్తుంది. పత్తి మేడ్చల్ మినహా మిగిలిన అన్ని జిల్లాలకు వర్తిస్తుంది. పామాయిల్, ఖమ్మం, భద్రాద్రికి వర్తిస్తాయి. నష్టపోయిన పంటను సెల్‌ఫోన్ ద్వారా ఫొటోస్ తీసి దరఖాస్తుకు జతచేయాలి. మూడు రోజుల్లో 72గంటల్లో వ్యవసాయ అధికారికి, ప్రీమియం చెల్లించిన అధికారికి, బీమా కంపెనీకి రాత పూర్వకంగా తెలియచేయాలి. కంపెనీ పది రోజులల్లో నష్టాన్ని అంచనా వేస్తారు. నష్టపోయిన వాటిలో 80శాతం చెల్లిస్తారు. కానీ, ఈ పథకం కూడా చైతన్యం లేని రైతులకు ఉపయోగపడటం లేదు. కంపెనీలు మాత్రం అమాయక రైతులనుండి బీమాను వసూలు చేసి లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రధాని ఫసల్ భీమా, వాతావరణ ఆధారిత భీమా రైతులకు లాభించకపోగా కార్పోరేట్లకు లాభాలు కట్టబెడు తున్నాయి.

ప్రధాని మోడీ కార్పోరేట్‌ల పక్ష పాతిగా వారికి లాభాలు కట్టబెట్టడానికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. సదుద్దేశంతో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రీమియం మాత్రమే వసూలు చేయడంతో బీహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు ఫసల్ బీమా నుండి విరమించుకున్నాయి. బీహార్, పశ్చిమబెంగాళ్ తమ స్వంత బీమా పథకాలను అమలు చేస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాలు తిరిగి 2023లో మరల ప్రధాని ఫసల్ బీమాలో చేరాయి. కానీ 2024-25 సంవత్సరానికి ప్రీమియం చెల్లించలేదు, అందువల్ల బీమా వర్తించదు.

ప్రధాని ఫసల్ బీమాలో దేశంలోని 43కోట్ల ఎకరాలకు 14.57కోట్ల మంది రైతులకు వర్తింప చేయాలి. అందుకు అనుగుణంగా భీమా విధానాన్ని సవరించాలి. కానీ ప్రధాని మోడీ కార్పోరేట్‌ల పక్ష పాతిగా వారికి లాభాలు కట్టబెట్టడానికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. సదుద్దేశంతో అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రీమియం మాత్రమే వసూలు చేయడంతో బీహార్, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జార్ఖండ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలు ఫసల్ బీమా నుండి విరమించుకున్నాయి.

బీహార్, పశ్చిమబెంగాళ్ తమ స్వంత బీమా పథకాలను అమలు చేస్తున్నాయి. మన తెలుగు రాష్ట్రాలు తిరిగి 2023లో మరల ప్రధాని ఫసల్ బీమాలో చేరాయి. కానీ 2024-25 సంవత్సరానికి ప్రీమియం చెల్లించలేదు, అందువల్ల బీమా వర్తించదు. ఎల్ఇసి కార్డులు ఉన్న కౌలుదారులకు కూడా బీమా వర్తింపచేయాలి. ప్రభుత్వమే ఒక శాఖను ఏర్పాటు చేయడం ద్వారా కార్పోరేట్లకు వెళ్లే లాభాలను రైతులకు మళ్లించవచ్చు.జీ-7 దేశాలలో అమలౌతున్న పంటల బీమా పథకాలను అధ్యయనం చేసి ఆ విధానాన్ని అమలు చేయాలి. నిర్ణయించిన ఆదాయం రైతుకు తగ్గితే బీమా నుండి వర్తింపచేయాలి. అప్పుడే దేశంలోని పదమూడు రాష్ట్రాల్లో ఆత్మహత్యల్ని నివారించే అవకాశం ఉంది. ఆత్మహత్యల నివారణ ప్రభుత్వం బాధ్యత కూడా.



బొగ్గు ఉత్పత్తి పెంచండి

- జీఎమ్‌లకు సీఎమ్‌డీ బలరాం ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

వర్షాలు తగ్గుముఖం పట్టినందున సంస్థ పరిధిలోని అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తిని పెంచాలని సింగరేణి సీఎమ్‌డీ ఎన్ బలరాం అధికారుల్ని ఆదేశించారు. శుక్రవారంనాడాయన సంస్థ జనరల్ మేనేజర్లతో హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సింగరేణిలో రోజుకు 2 లక్షల 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలనీ, దానికోసం ఇప్పటికే నిర్దేశించిన లక్ష్యాలను చేరుకొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయాలని చెప్పారు. అలాగే రోజుకు కనీసం 16 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగింపు కూడా జరగాలని ఆదేశించారు. ప్రతి గనికి రోజువారి లక్ష్యాలు నిర్దేశించుకోవాలనీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మిగిలిన ఐదు నెలల కాలంలో గైర్హాజరును పూర్తిగా తగ్గించి, మానవ వనరులు, యంత్ర వినియోగాన్ని పెంచాలని చెప్పారు. ఈ సందర్భంగా రక్షణకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సంస్థలోకి త్వరలో ఇటీవల ఎంపికైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, ఇతర సిబ్బందికి అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చి, నవంబర్ రెండోవారంలో ఏరియాలకు కేటాయిస్తామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాకుకు సంబంధించి ఇప్పటికే అన్ని రకాల అనుమతులు సాధించామనీ, ప్రస్తుతం 130 ఎకరాల అటవీ భూమిలో ఉన్న చెట్ల లెక్కింపును అటవీ శాఖ వారు ప్రారంభించారని చెప్పారు. ఈ ప్రక్రియ అంతా పూర్తి అయ్యి, 2025 జనవరి నుంచి ఇక్కడ బొగ్గు ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. కొత్తగూడెం వీకే ఓపెన్ కాస్ట్, ఇల్లందు రొంపేడు ఓపెన్ కాస్ట్, రామగుండం కోల్ మైన్, గోలేటి ఓపెన్ కాస్ట్ గనులకు సంబంధించిన ఏర్పాట్లపై కూడా ఆయన అక్కడి అధికారులతో చర్చించారు. పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు (ఈ అండ్ ఎమ్, ఆపరేషన్స్), డైరెక్టర్ జీ వెంకటేశ్వర్ రెడ్డి (పీపీ అండ్ పర్సనల్), జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) ఎస్‌డీఎమ్ సుభాని, జీఎం (మార్కెటింగ్) రవి ప్రసాద్, జీఎం (సిపిపి) మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కారామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి

- మాజీ ఎమ్మెల్సీ కపిల్‌వాయి దిలీప్ కుమార్



నవతెలంగాణ - హైదరాబాద్

అనారోగ్యంతో బాధపడుతున్న ప్రముఖ సీనియర్ విద్యావేత్త చుక్కా రామయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్సీ కపిల్‌వాయి దిలీప్‌కుమార్ పరామర్శించారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎం. సత్యంగౌడ్, టీపీసీసీ కార్యదర్శి రామారావు గౌడ్ ఉన్నారు. అనంతరం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు చుక్కా రామయ్యను ఐఐటీ రామయ్య అని కూడా పిలుస్తారని పేర్కొన్నారు. చుక్కా రామయ్య విశేష కృషిని వారు కొనియాడారు. మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు సేవలందిస్తున్న వెయ్యి మందికి పైగా ప్రముఖ ఐఐటీయన్లను తయారు చేశారని గుర్తుచేశారు. తన పుస్తకాల ద్వారా సాహిత్య రంగానికి ఆయన చేసిన కృషిని వారు కొనియాడారు. భారత ప్రభుత్వం చుక్కా రామయ్య సేవలను గుర్తించి వీలైనంత త్వరగా పద్మవిభూషణ్ పురస్కారం అందించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపించేందుకు త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామని వారు ప్రకటించారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన తోలుపునూరి కృష్ణగౌడ్



నవతెలంగాణ - హైదరాబాద్

దీపావళి పండుగను పురస్కరించుకొని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్ కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు మాజీ లేబర్ బోర్డ్ వైస్ చైర్మెన్ నాగభూషణం, ఆల్ ఇండియా సర్వ సేవా సంఘం అధ్యక్షులు వెదురి అరవింద్ రెడ్డి, శ్రీమంతు గిరి, చందు పటేల్, తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఉచిత స్క్రీనింగ్ క్యాంపును ఈ నెల ఒకటి నుంచి ప్రతి రోజు నిర్వహిస్తున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆ విభాగాధిపతి డాక్టర్ పార్వతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 9 వరకు ఈ క్యాంపును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పిల్లలకు సంబంధిచి మొర్రి (క్లెఫ్ట్), క్రానియో ఫేషియల్ అసామాన్యతలు, పుట్టుకతో హస్త విపత్తులు, పక్షవాతం, కాలిపోయిన, ప్రమాదానంతరం ఏర్పడిన వైకల్యతలు, రక్తనాళ అసామాన్యతలు, 12-14 సంవత్సరాల్లోపు పిల్లల్లో ఉన్న ఇతర లోపాలను ఈ క్యాంపులో గుర్తించనున్నట్టు తెలిపారు. వారికి ఉచిత శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్య శ్రీ , సీఎంఆర్ఎఫ్ , ఎల్‌ఓసి ద్వారా కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని వివరించారు. అవసరమున్న వారు నిమ్స్ ఆవరణలోని పాత ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని రూమ్ నెంబర్ 8లో డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9393835845, 040-23489049 నెంబర్లలో సంప్రదించవచ్చు.

చేవెళ్ల ఆర్డీవోగా చంద్రకళ

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

హైదరాబాద్‌లోని సచివాలయంలో సాధారణ పరిపాలన శాఖలో ఎస్టేట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.చంద్రకళను రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఆర్డీవోగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొటోకాల్ అదనపు డైరెక్టర్ డి.ప్రేమ్‌రాజుకు ఎస్టేట్ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రాథమిక ఉపాధ్యాయులతోనే కులగణన

(మొదటిపేజీ తరువాయి)

సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముసాయిదాను రూపొందించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 36,559 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీ), 3,414 మంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు (పీఎస్‌హెచ్‌ఎం), 6,256 మంది ఎంఆర్సీ సిబ్బంది, రెండు వేల మంది ప్రభుత్వ, ఎంపీపీ/జెడ్పీపీ, ఎయిడెడ్ పాఠశాలల్లోని మినిస్టీరియల్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సర్వేకోసం అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ల సేవలను కూడా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

మధ్యాహ్నం ఒంటి గంట వరకు బడి, ఆ తర్వాత కులగణన సర్వే

కులగణన సర్వేను నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాలల ఎస్జీటీలు, పీఎస్‌హెచ్‌ఎంల సేవలను వినియోగించడానికి ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలను ఉదయం తొమ్మిది నుంచే నడపాలని నిర్ణయించామని వెంకటేశం తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు బోధన ఉంటుందనీ, ఆ తర్వాత మధ్యాహ్న భోజనం అందించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి ఎస్జీటీలు, పీఎస్‌హెచ్‌ఎంలు ప్రణాళికా విభాగం సమన్వయంతో కులగణన సర్వే విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల సేవలను కులగణన విధుల నుంచి మినహాయించబడ్డాయని వివరించారు. ఈ పాఠశాలలు షెడ్యూల్ ప్రకారమే పనిచేస్తాయని తెలిపారు.





విధులు కేటాయించిన సిబ్బంది అన్ని సెలవుల్లో ప్రణాళికా విభాగం సూచనల మేరకు సర్వేకు హాజరు కావాలని కోరారు. ప్రణాళికా విభాగం నిబంధనల ప్రకారం వేతనాన్ని చెల్లించాలని పేర్కొన్నారు.

విద్యాశాఖలో 50 వేల మందికి విధులు : నరసింహారెడ్డి

విద్యాశాఖలో 50 వేల మందికి కులగణన సర్వే విధులు కేటాయించామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. ఇందులో 36,559 మంది ఎస్జీటీలు, 3,414 మంది పీఎస్‌హెచ్‌ఎంలు, 6,256 మంది ఎంఆర్సీలు, రెండు వేల మంది మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారని వివరించారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌ల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బందిని వినియోగిస్తామని పేర్కొన్నారు. వారు ఇంటింటి సర్వే చేపట్టాలని కోరారు.

ఎస్జీటీలకే కేటాయించడానికి టీపీటీఎఫ్ ఖండన

కులగణన విధులను ఎస్జీటీలకే కేటాయించడాన్ని టీపీటీఎఫ్ ఖండించింది. అన్ని రకాల పాఠశాలల్లో అధికంగా ఉపాధ్యాయులను గుర్తించి విధులను కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి నాగిరెడ్డి తెలిపారు. పాఠశాలల పనివేళలకు ఆటంకం కలగించొద్దని కోరారు.

ఉపాధ్యాయులందరికీ విధులు కేటాయించాలి : టీఎస్టీయూ

కులగణన విధులను ఉపాధ్యాయులందరికీ కేటాయించాలని టీఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి తెలిపారు. ఈ ఉత్తర్వులను సవరించాలని కోరారు.

మా అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు : టీఎస్‌యూటీఎఫ్

ఉపాధ్యాయ సంఘాలతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించిన సమావేశంలో చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ కులగణన సర్వే ఉత్తర్వులను జారీ చేసిందని టీఎస్‌యూటీఎఫ్ విమర్శించింది. బోధనాభ్యసన ప్రక్రియకు ఆటంకం కలగకుండా చూడాలని కోరినా పట్టించుకోలేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి విమర్శించారు.

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే విధులు వేసి ఒక పూట బడి నడిపి మధ్యాహ్నం సర్వే చేయాలనడం ఏమాత్రం ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. ముమ్మరమైన వ్యవసాయ పనుల రోజుల్లో పిల్లలను మధ్యాహ్నమే ఇంటికి పంపడాన్ని తల్లిదండ్రులు అంగీకరించబోరని వివరించారు. మధ్యాహ్నం సర్వేకు అనుకూల సమయం కూడా కాదని తెలిపారు. సెలవు రోజుల్లో చేయొచ్చని సూచించారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సహా ఎక్కువ మందికి విధులు వేసి తక్కువ ఇండ్లను కేటాయించొచ్చని కోరారు. కొందరు ఉదయం, మరికొందరు మధ్యాహ్నం వంతులవారీగా సర్వేకు హాజరయ్యేలా చూడటం సమంజసంగా ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కులగణన సర్వేను పాఠశాలలకు అంతరాయం కలగకుండా నిర్వహించేలా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు.

104 ఉద్యోగుల వేతనాల బకాయిలు చెల్లిస్తాం

- ఉద్యోగులందర్నీ డీఎంఈ పరిధిలో సర్దుబాటు చేస్తాం
- టీయూఎంహెచ్‌ఇయూ నాయకులకు కమిషనర్ హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



104 ఉద్యోగుల వేతనాల బకాయిలు ఈ నెలలో చెల్లిస్తామనీ, వారందరినీ డీఎంఈ పరిధిలో సర్దుబాటు చేస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కుటుంబ సంక్షేమ కార్యాలయంలో 104 ఉద్యోగుల సమస్యలపై తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టీయుఎంహెచ్‌ఇయూ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ నేతృత్వంలో నాయకులు కలిశారు. 104 సేవల ద్వారా పనిచేసిన ఉద్యోగుల కొనసాగింపు, అక్టోబర్ వరకు వేతనాలు చెల్లిస్తామని గతంలో ఇచ్చిన హామీపై ఏమైనా చర్యలు తీసుకున్నారా అని కమిషనర్ అడిగారు. వారికి సమాధానమిస్తూ కమిషనర్, అందరిని నవంబరు నెలాఖరు నాటికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఇ) పరిధిలో సర్దుబాటు చేస్తామని చెప్పారు. అలాగే వేతనాలకు సంబంధించి కూడా ఆర్థిక శాఖ అనుమతిచ్చిన నేపథ్యంలో అక్టోబర్ వరకు ఈ నెలలో చెల్లిస్తామని కూడా చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని మెడికల్ కాలేజీలు, జనరల్ హాస్పిటళ్లు ,ఇతర టీచింగ్ ఇనిస్టిట్యూట్లలో ఉద్యోగులందరినీ సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులను ఎవ్వరినీ తొలగించబోమని తేల్చిచెప్పారు. సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపిస్తున్నందుకు ఆ నాయకులు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. సాధ్యమైనంత తొందరగా ఆ రెండు హామీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో భూపాల్ మాట్లాడుతూ 104 ఉద్యోగుల సమస్యలపై ముఖ్యంగా కొనసాగింపు, పెండింగ్ జీతాల కోసం గత ఆరు మాసాలు సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తున్నదని గుర్తుచేశారు. ఉద్యోగులందరూ పోరాడుతున్నదెవరో గమనించి ఐక్యం కావాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.విజయవర్ధన్ రాజు, మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు సుభాష్, శేఖర్, వేణు, రంగారెడ్డి జిల్లా నాయకులు శ్రీనివాసు, స్టాఫ్ నర్స్ సంఘం నాయకురాలు టి.సువర్ణ లతా తదితరులు పాల్గొన్నారు.

హాష్ ఆయిల్ పట్టివేత

బాలానగర్‌లో ముగ్గురి అరెస్ట్



నవతెలంగాణ-బాలానగర్

అక్రమంగా హాష్ ఆయిల్‌ను రవాణా చేస్తున్న ముగ్గురిని సైబరాబాద్ ఎస్‌ఓటి బృందం బాలానగర్ పోలీసులతో కలిసి అరెస్టు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సభావత్ సుమన్‌ను 2021లో డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గొలుగొండ పోలీసులు అరెస్టు చేశారు. అతను విశాఖపట్నం జైల్లో ఉన్న సమయంలో ఒడిశాకు చెందిన కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. వారు జైలు నుంచి విడుదలైన అనంతరం సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయి, హాష్ ఆయిల్‌ను రవాణా చేయాలనుకున్నారు. వారికి తెలిసిన వ్యక్తి.. గతంలో ఎన్డీపీఎస్ కేసులో మూడు సార్లు జైలుకు వెళ్లిన కేతావత్ విజయ్ కుమార్‌ను కలిసి గంజాయి కొనుగోలుకు కస్టమర్లను వెతకాలని కోరారు. ఒడిశా రాష్ట్రం నుంచి హాష్ ఆయిల్‌ను ఏర్పాటు చేయాలని కిరణ్‌కు సుమన్ చెప్పాడు. అక్టోబర్ 27న సభావత్ సుమన్ మరోవ్యక్తి రమావత్ లాలుతో కలిసి పల్సర్ బైక్‌పై నల్లగొండ జిల్లా దేవరకొండ, పోలేపల్లి గ్రామం నుంచి పాడేరు వరకు 1000 కిలోమీటర్లు ప్రయాణించారు. అక్కడ కిరణ్ వారికి 2,590 లీటర్ల హాష్ ఆయిల్ ఇచ్చాడు. అనంతరం విజయ్ కుమార్ మార్గదర్శకత్వంతో అక్టోబర్ 31న సభావత్ సుమన్, రమావత్ లాలు సనత్‌నగర్‌కు వచ్చారు. అక్కడ కస్టమర్ల కోసం వెతుకుతూ శోభన బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే ఎస్‌ఓటీ శ్రీనివాస్, సైబరాబాద్ డీసీపీ సురేష్ కుమార్ ప్రత్యక్ష పర్యవేక్షణలో బాలానగర్ ఎస్‌ఓటి, సైబరాబాద్, బాలానగర్ పోలీసుల బృందం నిందితులను అరెస్టు చేసింది. కేతావత్ విజయ్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. కిరణ్ పరారీలో ఉన్నాడు. పట్టుబడిన వారి నుంచి రూ.12,95,000 విలువ చేసే 2.590 లీటర్ల హాష్ ఆయిల్, పల్సర్ మోటార్ సైకిల్, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం వాటి విలువ రూ.13,50,000 ఉంటుంది.

నిందితులను పట్టుకున్న సైబరాబాద్ ఎస్‌ఓటి డీసీపీ శ్రీనివాస్, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, అడిషనల్ డీసీపీలు సత్యనారాయణ, శోభన్ కుమార్, బాలానగర్ ఏసీపీ హనుమంత్ రావు, బాలానగర్ బృందాన్ని పై అధికారులు అభినందించారు. గంజాయి, హ్యాష్ ఆయిల్ సరఫరాదారులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే.. డయల్ 100 లేదా సైబరాబాద్ ఎన్‌డీపీఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ 7901105423 లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 944906174కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీసీపీ చెప్పారు.

జనవరి 26న గవర్నర్ ప్రతిభా పురస్కారాలు

- నాలుగు కేటగిరీల్లో వ్యక్తులు, సంస్థలకు ఎనిమిది అవార్డుల ప్రదానం
- రాజ్‌భవన్ వేదికగా ఇవ్వడం దేశంలో ప్రథమం
- 2019 నుంచి తెలంగాణలో పని చేసిన వారే అర్హులు
- నేటినుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- వాటి సమర్పణకు తుది గడువు 23 : గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న ప్రతి ఏటా గవర్నర్ ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్టు గవర్నర్ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల సంక్షేమం, క్రీడలు, ఆటలు, సాంస్కృతిక రంగంలో పనిచేసిన వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు, సొసైటీలకు ఈ అవార్డులను ప్రదానం చేస్తామని అన్నారు. నాలుగు కేటగిరీల్లో నలుగురు వ్యక్తులు, నాలుగు సంస్థలను ఎంపిక చేస్తామన్నారు. ఈ అవార్డు కింద రూ.రెండు లక్షల నగదుతోపాటు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేస్తామని వివరించారు. ఐదేండ్లుగా అంటే 2019 నుంచి తెలంగాణలో ఆయా కేటగిరీల్లో పనిచేసిన వ్యక్తులు లేదా సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. తెలంగాణలో పనిచేసిన వ్యక్తులు, సంస్థలు ఉండాలనీ, ఇక్కడ పనిచేస్తున్న తెలంగాణేతరులు కూడా ఉండొచ్చని స్పష్టం చేశారు. నాలుగు కేటగిరీల్లో అత్యుత్తమ విజయాలను ప్రోత్సహించడం, అభివృద్ధి కోసం చేసిన కృషికి గుర్తింపునిచ్చేందుకు ఈ అవార్డులు దోహదపడతాయని వివరించారు. గవర్నర్ ప్రత్యేకంగా జ్యూరీ కమిటీని పద్మవిభూషణ్, ఆస్కి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మెన్ పద్మనాభయ్య నేతృత్వంలో ఏర్పాటు చేశారని చెప్పారు. ఎంపిక కమిటీ అన్ని దరఖాస్తులనూ పరిశీలించి అర్హులైన వారిని అవార్డుల కోసం ఎంపిక చేస్తుందన్నారు. ఒకవేళ దరఖాస్తుల్లో సరైన వ్యక్తులు లేదా సంస్థలేకుంటే ఆ కమిటీ నేరుగా ఎంపిక చేసే అవకాశముందని అన్నారు. రాజ్‌భవన్ వేదికగా గవర్నర్ పేరుతో అవార్డులను ప్రదానం చేయడం దేశంలోనే ఇదే ప్రథమమని వివరించారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి అవార్డులను ప్రదానం చేయడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తోపాటు ముఖ్యమంత్రి కూడా హాజరవుతారని అన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. వాటి సమర్పణకు ఈనెల 23న సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని చెప్పారు. ఆన్‌లైన్‌లో https://governor.telangana.gov.in ద్వారా దరఖాస్తులను సమర్పించొచ్చని సూచించారు. అందులో దరఖాస్తు ఫారం అందుబాటులో ఉందనీ, డౌన్‌లోడ్ చేసుకోవాలని వివరించారు. ఆఫ్‌లైన్‌లో గవర్నర్ ముఖ్య కార్యదర్శి, గవర్నర్ సెక్రెటేరియట్, రాజ్‌భవన్, సోమాజిగూడ, హైదరాబాద్ -500041 అడ్రస్‌కు స్పీడ్ పోస్టు ద్వారా అన్ని పత్రాలతో సమర్పించాలని కోరారు. గవర్నర్ మారినా ఈ అవార్డుల ప్రదానం కొనసాగు తుందనీ, దీనిపై ఎవరికీ ఇబ్బంది ఉండబోదని స్పష్టం చేశారు. జూన్ రెండు నాటికి కాలుష్య రహిత రాజ్‌భవన్‌గా తీర్చిదిద్దాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లక్ష్యంగా నిర్దేశించుకున్నారని వివరించారు. ప్రజా రాజ్‌భవన్‌గా మారుస్తామం టూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారని గుర్తు చేశారు. అందులో భాగంగా వికలాంగుల సాంస్కృతిక కార్యక్రమాలు ఇక్కడే జరుగుతు న్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జాయింట్ సెక్రెటరీ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

26 మంది తెలంగాణ పోలీసులకు

'కేంద్ర గృహ మంత్రి దక్షతా పదక్' అవార్డులు

- ఏపీలో ఐదుగురికి : కేంద్ర హోం శాఖ వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి యేటా కేంద్ర హోంశాఖ ప్రకటించే జాతీయ అవార్డుల్లో తెలంగాణ నుంచి 26 మంది పోలీసులకు అవార్డులు దక్కాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఐదుగురికి ఈ మెడల్స్ వరించాయి. 2024 ఏడాదికి గానూ దేశ వ్యాప్తంగా 463 మంది పోలీస్ సిబ్బందికి 'కేంద్ర గృహ మంత్రి దక్షతా పదక్' అవార్డులను ప్రకటిస్తూ కేంద్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇందులో తెలంగాణతో పాటు ఏపీ, అస్సాం, బీహార్, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్‌ప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఇతర రాష్ట్రాలకు చెందిన పోలీస్ సిబ్బంది ఉన్నారు. తేదీల వారీగా... స్పెషల్ ఆపరేషన్లు, దర్యాప్తు, ఫోరెన్సిక్ సైన్స్, ఇతర విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి ఈ అవార్డులకు ఎంపిక చేశారు.

తెలంగాణ నుంచి గతేడాది మే 9న చేపట్టిన ఆపరేషన్స్‌కు గానూ సీఐ చేగురి సుదర్శన్ రెడ్డి, ఏఆర్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ముజీబ్, హెడ్ కానిస్టేబుళ్లు డి మోహన్ రెడ్డి, పండరి రవిందర్, కానిస్టేబుళ్లు డి రాంచంద్రా రెడ్డి, ఎం నాగరాజు, పి రాజేందర్, కె శ్రీకాంత్ గౌడ్‌ను కేంద్ర హోం శాఖ అవార్డులకు ఎంపిక చేసింది.

వీరితో పాటు ఈ ఏడాది ఏప్రిల్ 6న చేపట్టిన ఆపరేషన్స్‌కు గానూ గ్రూప్ కమాండర్ జె రాఘవేంద్రా రెడ్డి, సీనియర్ కమాండోలు తిప్పని రాకేశ్, యూ మల్లయ్య, జూనియర్ కమాండో గంట సాయి కుమార్‌లకు అవార్డులు దక్కాయి. అలాగే ఏప్రిల్ 11, 12 తేదీల్లో చేపట్టిన ఆపరేషన్స్‌కు గానూ ఎస్పీ భాస్కరన్, సీఐలు బీసం హరి ప్రసాద్, కంపల్ల శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్లు చారీ రాంబాబు, డొంకల రాంబాబు, గౌతమ్ రెడ్డి, పి. సంతోష్ కుమార్, డి. రాజేశ్, కానిస్టేబుళ్లు కదరి హరిబాబు, ఎజిడి మార్కస్, ఎస్పీ సత్యనారాయణడెపుడు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ రెడ్డిమామిళ్ల, అడిషనల్ ఎస్పీ సంగరామసింగ్ గణపతిరావు పాటిల్, ఏసీపీ శ్రీధర్ రెడ్డి పులిమామిడికి ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది.

ట్రాన్స్‌కోకు రూ.4,791.65 కోట్లు విడుదల

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీజీట్రాన్స్‌కోకు రూ.4,791.65 కోట్ల బడ్జెట్ కేటాయింపు నిధుల్ని విడుదల చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ, అనుబంధరంగాల సబ్సిడీ పథకాల్లో భాగంగా ఈ నిధుల్ని విడుదల చేసినట్టు తెలిపారు. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి నెల (ఐదు నెలలు) వరకు నెలకు రూ.958.33 కోట్లు చొప్పున ఐదునెలల మొత్తానికి బడ్జెట్ కేటాయింపు ఇచ్చారు. ప్రతినెలా యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి ఈ నిధుల్ని వాడుకోవచ్చని పేర్కొన్నారు.

'డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 3.0' ప్రారంభం

- 70 లక్షల మంది కేంద్ర పింఛనుదారులకు ప్రయోజనం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో పింఛన్‌దారుల కోసం 'డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ క్యాంపెయిన్ 3.0'ని ప్రారంభించినట్టు జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. ఏటా పెన్షనర్లు పెన్షన్ కొనసాగింపు కోసం నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికేట్ సమర్పించవలసి ఉంటుందనీ, వాటిని డిజిటల్‌గా సమర్పించే సౌలభ్యాన్ని కల్పిస్తున్నామన్నారు.

దీనివల్ల 70 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు తీసుకుంటే పెన్షన్‌దారులు భౌతిక ధృవీకరణ కోసం కార్యాలయాలను సందర్శించాల్సిన అవసరం లేదన్నారు. సమయం ఆదా అవుతుందనీ, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ప్రమాణీకరణ ప్రక్రియకు భద్రతా అంశాన్ని జోడించి, మోసపూరిత క్లెయిమ్‌ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీ ద్వారా డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ ఆండ్రాయిడ్ ఆధారిత స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి ఆధార్ ఆధారంగా లైఫ్ సర్టిఫికెట్‌ను పొందవచ్చని వివరించారు. పెన్షన్‌దారులు తమ స్మార్ట్‌ఫోన్‌లో ఆధార్ ఫేస్ ఆర్.డి యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని, నిబంధనల ప్రకారం తమ లైఫ్ సర్టిఫికెట్‌ను నేరుగా సంబంధింత కార్యాలయానికి పంపొచ్చని తెలిపారు.

మోమోస్ కేసులో ఆరుగురి అరెస్ట్

నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో వారాంతపు సంతలో మోమోస్ తిని ఓ మహిళ మృతి చెందిన ఘటనకు సంబంధించి ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చింతల్‌బస్తీలో మోమోస్ తయారు చేస్తున్న కేంద్రంలో ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. అనంతరం అక్కడ మోమోస్ తయారు చేస్తున్న అల్మాస్, సాజీద్ హుస్సేన్, రాయిస్, షారుక్, హనీఫ్, రాజిక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులంతా బీహార్‌కు చెందిన వారుగా గుర్తించారు.

ప్రజావాణికి 384 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణిలో 384 దరఖాస్తులు అందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 255, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, విద్యుత్ శాఖకు సంబంధించి 24, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 15, ఇతర శాఖలకు సంబంధించి 31, దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



మెస్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై సీఎంకు కృతజ్ఞతలు

- గిరిజన యూనివర్సిటీకి 211 ఎకరాలు కేటాయించడం హర్షనీయం : సీఎంకు ధన్యవాదాలు తెలిపిన మంత్రి సీతక్క, పలువురు ఎంపీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు, ములుగులో సమక్క- సారలమ్మ ట్రైబల్ సెంట్రల్ యూనివర్సిటీకి 211 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనతో మంత్రి సీతక్క భేటీ అయ్యారు. ఆమెతో పాటు సీఎంను కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, సంజయ్, తదితరులున్నారు. అనంతం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉండటం వల్ల విద్యా రంగ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతున్నాయన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారనీ, గతంలో ఎన్నడూ లేని విధంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు 40 శాతం మేర పెంచారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచలేదని విమర్శించారు. దీంతో పిల్లలు అర్ధాకలితో అలమటించారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశంతో...పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. పెరిగిన డైట్ చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లకు, హాస్టల్ సిబ్బందికి ఉందని గుర్తు చేశారు. హాస్టళ్లలో టాయిలెట్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపైనా సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. అయినా ప్రజా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ గుడ్డిగా విమర్శించడం తగదన్నారు.

భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్త పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

అమలు, సీఎం రేవంత్ వ్యవహారశైలి, ప్రతిపక్షాలపట్ల సర్కారు వైఖరి తదితరాంశాలపై నెటిజన్లు అడిగిన వివిధ ప్రశ్నలకు ఆయన ఈ సందర్భంగా సమాధానాలిచ్చారు. రేవంత్ సర్కార్ అబద్ధాలు, అసత్యాలతో కాలం వెళ్లబుచ్చుతోందని విమర్శించారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ బీఆర్ఎస్‌పై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ఆయన పాలన ఫ్రమ్ ఢిల్లీ, టు ఢిల్లీ, ఫర్ ఢిల్లీ అన్నట్టుగా తయారైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలూ తిరోగమనంలో ఉన్నాయని విశదీకరించారు. ఈ క్రమంలో ప్రతిపక్షంగా ప్రజల పక్షాన కొట్లాడటమే తమ బాధ్యతని తెలిపారు. రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీల అమలుతోపాటు అది తీసుకున్న విధానపరమైన నిర్ణయాల్లోని డొల్లతనంపైనా పోరాడుతామని చెప్పారు. రాజకీయాల్లోకి నేతల కుటుంబ సభ్యులను లాగటం దారుణమని విమర్శించారు. తాము అధికారంలో ఉన్న పదేండ్ల కాలంలో ఎప్పుడూ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని తెలిపారు. సీఎం రేవంత్ నీచ రాజకీయాల్లోకి తన కుటుంబాన్ని లాగటం శోచనీయమని కేటీఆర్ పేర్కొన్నారు. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రిపైనా, ఆయన వందిమాగదులపైనా పోరాడి తీరతామని హెచ్చరించారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా సీఎంతోపాటు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున కుంభకోణాలకు, అవినీతికి పాల్పడబోతున్నారని ఆరోపించారు. ఇది దేశంలోనే అతి పెద్ద స్కామ్ కాబోతోందని హెచ్చరించారు. హైడ్రా అనేది కేవలం కొంతమంది కోసమే ఉద్దేశించిందని విమర్శించారు. ఆ సంస్థ కొనసాగిస్తున్న కూల్చివేతల వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ అనే పేరు నిలిచే ఉంటుందని కేటీఆర్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని తెలిపారు. వివిధ అంశాలపై ఎప్పటికప్పుడు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారని వివరించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయని చెప్పారు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం మన దేశంలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అనేది సాధ్యం కాదన్నారు.

గాలి మాటలతో అసలుకే మోసం
ఖర్గేకు చురకలు

కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గాలి మాటలతో అనేక గ్యారెంటీలిస్తే, ఇప్పుడు ఆ పార్టీకి మొదటికే మోసం వచ్చిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఉద్దేశించి ట్విట్టర్‌లో చురకలంటించారు. ఆ రాష్ట్రంలో అనేక హామీలు గుప్పించినప్పుడు అక్కడి బడ్జెట్ గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఆదాయం చూసుకోకుండా హామీలిస్తే ఆర్థిక సంక్షోభం తప్పదనే విషయం బోధపడిందా ఖర్గే గారూ..? అంటూ ఎద్దేవా చేశారు.

టీజీఎస్పీఎఫ్‌కు సచివాలయం భద్రత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయం సెక్యూరిటీ బాధ్యతలను ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్) శుక్రవారం స్వీకరించింది. ఇక నుంచి ఎస్పీఎఫ్‌కు చెందిన 214 మంది సాయుధులు 24 గంటల పాటు పహారా కాయనున్నారు. గేట్లు, ఇతర ప్రాంతాల్లో సాయుధ గార్డు, లోపల గస్తీ వంటి బాధ్యతలను నిర్వహించనున్నారు. గతంలో మాదిరిగానే ఆక్టోపస్, హైదరాబాద్ సిటీ పోలీసులు లా అండ్ అర్డర్, ట్రాఫిక్‌ను పర్యవేక్షించనున్నారు. సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదట్లో ఎస్పీఎఫ్ విభాగమే భద్రతను నిర్వహించింది. గతేడాది ఏప్రిల్ 25న భద్రతా నిర్వహణను తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ)కు అప్పగించారు. అయితే భద్రతతోపాటు అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ వంటి పలు అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందిన ఎస్పీఎఫ్‌కు సచివాలయం భద్రత బాధ్యతలు అప్పగించాలని ఆగస్టు 5న ప్రభుత్వానికి డీజీపీ ప్రతిపాదించారు. ఆయన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం సెక్యూరిటీ బాధ్యతలను టీజీఎస్పీ నుంచి ఎస్పీఎఫ్‌కు అప్పగించింది.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలు-2024 హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని సూచించారు. అందుకోసం ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతోపాటు సాహిత్యం, సాంస్కృతిక, క్రీడలపై అవగాహన పెంచాలని సూచించారు. తల్లిదండ్రులకు వాటి గురించి తప్పనిసరిగా చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎస్పీడీ రాజీవ్, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి వెంకటస్వామి, తాజ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి 174 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి వచ్చిన వారు జాతీయస్థాయి కళా ఉత్సవాల్లో పాల్గొంటారు.

రైతుల ఆదాయం పెంచేలా 'ఉపాధి'

- వచ్చే ఐదు నెలల్లో రూ. 1372 కోట్ల నిధులతో ప్రణాళికలు : ఆమోద ముద్ర వేసిన మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రైతుల ఆదాయం పెంచేలా వ్యవసాయ అనుబంధం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలనీ, శాశ్వతంగా నిలిచేలా ఉపాధి హామీ పనులు చేపట్టేలా చూడాలని అధికారులను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని నొక్కిచెప్పారు. నరేగా అమలుపై శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, కమిషనర్ అనితా రామచంద్రన్, స్పెషల్ కమిషనర్ షఫీఉల్లా, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, పంచాయతీ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీ కనకరత్నం, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాబోయే ఐదు నెలల కాలానికి సంబంధించి రూ. 1372 కోట్ల నరేగా నిధులతో చేపట్టే పనుల ప్రణాళికకు సీతక్క ఆమోదం తెలిపారు. మహిళలకు ఉపాధి భరోసా, పంటపొలాలకు బాటలు, పండ్ల తోటల పెంపకం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కింద చేపట్టే పనులను చేయాలన్నారు. రూ. 106 కోట్ల నిధులతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రతి నియోజకవర్గానికి సుమారు కోటి నిధులను వెచ్చించాలని నిర్ణయించారు. మొత్తం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆదాయాన్ని పెంచే దిశలో పశువుల కొట్టాలు, కోళ్ళ షెడ్ల నిర్మాణం, వర్మి కంపోస్ట్-వాన పాముల ఎరువుల తయారీకి తొట్ల నిర్మాణం, ఎస్‌హెచ్‌జీలో ఉన్న రైతుల బీడు భూములను అభివృద్ధి చేసి సాగులోకి తీసుకొచ్చే ప్రణాళికలకు ఆమోదం తెలిపారు. ప్రతి నియోజక వర్గానికి రూ. రెండు కోట్లు వెచ్చించి వ్యవసాయ పొలాలకు బాటలు వేయాలని నిర్ణయించారు. దీంతో పాటు 2,700 ఎకరాలలో రూ. 16.20 కోట్ల నిధులతో చిన్న సన్నకారు రైతులకు ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటలు, ఈత మొక్కల పెంపకం చేపట్టి ఆదాయాభివృద్ధిని పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 9 కోట్ల మొక్కలను పెంచి వచ్చే సంవత్సరం వన మహోత్సవంలో నాటడానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. జలనిధి కింద వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు రాష్ట్రంలో రూ.204 కోట్ల నిధులతో ప్రతి నియోజక వర్గంలోనూ సుమారు రెండు కోట్ల నిధులతో మొత్తం 11,350 నీటి నిల్వ, నీటి సంరక్షణ పనులను చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేశారు. అందులో భాగంగా 540 చెక్ డ్యాములు, 540 వ్యవసాయ బావుల నిర్మాణం, వేయికి పైగా బోర్ వెల్ రీఛార్జి గుంతల నిర్మాణం వంటి పనులను చేపడతారని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు రూ.5 కోట్ల నిధులతో గ్రామాలలో మౌలిక వసతుల్లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం, టాయిలెట్ల నిర్మాణాలు, ఇంటర్నల్ సిమెంటు కాంక్రీటు రోడ్ల నిర్మాణం, వేయి కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, 500కిపైగా అంగన్వాడీ భవనాల నిర్మించాలని నిర్ణయించారు. దీంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 4960 కోట్ల నిధులతో చేపట్టే పనుల కోసం అధికారులు అంచనా ప్రణాళికలు సిద్ధం చేయంగా సీతక్క ఆమోదించారు.

మన దేశం సంస్కృతులు, సంప్రదాయాల సంగమం

రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
8 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మన దేశం సంస్కృతులు, సంప్రదాయాల సంగమమని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఎనిమిది రాష్ట్రాలు, ఐదు కేంద్రపాలిత ప్రాంతాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వేడుకలను కలిసి నిర్వహించడం ఒక దేశంగా మన ఐక్యతను మెరుగుపరుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, హర్యానా, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు అండమాన్ అండ్ నికోబార్ దీవులు, చండీగఢ్, ఢిల్లీ, లక్షదీప్, పాండిచ్చేరిల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ పేరుతో ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంపట్ల గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ సమైక్యతకు అవసరమైన భాషా, సాంస్కృతిక సరిహద్దులు లేని ఏకీకృత శక్తిని కళాకారులు తమ సంగీతం, నృత్య ప్రదర్శనతో కనబరిచారని వారిని అభినందించారు. వేడుకల్లో ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఆహార పదార్థాలు వారి ఆహార వారసత్వాన్ని ప్రతిబింబించాయి. వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి పద్మశ్రీ పద్మజారెడ్డి కూచిపూడి నృత్యాన్ని, కేరళ నుంచి తిరువతిర, మోహినీయాట్టం, హర్యానా నుంచి జానపద నృత్యం, కర్ణాటక నుంచి గడగ్ కళ తాండ జానపద నృత్యం, పంజాబ్ నుంచి భాంగ్రా, సంప్రదాయ మార్షల్ ఆర్ట్స్, తమిళనాడు నుంచి కుమారి కీర్తివాసినీ వీనా వాయిద్యం, బేబీ సాయి సహస్ర వాణి, కుమారి ఆర్.శ్రీరక్షిత భరతనాట్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శి బి.వెంకటేశం, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తేజ్‌దీప్‌కౌర్ మెనన్, టీజీఆర్టీసీ వీ.సి.సజ్జనార్, సంయుక్త కార్యదర్శి జె.భవానీ శంకర్, రాజ్‌భవన్ ఉన్నతాధికారులు, ఆయా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నీళ్లు..



(మొదటిపేజీ తరువాయి)

దొడ్డు రకం వరి ధాన్యం సాగైనట్టు లెక్కలు ఉన్నాయి.

దొడ్డు రకం క్వింటా రూ.1800, సన్న రకం రూ.2200కు మిల్లర్లు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు కురుస్తుండటం ధాన్యాన్ని ఆరబెట్టడానికి రెండు మూడ్రోజులు సమయం పడుతుండటం.. కొనుగోళ్లలో జాప్యం వల్ల రైతులు కొనుగోలు కేంద్రాలకు రావడానికి ఇష్టపడటం లేదు. మిర్యాలగూడ ప్రాంతంలో వరిని కోసిన వెంటనే నేరుగా మిల్లులో అమ్ముకుంటే నష్టం రాకుండా ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. తేమ శాతం 17 కన్నా తక్కువ ఉన్న వాటిని అదే రోజు సాయంత్రంలోగా కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, తక్షణమే చెల్లింపులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. దీనితో సన్న రకం వడ్ల కొనుగోలు జరగడం లేదు.

వర్షం.. ముందుకు సాగని కొనుగోళ్లు

ఉదయం వేళల్లో వాతావరణం ఎండగా ఉండటం.. సాయంకాలానికి మేఘాలు కమ్మేసి వర్షాలు పడటం పరిపాటిగా మారిపోయింది. దీంతో రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టుకునే క్రమంలో తడిసి ముద్దవుతోంది. దానికితోడు మిల్లర్ల కొర్రీతో నిలిచిపోయిన తూకాలతో అన్నదాతలు ధాన్యాన్ని వర్షం నుంచి రక్షించుకోవడం కోసం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తూ అరిగోస పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నల్లగొండ, భూపాలపల్లి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, తదితర జిల్లాలోని ధాన్యం రాశులు తడిసిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. మిల్లర్లు కూడా రైతులను ఇబ్బంది పెడుతున్నట్టు తెలిసింది. చివరికి ప్రయివేటు మిల్లర్లకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సీఎంఆర్‌కు 50 శాతం ధాన్యాన్ని తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా మిల్లర్లు అందుకు సిద్ధపడటం లేదు. ముందుగా డబ్బు చెల్లించాలని పెట్టిన నిబంధనను వారు వ్యతిరేకిస్తున్నారు. దీంతో లోడ్ దించడానికి కూడా మిల్లర్లు ససేమిరా అంటున్నారు.

రైతుల పక్షాన చర్యలు చేపట్టాం : నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిల్లర్ల చర్యల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా రైతుల పక్షాన చర్యలు చేపట్టామని నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి చెప్పారు. వర్షాలు పడుతున్న క్రమంలో శుక్రవారం ఆమె నల్లగొండ జిల్లాలో నల్లగొండ, శాలిగౌరారం, తిప్పర్తి కేంద్రాలను సందర్శించి రైతులు అధైర్యపడొద్దని సూచించారు. రైతుల పక్షాన తాము చర్యలు తీసుకుంటున్నామని భరోసా కల్పించారు

ప్రయివేటు మిల్లుల వైపు మొగ్గు..

పంటను కోసి ధాన్యాన్ని వెంటనే ప్రయివేటు మిల్లర్లకు అమ్ముకుంటే వచ్చిన డబ్బులతో కనీసం పెట్టుబడి అప్పులు తీరుతాయని రైతులు భావిస్తున్నారు. దాంతో మిల్లులవైపు మొగ్గుచూపుతున్నారు. నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలో రైతులు ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించి అక్కడి నుంచి ప్రయివేటు మిల్లుకు అమ్ముకున్నారు.

ఈ ఘటనలతో కంగుతిన్న అధికారులు సంబంధిత రైతులతో మాట్లాడి పరిస్థితిపై ఆరాతీశారు. తాను అమ్మకానికి తీసుకెళ్లలేదని సురక్షిత ప్రాంతంలో ఆరబెట్టుకునేందుకు తీసుకెళ్లినట్టు అధికారులకు తెలియజేసినట్టు సమాచారం.

వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి

రైతు అబ్దుల్లా, పెద్దబావిగూడెం, నార్కట్ పల్లి మండలం పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి 20 రోజుల నుంచి ఆరబెట్టుకొని వర్షం నుంచి కాపాడుకోవడం కోసం అష్ట కష్టాలు పడుతున్నాను. అయినప్పటికీ కొనుగోలు చేయడం లేదు. వారం రోజుల కిందట ఒక లారీని లోడ్ చేశారు. వెంటనే కొనుగోళ్లు వేగవంతం చేయాలి. రైతుల కష్టాలను అర్థం చేసుకోవాలి.

జీవో 27 తో మిల్లర్ల కొర్రీ

ప్రభుత్వానికి, మిల్లర్లకు చర్చలు జరిగే క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులుగా మిగిలిపోయింది. వరి కోసి 20 రోజులు దాటినా ధాన్యం కొనుగోలు జరగడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఉన్నా ఉపయోగం లేకుండా ఉందని కరీంనగర్ జిల్లాలోని పలువురు రైతులు వాపోయారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

- మంత్రి తుమ్మల



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మార్కెట్లకు, జిన్నింగ్ మిల్లులకు వచ్చిన పత్తిని కొనేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో వివిధ అంశాలపై మంత్రి సమీక్షించారు. అకాల వర్షాలు వస్తున్నందున మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, సీసీఐ అధికారులు అప్రమత్తంగా ఉండి, రైతు తీసుకొచ్చిన పంట తడవకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి కొనుగోళ్ళ విషయంలో అవకత వకలు జరిగితే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాట్సాప్ సేవల (8897281111) ద్వారా వెయిటింగ్ టైమ్, పేమెంట్ స్టేటస్, కంప్లయింట్ ఫోరం, ఇతర సేవలను రైతులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు, సెక్రటరీలు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పీఏసీఎస్ పరిధిలో కొత్త శాఖలను విస్తరించాలి

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) సేవలు రైతులకు మరింత సులభతరంగా, సమర్థవంతంగా అందేలా రీ-ఆర్గనైజేషన్ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు.

అవసరమున్న చోట కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని, సంఘాల పరిపుష్టికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పీఏసీఎస్, మార్కెటింగ్ యార్డుల్లో సంస్థాగతంగా చేపట్టాల్సిన చర్యలను మంత్రి సూచించారు. డీసీసీబీ, డీసీఎమ్ఎస్‌లలో గతంలో జరిగిన అవకతవకలన్నింటిపై శాఖాపరమైన విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై చర్యలతో పాటు, సర్ చార్జీల ఆదేశాలు వెలువడిన చోట నిధుల రికవరీ చేయాల్సిందిగా ఆయన కోరారు. ఆధునిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రయోగాత్మకంగా ప్రతి జిల్లాకు ఒక మోడల్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. మార్కెట్ల ఆధీనంలో ఉన్న గోదాముల నిర్వహణ, ఖాళీ స్థలాలను వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే విధంగా చేసి మార్కెట్ల ఆదాయం పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఆ నిధులను రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా సౌకర్యాల కల్పనకు వినియోగించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్, కో-ఆపరేటీవ్ అడిషనల్ రిజిస్ట్రార్ జి. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

దిగుమతి సుంకం పెంపుతో రైతులకు ఊరట

- టీజీ ఆయిల్ ఫెడ్ ఎండీ ఎస్‌కే. యాస్మీన్ బాషా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కేంద్ర ప్రభుత్వం ముడి పామాయిల్ దిగుమతి సుంకాన్ని 27.5 శాతానికి పెంచడం రైతులకు ఊరట అని టీజీ ఆయిల్ ఫెడ్ ఎండీ ఎస్‌కే యాస్మీన్ బాషా అని చెప్పారు. రైతులకు అధిక ధరలను అందించి, ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేసి కొత్త రైతులను ప్రోత్సహించేందుకు ఇది మరింత తోడ్పడుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ప్రస్తుతం ఆయిల్ పామ్ గెలల ధర టన్నుకు రూ.19,144కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ చొరవతో టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.6000కు పెరగడం ఆయిల్ పామ్ రైతులకు శుభ పరిణామమని అభిప్రాయపడ్డారు. ఆయిల్ ఫెడ్ మిల్‌లో 2023-24లో నమోదైన నూనె రికవరీ శాతం రికార్డు స్థాయిలో ఉన్నందున ఈ వచ్చే ఆయిల్ ఇయర్ 2024-25లో ఆయిల్ పామ్ గెలల ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండాలనే ఉద్దేశంతోనే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేపట్టి దేశంలోని రైతాంగానికి మార్గదర్శకంగా నిలవాలని కోరారు.

ఆరబెట్టిన ధాన్యం.. వర్షార్పణం

- తడిసిన ధాన్యంతో రైతుల ఆందోళన
- తూకం ప్రారంభించకపోవడంతో తీవ్ర నష్టం



నవతెలంగాణ-విలేకరులు

వాతావరణ మార్పులు, తుఫాన్ ప్రభావంతో గురు, శుక్ర వారాల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించినా తూకం వేయకపోవడంతో రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్న విషయం విదితమే. తాజాగా కురిసిన వర్షంతో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కండ్ల ముందే కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్న రైతులకు.. టార్పాలిన్లు అందించకపోవడంతో ధాన్యం తడిసి ముద్దవడంతో పాటు కొట్టుకుపోయింది.

మెదక్ జిల్లా కొల్చారం, మాసాయిపేట, వెల్దుర్తి మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం వేయడంలో ఆలస్యమవడంతో వడ్లు కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. ఇదే సమయంలో అకస్మాత్తుగా వర్షం కురిసి రైతులు తీసుకువచ్చిన ధాన్యం నీటిపాలైంది. సిద్దిపేట జిల్లాలోని దౌల్తాబాద్ మండలం ముత్యంపేట, దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట వార్డులో, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లు నీటిపాలయ్యాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టే లోపే మరలా వర్షం వస్తే ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు కన్నీరుమున్నీరవు తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ధాన్యం తడిసి ముద్దయింది.

పలు ప్రాంతాల్లో వర్షపు నీటి ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయింది. తూకం వేయడంలో జాప్యం వల్లనే ధాన్యం తడిసిందని పలువురు రైతులు వాపోయారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు రంగంపేట, అడవి పదిర, గర్జనపల్లి, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలతో పాటు కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. దాంతో తమ కష్టాన్ని కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరారు. కామారెడ్డి జిల్లా గాంధారి, లింగంపేట్, సదాశివనగర్ మండలాల్లోని పలు గ్రామాల్లో కురిసిన భారీవర్షంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోగా.. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది.

సింగరేణి ఓసి-3 నీటి ప్రవాహంతో కొట్టుకుపోయిన పంటలు

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో రెండ్రోజులుగా కురుస్తున్న అకాల భారీ వర్షంతో పంట పొలాలు నేలమట్టమయ్యాయి. నగరంపల్లి సమీపంలోని సింగరేణి ఓసీ-3 నుంచి వచ్చిన నీటి ప్రవాహంతో నగరంపల్లి గ్రామంలో గొర్రె రవికి చెందిన 3 ఎకరాల మినుమ పంట కొట్టుకుపోయింది. ఇడవేన సంతోష్ మూడెకరాల మిర్చి, కొడారి ధనంజయ ఎకరం మిర్చి, ఈడబోయిన రవి 20 గుంటల మిర్చి, గొర్రె నాగరాజు ఎకరం మిర్చి.. కొట్టుకుపోయినట్టు బాధితులు తెలిపారు. సింగరేణి ఓసీ-3 మూలంగా తమ పంటలు కొట్టుకుపోయాయని, నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

గాజాపై ఆగని ఇజ్రాయిల్ నరమేధం

(మొదటిపేజీ తరువాయి)

కూడా మౌనం వహించడాన్ని నిరసించాయి.

మరోవైపు బీరుట్ శివారు ప్రాంతాల్లో గత రాత్రి 10సార్లకు పైగా ఇజ్రాయిల్ సైన్యం దాడులకు దిగింది. తూర్పు లెబనాన్‌లోని బాల్‌బెక్ ఏరియాలో జరిగిన దాడిలో ఇద్దరు మృతి చెందారు. ఈ ప్రాంతంలో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించిన ప్రాచీన రోమన్ శిథిలాలు వున్నాయి. లెబనాన్‌లో మృతుల సంఖ్య 2,867కి చేరగా, 13,047మంది గాయపడ్డారు. ఇదిలావుండగా, ఉత్తర ఇజ్రాయిల్‌లో వేర్వేరుగా హిజ్బుల్లా జరిపిన రాకెట్ దాడుల్లో ఏడుగురు మృతి చెందారు.

కాల్పుల విరమణకు సిద్ధంగా లేరు

లెబనాన్‌పై దాడులు విస్తరించడాన్ని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాతి విమర్శించారు. అంటే కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ సముఖంగా లేదని దీంతో స్పష్టమవుతోందని అన్నారు. గ్రామాలకు గ్రామాలను, పట్టణాలకు పట్టణాలను ఖాళీ చేయాలని పదే పదే ఆదేశాలు జారీ చేయడంచూస్తుంటే కాల్పుల విరమణ ప్రయత్నాలను మొత్తంగా తిరస్కరిస్తోందని స్పష్టమవుతోందని మికాతి విమర్శించారు.

బీరుట్‌లోని దక్షిణ శివారులో జరిగిన విధ్వంసం, వినాశనానికి సంబంధించిన వీడియో చూస్తుంటే నష్టం ఏ స్థాయిలో వుందో అర్థమవుతోందని స్థానిక మీడియా వార్తలు తెలిపాయి. గోబెరి ఏరియాలో ఇళ్లు, వంతెనలు పూర్తిగా ధ్వసమయ్యాయి. కూలిన శిథిలాల నుండి వస్తున్న నల్లని దట్టమైన పొగ ఆ ప్రాంతాలను కమ్మేస్తోంది.

చలి, ఆకలితో పోరాటం

తూర్పు లెబనాన్‌లో వరుస దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో చెల్లా చెదురైన వేలాదిమంది ప్రజలు తీవ్రమైన చలి, ఆకలితో పోరాడాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో 6డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రత పడిపోతోంది. పట్టణాల్లో నిత్యావసర సరఫరాలు కూడా సరిగా అందడం లేదు. బాంబు దాడికి భయపడి ఇల్లు వదిలివెళుతున్నామంటే చలి, ఆకలితో చనిపోయే పరిస్థితులే కనిపిస్తున్నాయని నిర్వాసిత శిబిరంలో తల దాచుకున్న ఇద్దరు పిల్లల తల్లి వ్యాఖ్యానించారు.

ఇరాక్ గడ్డపై నుంచి దాడికి సిద్ధమైన ఇరాన్

ఇజ్రాయెల్‌పై మరోసారి దాడికి ఇరాన్ సిద్ధమవున్నట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఇరాక్ గడ్డ పైనుండి ఇరాన్ దాడులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లోగానే ఈ దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పెద్ద ఎత్తున డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతె ఈ దాడులు జరిపేందుకు టెహరాన్ చూస్తున్నట్లు యాక్సియోస్ రిపోర్టు పేర్కొంది. ఇరాక్‌లోని ఇరాన్ అనుకూల మిలిటెంట్ల ద్వారా ఈ దాడిని చేపట్టేందుకు ఆ దేశం సిద్ధమవుతున్నట్లు సదరు నివేదిక పేర్కొంది. అందువల్ల ఇజ్రాయిల్ మరోసారి ప్రతీకార చర్యలు చేపట్టకుండా ఉండే అవకాశం ఉంటుందని ఇరాన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. హమాస్ అధినేత ఇస్మాయెల్ హనీయా, హెజ్‌బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లా, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన నిల్ఫోరూషన్ మరణాలకు ప్రతీకారంగా నెల రోజుల క్రితం ఇజ్రాయెల్ పై ఇరాన్ దాడులు చేసింది. 200 పైగా క్షిపణులతో దాడి చేయడంపై ఇజ్రాయిల్ మండిపడింది.

ఈ దాడులపై ప్రతీకారం తీర్చుకుంటామని చెప్పిన ఇజ్రాయిల్ అన్నట్టుగానే ఇటీవల టెహరాన్‌పై దాదాపు 200 యుద్ధ విమానాలతో దాడి చేసింది. డ్రోన్ ఫ్యాక్టరీలు, బాలిస్టిక్ క్షిపణి తయారీ, ప్రయోగ కేంద్రాలపై మెరుపు దాడులు జరిపింది. దీంతో ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ దాడికి ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. అందులో భాగంగా దాడి ఘటన తమ దేశంపైకి రాకుండా ఉండేలా ఇరాక్ భూభాగం నుండే ఇరాన్ దాడులు చేసేందుకు సిద్ధమైనట్లు నిఘా వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

● విద్యుత్ పంపిణీ సంస్థ సెంట్రల్ సర్కిల్ వెంకన్న



నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యుత్ ఉద్యోగులు అంకితభావంతో పనిచేసే సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని విద్యుత్ పంపిణీ సంస్థ సెంట్రల్ సర్కిల్ వెంకన్న కోరారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో పాటు సమయపాలన సైతం ముఖ్యమని తెలిపారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అజామాబాద్ విద్యుత్ సంస్థలో అకౌంట్ అసిస్టెంట్ అధికారి(ఏఏఓ) యాదయ్య పదవి విరమణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డిఈ కమల్ కుమార్, విద్యుత్ అధికారులు సమ్మయ్య, చంద్రుడు, ప్రవీణ్, ప్రభాకర్‌లతో కలిసి యాదగిరి శ్రీదేవి దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు కరుణాకర్, శ్రీకాంత్, ఏ ఈ రాజేష్, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

'చెడుపై మంచి విజయానికి ప్రతీక దీపావళి'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ నిలుస్తుందని శ్రీ చైతన్య స్కూల్ నల్లకుంట బ్రాంచీ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం నల్లకుంట శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచీలో దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాణ సంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకష్ణుడు, సత్యభామ, నరకాసురుడి వేషధారణలో 'నరకాసుర వధ' పౌరాణిక భాషా శైలిలో నృత్య నాటిక ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే విధంగా చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ బృందాన్ని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ఏజీఎం మహమ్మద్ అలీ, కో-ఆర్డినేటర్స్ పుల్లారావు, సుధా, డీన్ నీలగిరి, ఇన్చార్జిలు శాంతి, మాలతీ, మురళీ, రవి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్రంపైనే ఆశలన్నీ..!

● మెట్రో ఫేజ్- 2 పనుల డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పించనున్న రాష్ట్ర ప్రభుత్వం

● ఇప్పటికే డీపీఆర్‌లకు ఒకే చెప్పిన రాష్ట్ర క్యాబినెట్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనులకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి లైన్ క్లియర్ అయిన సంగతి తెలిసిందే. మెట్రో అధికారులు రూ.24,239 కోట్ల వ్యయం అంచనాలతో రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన రెండు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్(డీపీఆర్‌లను) మంత్రివర్గం తాజాగా ఆమోదించింది. ఇక వారం రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రెండో విడుత పనులకు సంబంధించిన డీపీఆర్‌లను కేంద్రానికి సమర్పించనుంది. అయితే మెట్రో పనులపై కేంద్ర సర్కారు ఏ విధంగా స్పందిస్తుందో ఇక వేచి చూడాలి.

నాలుగేండ్లలో పనులు పూర్తయ్యేలా..!

మంత్రివర్గం ఆమోదం తెలపడంతో కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మెట్రో ఫేజ్-2లో భాగంగా చేపట్టనున్న ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట, నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు, రాయదుర్గ్-కోకాపేట్, మియాపూర్-పటాన్ చెరువు, ఎల్బీనగర్-హయత్‌నగర్ రూట్లలో 76.2 కిలో మీటర్ల పనులు చేపట్టే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి 8న సీఎం రేవంత్ రెడ్డి పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన చేశారు. వచ్చే నాలుగేండ్లలో పాతబస్తీకి మెట్రోను పూర్తి చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పనుల కోసం రూ.1100కోట్లను కేటాయించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో విడుత మెట్రో పనులను చేట్టాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఇందులో అంతర్జాతీయ రుణసంస్థలను భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రయివేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్(పీపీపీ) పద్దతిలో పనులు చేపట్టాలని డిసైడ్ అయ్యారు. సర్కారు వాటా 30శాతం, కేంద్రం వాటా 18 శాతం, అంతర్జాతీయ రుణసంస్థల వాటా 48శాతం, పీపీపీ పద్ధతిలో పలు సంస్థల వాటా 4శాతం నిధులు సమీకరించి పనులు చేపట్టనున్నారు. రుణసంస్థల నుంచి సేకరించే నిధులను తక్కువ వడ్డీకి పొందాలనే యోచనలో సర్కారు ఉన్నట్టు తెలిసింది. మొదటి విడుత మెట్రో పనులను పీపీపీ పద్ధతిలో చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఎక్కువ శాతం ఎల్అండ్‌టీ సంస్థనే నిధులు సమకూర్చింది.

కేంద్రంపైనే ఆశలన్నీ..!

నగరంలో మెట్రో ఫేజ్-2 పనులు చాలా జాప్యంగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో ఫేజ్-2 పనుల కోసం దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించినప్పటికీ.. వాటిని విడుదల చేయలేదు. పూణే, థానే, బెంగుళూరు, చెన్నైలో జరుగుతున్న మెట్రో మలిదశ పనుల కోసం ఇటీవల కేంద్ర సర్కారు నిధులు కేటాయించింది. ఆ నాలుగు మెట్రోలకు కలిపి దాదాపు రూ. 93వేల కోట్ల వరకు సహకారం అందించింది. హైదరాబాద్ మెట్రోకి సైతం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని ప్రభుత్వంతో పాటు మెట్రో అధికారులు ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల కేంద్రమంత్రి ఖట్టర్‌ను కలిసిన సందర్భంగా మెట్రో ఫేజ్-2 పనుల వివరాలను సీఎం ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. డీపీఆర్‌లకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో కేంద్రానికి నివేదిక పంపించనున్నారు. మెట్రో పనులకు సహకారం అందించడానికి కేంద్రం సర్కారు సైతం సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని మెట్రో అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నిరాశ్రయుల మధ్యలో దీపావళి వేడుకలు



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ నగరంలో ఫుట్ పాత్‌ల మీదనే జీవనం సాగిస్తున్న నిరాశ్రయులు, అనాధల చేతుల మీదిగా దీపాలు వెలిగించి స్వీట్‌ను అందించి దీపావళి వేడుకలను స్త్రై ఫౌండేషన్ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సేవ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తన కార్యాలయంలో దీపావళి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. టపాకాయలు స్వీట్లు పంచి సంబరాలు జరువుకున్నారు.

ఆర్.వాణికి సీఐటీయూకు ఎలాంటి సంబంధం లేదు

● సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఐటీయూ నుంచి ఆర్.వాణి ఏఐటీయూసీలో చేరిందని వచ్చిన ప్రకటనను సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జె.కుమారస్వామి, కార్యదర్శి ఎం.వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్.వాణికి సీఐటీయూకు ఎలాంటి సంబంధం లేదని వారు తెలియజేశారు. చాలా కాలం క్రితమే ఆమెను సీఐటీయూలోని అన్ని బాధ్యతల నుంచి తొలగించామని వారు చెప్పారు.

'మహేష్ కుమార్ గౌడ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన పీసీసీ లీగల్ సెల్ ప్రతినిధి బృందం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దీపావళి పండుగను పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌కు పీసీసీ లీగల్ సెల్ ప్రతినిధి బృందం కలిసి దీపావళి శుభా కాంక్షలు తెలిపింది. లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ ఆత్మకూరు యశ్వంత్ తదితరులు మహేష్ కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేతలు, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆశీస్సులతో మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింతగా బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

'టీటీడీ శ్రీవారి నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్ల విక్రయం ప్రారంభం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

టీటీడీ (తిరుమల తిరుపతి దేవస్థానములు) ముద్రించిన 'నూతన సంవత్సరం-2025' క్యాలెండర్లు, డైరీల విక్రయం శుక్రవారం హిమాయత్ నగర్‌లోని టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రారంభమైంది. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది టీటీడీ నూతన సంవత్సరం క్యాలెండర్లు, డైరీలు ముద్రించి విక్రయిస్తుంది. 12 పేజీల శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి క్యాలెండర్, అలాగే నూతన సంవత్సరం డైరీ ప్రస్తుతం విక్రయిస్తున్నారు. త్వరలో తిధులు, నక్షత్రాలతో కూడిన పంచాంగం క్యాలెండర్, నిలువెత్తు శ్రీవారి క్యాలెండర్, అమ్మవారు, శ్రీవారు ఉన్న క్యాలెండర్లు విక్రయించడం ప్రారంభమవుతుంది.

టీటీడీ శ్రీవారి దేవాలయంలో ఘనంగా దీపావళి ఉత్సవాలు

టీటీడీ శ్రీవారి దేవాలయంలో గురువారం దీపావళి పండుగ కార్యక్రమం శాస్త్రోక్తంగా ఘనంగా వైభవంగా నిర్వహించారు.దీపావళి పండుగ సందర్భంగా శ్రీవారికి ప్రత్యేకంగా అస్థానం, సాయంత్రం దీపోత్సవం జరిగాయి. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవాలయం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ప్రభు, ఆత్మకూర్ మణికంఠ, అన్నప్రసాద వితరణ డోనర్ మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం..



నవతెలంగాణ-ధూల్ పేట్

ఓ మహిళ అదృశ్యమైన సంఘటన మంగళ్ హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ షేక్ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం.. మంగళ్ హాట్ ఇందిరా నగర్ ప్రాంతానికి చెందిన శ్యామ్, వి.సంతోషి(28) దంపతులు ఆమె ఇంట్లోనే ఉండేంది. గత నెల అక్టోబర్ 23న ఉదయం ఇంట్లో నుండి బయటకి వెళ్లిన ఆమె ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు స్థానికంగా, బంధు మిత్రులకు వాకాబు చేశారు. ప్రయోజనం లేకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి..



నవతెలంగాణ-ధూల్‌పేట్


అపస్మారక స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి పురాణపూల్ గాంధీ బొమ్మ చవాన్ మెడికల్ ముందు పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న మంగళ్ హాట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముస్లిం వ్యక్తి, సుమారు 50 ఏండ్లు ఉంటాయి. శరీరం స్పర్శ లేకుండా అపస్మారక స్థితిలో ఉన్నాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



నవతెలంగాణ-అంబర్‌పేట

స్ఫూర్తి భవన్ వెల్ఫర్ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిరీష, మోహన్, శ్రీనివాస్, స్వప్న, మాధురి, అనిత, జ్యోతి, నాగరాణి, చైతన్య, అనురాధ, వందన, నర్మదా తదితరులు పాల్గొన్నారు.





మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వీహెచ్. హనుమంతరావు, ఖైరతాబాద్ జిల్లా డీసీసీ ప్రెసిడెంట్ డాక్టర్ రోహిన్‌రెడ్డిని దీపావళి పండుగను పురస్కరించుకొని దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్, తోలుపునూరి నరేష్ గౌడ్ తదితరులు

నవతెలంగాణ-అంబర్‌పేట



సికింద్రాబాద్ పార్లమెంటు కన్వీనర్‌గా ఇటీవల నియమితులైన సాయిబాబాను మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన అంబర్‌పేట నియోజకవర్గం చెందిన సీనియర్ నాయకులు ఎడెల్లి భాను ప్రసాద్, రాష్ట్ర నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆరాధ్యుడు పొట్టిశ్రీరాములు

● ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆరాధ్యుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో ఆయన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం 58 రోజులు ఆమరణ దీక్ష చేసి, తన ప్రాణాన్ని త్యాగం చేసి, భాషా ప్రయుక్తా రాష్ట్రాల్లో తొలిసారిగా తెలుగు రాష్ట్రం ఆవిర్భావానికి మార్గం సుగమం వేసిన ధన్యజీవి అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసు కుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యాపార, వాణిజ్య వర్గాలు తమ వ్యాపార సంస్థల పేర్లను తెలుగులో రాసే విధంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జీఓ ను జారీ చేయాలని కోరారు. ఈ విషయమై త్వరలో సీఎం రేవంత్ రెడ్డి , సీఎం చంద్రబాబు నాయుడులను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, నరేష్, రాజు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ పదవి విరమణ వయస్సుకే.. సేవా భావానికి కాదు



● ఆర్టీసీ ఈడీఓ మునిశేఖర్

నవతెలంగాణ-అంబర్‌పేట

ఉద్యోగ పదవి విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని, అది కేవలం వయస్సుకే తప్ప, సేవా భావానికి కాదని ఆర్టీసీ ఈడీఓ మునిశేఖర్ అన్నారు. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా పదవి విరమణ చేసిన తొగిటి గోవర్ధనాచారిని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవర్ధనాచారిని సన్మానించారు. అనంతరం ఈడీఓ మునిశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఆర్టీసీలో సేవలు అందించి ఉద్యోగుల మన్నాలను పొంది పదవి విరమణ చేయడం గొప్ప విషయమని, చారి చేసిన సేవలు ఆర్టీసీ సంస్థ ఎప్పటికి మరచిపోదన్నారు. అంకిత భావంతో పనిచేసి ఉద్యోగులకు, కార్మికులకు అన్ని విధాలుగా సన్నిహితంగా ఉంటనే పూర్తి సమాచారం సేకరించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఏఓ గీతా, ఏఓ పివి రంగారావు, విటోభా, సంధ్య, మగ్బుల్పాషా, శోభన్బాబు, పద్మావతి, రమణ, అట్టి నర్సయ్య, శీనప్ప, సుధాకర్, పి. రమేశ్, రాజేశ్, స్వరూప, లక్ష్మి, చంద్రకళ, పి.రమాదేవి, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

'కాస్మొటిక్ చార్జీలు పెంచడం హర్షణీయం'

● బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

వివిధ శాఖల ఆధ్వర్యంలోని హాస్టల్స్, గురుకులాలు, ఇతర విద్యా సంస్థల్లోని విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి నెలా చెల్లించే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మెన్ రాచాల యుగంధర్ గౌడ్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డైట్ ఛార్జీల విషయాని కొస్తే 3 నుంచి 7వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు రూ.950 నుంచి రూ.1330కు, 8 నుంచి 10వ తరగతి విద్యా ర్థులకు రూ.1100 నుంచి రూ.1540కు, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.1500 నుంచి 2100కు పెంచారన్నారు. కాస్మోటిక్ చార్జీల విషయానికొస్తే అమ్మాయిలకు 3 నుంచి 7వ తరగతి విద్యార్థినులకు రూ.55 నుంచి 175కు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు రూ.75 నుంచి రూ. 275కు పెంచారని, అబ్బాయిలకు 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి 150కు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200కు పెంచారన్నారు. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన సీఎం ఎ.రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, విద్యా, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ హాస్టల్స్ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలి

● బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-ముషీరాబాద్

బీసీ హాస్టల్స్ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో బీసీ నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ హాస్టల్‌లో చదివే విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచినందుకు హర్షం వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల పోరాట విజయమన్నారు. గురుకులాలు హాస్టల్‌లో చదువుకొని 8 లక్షల 50వేల మంది విద్యార్థులకు ఈ పెంపుదల ప్రయోజనం చేకూర్చుతుందని తెలిపారు. కాలేజీ హాస్టల్స్‌కు 1500 నుండి 2100, గురుకుల హాస్టల్స్‌కు లో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 950 నుండి 1330, 8వ తరగతి నుండి 10వ తరగతికి 1100 నుండి 1540 పెంచారు. అదే విధంగా కాస్పోటిక్ ఛార్జీలు పెంపుదల పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నాం. మంచిగా మెనూ తయారు చేసి పౌష్టిక ఆహారం పెట్టాలన్నారు. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టల్స్‌కు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు. కేటాయించిన ప్రభుత్వ స్థలాలను కూడా ప్రయివేటు సంస్థలకు, వ్యక్తులకు అధికారులు లంచాలు తిని దారదత్తం చేస్తున్నారు. దొరల కార్లు వెళ్లడానికి మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, కోకా పేట్‌లో ఫ్లై ఓవర్లు, స్కై ఓవర్స్‌ను వేలకోట్ల రూపాయలతో వెచ్చించి కడుతున్నారు. కానీ చదువుకొని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్‌లు, డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు కావలసిన విద్యార్థులను బర్రెల దొడ్డిలో పశువులను తొలినట్లు ఒక్కొక్క రూంలో 20 నుంచి 50 మందిని ఉంచుతున్నారు. సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, గొరిగ మల్లేష్, నందగోపాల్, సుధాకర్, అనంతయ్య, ఉదయ్, రవి యాదవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దాం'



● ఏఐటీయూసీ 105వ వ్యవస్థాపక దినోత్సవ సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు

నవతెలంగాణ-హిమాయత్ నగర్

భారతదేశ స్వాతంత్రానికి ముందు సంపూర్ణ స్వాతంత్రానికి భారత దేశ కార్మిక సమస్యల పరిష్కారానికి 1920 అక్టోబర్ 31న ముంబై మహానగరంలో లాలా లజపతిరాయ్ అధ్యక్షతన ఏఐటీయూసీ ఆవిర్భవించి నేటికి 105 సంవత్సరాలు పూర్తి చేసుకుందని ఏఐటీయూసీ లక్ష్యమైనటువంటి కార్మిక వర్గ రాజ్యస్థాపన, కార్మికుల సమస్యలకు అలుపెరుగని పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం హిమాయత్ నగర్ లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి అనంతరం కార్మికులను నిర్దేశించి ప్రసంగించారు. దేశంలో కార్మిక చట్టాల స్థాపనకు ఏఐటీయూసీ మాతృ సంస్థ అని తెలిపారు. భారతదేశంలోనే మొట్ట మొదటి కార్మిక సంఘం అయినటువంటి ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని నేడు దేశవ్యాప్తంగా కార్మిక వర్గం ఎంతో ఉత్సాహపూరితమైన వాతావరణంలో జరువుకుంటున్నారని, రాష్ట్రంలో ఒకవైపు దీపావళి పండుగ ఉన్నప్పటికీ కార్మికులు ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని దీపావళి కంటే ఘనంగా నిర్వహించుకోవడం కార్మిక వర్గానికి ఏఐటీయూసీపై ఉన్న అపార నమ్మకానికి నిదర్శనమన్నారు. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ రైతు ఉద్యమాల స్ఫూర్తితో కార్మిక వర్గం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రానున్న కాలంలో ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం ముందు ఏఐటీయూసీ జెండాను కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై ఎగురవేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసు, ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మనంపల్లి జైపాల్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్, మెడికల్ కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు హసీనా బేగం, ఎం.లక్ష్మీబాయి, ఎండీ. ఉమరాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ప్రెసిడెంట్స్ అప్రిసియేషన్ అవార్డును అందుకున్న డా.విజయ్‌రావు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ప్రతిష్టాత్మక తెలంగాణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్స్ అప్రిసియేషన్ అవార్డును ఈ సంవత్సరం ప్రముఖ ఇండస్ట్రియల్ ఫిజిషియన్ స్పెషలిస్ట్ డాక్టర్ జక్కుల విజయ్ రావు అందుకున్నారు. ఈ అవార్డును ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్స్ అప్రిషియేషన్ అవార్డును హైద రాబాద్‌లోని ఐఎంఏ తెలంగాణ చాప్టర్ ప్రధానం చేసింది. ఈ అవార్డును డాక్టర్ విజయ్ రావుకు ఐఎంఏ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్ బానుషాలి, డాక్టర్ కత్తుల సతీష్‌లు అవార్డును ఆయనకు ప్రధానం చేశారు. అనంతరం ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ కాళి ప్రసాద్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు, ఆవోగావ్ ఛలే కార్యక్రమంలో గ్రామాలను దత్తత తీసుకొని హెల్త్ క్యాంప్, హెల్త్ ఎడ్యు కేషన్, టీవీ ప్రోగ్రామ్స్ ద్వారా హెల్త్ అండ్‌కేర్‌ను అందిం చడం, ముఖ్యంగా రక్తదాన శిబిరాల ద్వారా ప్రాణదాతగా డాక్టర్ విజయ్రెవు ఎన్నో సేవలందించారని అభినందించారు. ఈ కార్యక్రమంలో రఘుపతి రెడ్డి నాగమోహన్, డాక్టర్ వివిఎస్ఎన్ రాజు, డాక్టర్ అశోక్, డాక్టర్ జగదీష్, రవీందర్రెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

'మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి'

● ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి

● ఐఎన్‌టీయుసీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నర్సేటి జ్యోతి నియామకం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వేతన వివక్ష, అధిక పని భారం, అభద్రత, సామజిక సమానత్వం పొందక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నా అసంఘటిత రంగంలోని మహిళా కార్మికుల సమస్యల పరిష్కరానికి ఉద్యమించాలని ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఐఎన్‌టీయుసీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మహిళా కార్మిక నాయకురాలు నర్సేటి జ్యోతిని ఐఎన్‌టీయుసీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించినట్లు ప్రకటిస్తూ నియామక పత్రాన్ని జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత ప్రగతిశీలమైన భారత రాజ్యాంగం స్త్రీ, పురుషులకు సమాన హక్కులకు హామీ ఇస్తుందని, విద్య, నైపుణ్యంతో మహిళలు పురుషుల కంటే ముందుకు దూసుకుపోతున్న తరుణంలో దేశంలో ఇంకా ప్రతిచోటా మహిళలకు రెండవ ప్రాధాన్యత ఇవ్వబడుతుండటం దుర్మార్గమన్నారు. భారతదేశంలోని శ్రామిక శక్తిలో దాదాపు 31 శాతం మంది మహిళలు ఉన్నారని, అందులో 85 శాతానికి పైగా అసంఘటిత రంగంలో పని చేస్తున్నారని, వీరికి తక్కువ వేతనం అందుతుందని, చట్టాల ప్రకారం మహిళా కార్మికులకు అందే ప్రయోజనాలు అందడం లేదని ఆయన వాపోయారు. కార్మిక హక్కులు, ప్రయోజనాల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల జాతీయకరణలో, కార్మిక చట్టాలు తీసుకురావడంలో ఐఎన్‌టీయుసీ కీలక పాత్ర పోషించిందని, కార్మికుల హక్కులు, ప్రయోజనాలు రక్షించడం కోసం ఐఎన్‌టీయుసీ ఇంకా బలోపేతం చేయాలని అంబటి కృష్ణమూర్తి కోరారు. అనంతరం నర్సేటి జ్యోతి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మహిళల సమస్యలపై, వారి హక్కులపై, ముఖ్యంగా మహిళా కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించానని తెలిపారు. తనపై నమ్మకంతో ఐఎన్‌టీ యుసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తికి ఇతర జాతీయ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ మహిళా కార్మికులు ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నర్సేటి జ్యోతి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయుసీ జాతీయ ఉపాధ్యక్షులు పులిపాటి సత్యదేవ్, జాతీయ కార్యదర్శి ఎస్.రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఏం.ఆనంద్, నేతలు బి.లలిత, ఏం.సుజాత, రాకియ సుల్తానా, రవీనా సుల్తానా, మహాలక్ష్మి, రాధా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భూములపై నిషేధం తొలగించాలని వినతి



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపాలిటీ పరిధిలో అన్నోజి గూడ కాచివన్ సింగారం కొర్రెముల ఇమ్రాన్ పేట్ లాంటి ప్రాంతాల్లో దాదాపు 64 ఎకరాల వక్ఫ్ బోర్డ్ భూములను నిషేధిత జాబితాలోకి చేర్చారు నేడు మున్సిపాల్టీ చైర్మెన్ కొండారెడ్డి ఎంపీ ఈటెల రాజేందర్ వద్దకు వెళ్లి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు బాల్ రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు జన్మదినం సందర్భంగా శుక్రవారం ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పీవీఎస్ కాలనీలోని ఫ్యూచర్ ఫౌండేషన్ లో కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బ్రహ్మయ్య సంపత్ రావు, శంకర్రావు, ప్రశాంత్, కిషోర్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను సక్రమంగా నిర్వహించాలి

- మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రూ
- సమగ్ర కుటుంబ సర్వేను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-శామీర్‌పేట

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను తప్పులు లేకుండా సక్రమంగా పక్కాగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు, ఎన్యుమరేటర్లకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం శామిర్ పేట మండలం పరిధిలోని బాబాగూడలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను కలెక్టర్ పరిశీలించారు. కుటుంబ వివరాలు ఏ విధంగా నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని అదేవిధంగా మీకు ఎన్ని ఇండ్లు సర్వే చేయాలని కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో కుటుంబ యజమాని గాని, సభ్యులు గాని స్వచ్ఛందంగా తెలిపిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలలో నింపాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు హాజరవుతున్నారా అని శామిర్ పేట ఎంపీడీఓ మమతా బాయిని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణలో ఆధార్, ఓటరు కార్డులు ఉన్న వారి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ సూచించారు.

పోచారం మున్సిపల్ కార్యాలయంలో దీపావళి వేడుకలు



నవతెలంగాణ-పోచారం

పోచారం మున్సిపల్ కార్యాలయంలో దీపావళి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. దాదాపు 45 మంది కార్మికులకు సిబ్బందికి స్వీట్ డబ్బాలను, జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ బోయపల్లి కొండల్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ సాయి తేజ, సూపర్వైజర్లు గాంధారి అశోక్, సదానంద్, పడమటి వినోద్ రెడ్డి, శ్రీనివాస్, వినోద్, సాయి కిరణ్, నరసింహ, సుభాష్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి గురుకుల విద్యార్థుల కృతజ్ఞతలు



నవతెలంగాణ-శామిర్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల డైట్ చార్జీలు , కాస్మోటిక్స్ చార్జీలు పెంచిన సందర్భంగా శుక్రవారం మండలంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల, కళాశాల హైదరాబాద్, శామిర్ పేట ప్రిన్సిపాల్, విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి కేక్‌కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పూడూరులో ఘనంగా సదర్ వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పూడూరు గ్రామంలో సదర్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. యాదవులు తమ పాడిపశువులకు,దున్నపోతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.యాదవ సంఘం,గ్రామ మాజీ సర్పంచ్ బాబుయాదవ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సదర్ వేడుకల్లో భాగంగా యాదవులు దున్నపోతులను అందంగా ముస్తాబు చేశారు. గ్రామంలోని మల్లన్న ఆలయంలో పూజల అనంతరం వేడుకల్లో పాల్గొన్నారు .వేడుకల్లో మేడ్చల్ జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మెన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు దయానంద్ యాదవ్,పెద్దగొల్ల ఎల్లంబాయి యాదవులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన దున్నపోతుల విన్యాసాలు అందరికి ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వామియాదవ్, నాయకులు మధుకర్ యాదవ్,శంకర్,సీనియర్ జర్నలిస్ట్ లక్ష్మణ్ యాదవ్,రేగు నాగేశ్,దుందిగాళ్ల మహేందర్,మాజీ వార్డు సభ్యులు శశికుమార్ యాదవ్, శ్రీకాంత్, యాదవులు గోపాల్ యాదవ్,మల్లేష్ యాదవ్,శ్రీశైలం యాదవ్,క్రిష్ణయాదవ్,గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి ఇందిరాగాంధీ : భీమిడి జైపాల్ రెడ్డి

నవతెలంగాణ-శామిర్ పేట:

మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివవని, పేదల పక్షపాతి అని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి కొనియాడారు. ఇందిరా గాంధీ 40 వ వర్ధంతి సందర్భంగా బుధవారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరయాంజాల్ మాజీ ఉప సర్పంచ్ తిరుపతి శంకర్ గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ ఉపాధ్యక్షులు వలందాస్ మురళి గౌడ్,కందాల రాము, ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, కిసాన్ సెల్ అధ్యక్షులు పిన్నింటి ధర్మారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు నానిగళ్ళ హరిగోపాల్, సేవాదళ్ అధ్యక్షులు భీమిడి కొండల్ రెడ్డి, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సుతార్ గూడెం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా మైనంపల్లి రోహిత్ బాబు జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పెద్ద కుమారుడు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం నేరేడ్ మెట్ చౌరస్తాలో నేరేడ్‌మెట్ సీనియర్ నాయకులు కే చెన్నారెడ్డి సమక్షంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అన్నదానం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్ మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎస్ఆర్ ప్రసాద్, చంద్రశేఖర్ లు పాల్గొని కేక్ కట్ చేసి రోహిత్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోహిత్ బాబు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి, మరెన్నో పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేరేడ్ మెట్ డివిజన్ నాయకులు బికె శ్రీనివాస్, కుట్టి శ్రీనివాస్ యాదవ్, రాఘవన్, యాది, ఎన్ కృష్ణ, రాజు, మహేష్, నారాయణ రెడ్డి, ఇందిరా, గోకుల్ చిత్ర, మధుసూదన్ రెడ్డి, కోటేశ్వరి, సుధా రాణి, దుర్గ, శ్రీలత, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

- కుల గణనతో బలహీన వర్గాలకు సముచిత న్యాయం
- గత పది సంవత్సరాల కాలంలో అభివృద్ధి మాటున జరిగింది... విధ్వంసమే
- బోడుప్పల్ కార్పొరేషన్ సభలో రాష్ట మంత్రి శ్రీధర్ బాబు

602

నవతెలంగాణ-బోడుప్పల్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనతో ఈ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.7 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులనుస్థానిక ఎంపీ ఈటెల రాజేందర్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు.అనంతరం బొల్లిగూడెంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి రాష్ట్రంలో చేపట్టే కుల గణన ఆలోచన చాలా గొప్పదన్నారు. 70 సంవత్సరాల కాలంలో ఏ పాలకులు చేయని పనిని రేవంత్ రెడ్డి నేతృ త్వంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుం దని దీనికి స్ఫూర్తినిచ్చింది కాంగ్రెస్ పార్టీ పార్ల మెంటరీ పక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కుల గణన చేయడం ద్వారా ఈ రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల జనాభా ప్రకారం వారికి విద్య, ఉద్యోగ రంగాలతోపాటుగా రాజకీయ రంగాల్లో కూడా న్యాయం జరుగుతుందని అన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతుంది ఇప్పటి వరకు గత పాలకులు పది సంవత్సరాల కాలంలో చెయ్యలేని పనులను చేసి చూపిస్తున్నామన్నారు. ఈ పది నెలల కాలంలో సగటున నెలకు 5 వేల ఉద్యోగాల చొప్పున ఇప్పటికే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు.అదే విధంగా ఉచిత కరెంటు, ఐదు వందలకే గ్యాస్,ఫ్రీ బస్ లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించిన నాటి నుండి ఇప్పటి వరకు 100 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని అన్నారు. అదే విధంగా ఎన్నికల్లో ఇచ్చిన విధంగా ఇంకా మిగిలి ఉన్న హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని అర్హులైన పేదలను గుర్తించేందుకు గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.



గత పాలనలో జరిగింది విధ్వంసమే

గత బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి మాటున జరిగిన విధ్వంసాన్ని పూడ్చేందుకు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. ఏ శాఖలో చూసిన అప్పులే మిగిల్చారు అని.. అన్నింటా ఆర్థిక విధ్వంసమే సష్టించారని తెలిపారు. ఇప్పుడిప్పుడే అ సమస్యల నుండి బయట పడుతున్నామని అన్నారు. బోడుప్పల్ తో పాటు ఈ ప్రాంత అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని అన్నారు. అదే విధంగా బోడుప్పల్ లో ఉన్న వక్ఫ్ భూ సమస్యకు పరిష్కారం చూపించే ప్రయత్నం చేస్తామని అన్నారు. దళితుల అసైండ్ భూమి సమస్యకు న్యాయ పరమైన ఇబ్బందులు రాకుండా నిపుణులతో చర్చించి వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో మోసపూరిత మాటలతో కోట్ల రూపాయలు ఓటర్లకు వెదజల్లి గెలిచిన మల్లారెడ్డి నేడు ప్రజల్లోకి రాకుండా ఎక్కడ దాక్కున్నాడో ప్రజలు తెలుసుకోవాలన్నారు.ఐదు సంవత్సరాలు ఎంపీగా,ఐదు సంవత్సరాలు మంత్రిగా ఉన్న మల్లారెడ్డి ఒక్క ప్రభుత్వ కళాశాల మంజూరు చేయలేదని అన్నారు. ఇక్కడ సరైన విద్యా సౌకర్యాలు లేని కారణంగా అనేక మంది పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని అందుకే మన ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఇంటర్, డిగ్రీ కళాశాల,వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,బోడుప్పల్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి, బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు, కో అప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కురుమల అభివృద్ధికి కృషి : ప్రభుత్వ విప్



నవతెలంగాణ-ఉప్పల్

రాష్ట్రంలో కురుమల అభివృద్ధికి కృషి చేస్తానని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. నూతనంగా ఎన్నికైన ఉప్పల్ కురుమ సంఘం కమిటీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి గొంగడి, రుమాలు, శాలువాలతో సత్కరించి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కురుమల ఆర్థిక అభివృద్ధి గురించి, అదేవిధంగా నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత కల్పిస్తానని కురుమలకు హామీ ఇచ్చారు. వెలుగు గుట్ట చైర్మెన్ జన్ని రఘు కురుమ, సోము జంగయ్య కురుమ, రాష్ట్ర కర్యదర్శి గొరిగె మల్లేష్ కురుమ, జోన్ అధ్యఖులు రేవు కృష్ణయ్య కురుమ, సభ్యులను ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు. చిందం వెంకటేశ్ కురుమ, ఉపాధ్యక్షులు కొంగ్ర హనుమంతు కురుమ, గొరిగె మహేష్ కురుమ, మోటే నరసింహ కురుమ,గొరిగె ఐలయ్య కురుమలు,గొరిగె నర్సిమ కురుమ,బట్కిరి బీరప్ప లు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ బాబు జన్మదినోత్సవం సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్ చౌరస్తాలో స్థానిక కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాదు పరమేష్, నాగరాజు, బాలరాజు యాదవ్, ఫరీద్, సిరిగిరి రాజు, ముత్యం యాదగిరి, రామచందర్, ఫరీద్, వైనాల ప్రవీణ్, స్వీటి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-కాప్రా

దీపావళి వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు సింగు దేవేందర్ కుటుంబ సభ్యులతో కలిసి పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ చేతుల మీదుగా మిఠాయి డబ్బాలు పంపిణీ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుమారుడు ధిరణ, నాయకులు చారి, బాలయ్య, శివాజీ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు బుధవారం మల్కాజిగిరి కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారుఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, కాంగ్రెస్ మల్కాజిగిరి బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు జి ఎస్ వి సతీష్ కుమార్, ఎస్ ఆర్ ప్రసాద్, సంపత్ గౌడ్, పి వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, కొండ గౌడ్, సంతోష్ రాందాస్, పిట్ల నాగరాజు, సురేష్ సింగ్, బాబు, సత్యనారాయణ, రాంచచందర్, సిరిగిరి రాజు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అధికారులు తలొగ్గితే సామాన్యుడి బతుకు ప్రశ్నార్థకమే

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న రజకులకు అన్యాయం చేయాలని కొంతమంది స్వార్థపరులు చూస్తున్నారని, అధికారులు రాజకీయాలకు తలొగ్గితే, సమాజంలో సామాన్యుడి బతుకు ప్రశ్నార్థకంగా అవుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని జ్యోతి నగర్ సర్వేనెంబర్ 856 లో గల దోబీ ఘాట్ సమస్యను రజకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయారు. అందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రజకులతో కలిసి శుక్రవారం నేరేడ్ మెట్ లోని తహసిల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో సీతారాంను కలిసి జ్యోతి నగర్ లోని ధోబిఘాట్ సమస్యను త్వరలో పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1985 నుండి 2021వ సంవత్సరం వరకు రజకులు తమ కులవృత్తిని జ్యోతి నగర్ ధోబిఘాట్ లోనే కొనసాగించారని, అయితే శిథిలావస్థకు చేరిన దోబిఘాట్ ను అన్ని సౌకర్యాలతో పున : నిర్మించిస్తామని బల్దియా అధికారులు దాన్ని కూల్చివేసి, చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన తర్వాత స్థానిక కాలనీ వాసులు ఒకరిద్దరు అడ్డంకులు సృష్టించడంతో ఆ పనులు నిలిచిపోయినాయన్నారు. అప్పటి నుండి రజకులకు కుల వృత్తి చేసుకోవడం ఇబ్బందికరంగా మారిందని, అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారని, అధికారుల నిర్లక్ష్య వైఖరితో ఉంటున్నారని, ఈ సమస్యను ఒక్క వారం రోజుల లోపు ఒక్క కొలిక్కి తీసుకురాకపోతే తహసిల్దార్ కార్యాలయం ఎదుట తానే స్వయంగా ధర్నాకు కూర్చుంటానని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, రావుల అంజయ్య, జీకే హనుమంతరావు, జ్యోతి నగర్ రజక సంఘం నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో ఏఎస్‌రావు వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏఎస్ రావు గారి 21వ వర్ధంతి సందర్భంగా కమలానగర్ ఆఫీసులో నివాళి కార్యక్రమం నిర్వహించారు. స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా ప్రముఖ రచయిత జయ ప్రకాష్ డాక్టర్ ఏ ఎస్ రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు గొప్ప దార్శనీకుడని చెప్పారు. కడు పేదరికంలో జన్మించి, తిండికి కూడా ఇబ్బందులు పడి, చదువును ప్రేమించి ఉన్నత చదువులు చదివారని తెలిపారు. అమెరికా స్టాంఫర్డ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివి కూడా, ఇండియాకు వచ్చి ఈ దేశ స్వావలంబన కోసం పనిచేశారని చెప్పారు. ఆయన దేశ ప్రయోజనాలే మిన్నగా ఎంచి దేశ సేవకు అంకితం అయ్యారన్నారు. స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ డాక్టర్ ఏ ఎస్ రావు ఎంతో మహోన్నతమైన వ్యక్తిత్వం కలవారన్నారు.అధ్యక్షుడు గొడుగు యాదగిరి రావు మాట్లాడుతూ డాక్టర్ ఏఎస్ రావు జయంతి సెప్టెంబర్ 20 నుంచి వర్ధంతి అక్టోబర్ 31 వరకు డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞానోత్సవాలు నిర్వహించినట్టు తెలిపారు. దానిలో ఇప్పటికే దాదాపు 10 విద్యాసంస్థలు, 20 నివాస ప్రాంతాలు ఏఎస్ రావు చిత్ర ప్రదర్శన,విజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు టి. రమేష్ ప్రసంగాలు చేసినట్టు వివరించారు. విద్యాసంస్థల్లో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నవంబర్ 4వ తేదీన కమలా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్లో ముగింపు సభ, బహుమతి ప్రదానాలు ఉంటాయన్నారు. అందరిని పాల్గొనవలసిందిగా కోరారు. రుక్కయ్య , చంద్రశేఖర్ , శివ ప్రసాద్, జయరాజ్ లు ప్రసంగించారు. అనంతరం సభ్యులందరూ డాక్టర్ ఏఎస్ రావు చిత్రపటానికి పూలను వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ శ్రీనివాస్, శ్రీనివాసరావు, , హరి ప్రసాద్, శ్రీమన్నారాయణ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా ఎన్ కోటేశ్వరి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా ఎన్ కోటేశ్వరి నియమితులయ్యారు. గురువారం నియామక పత్రాన్ని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఫౌండర్, నేషనల్ అధ్యక్షులు అయ్యప్ప, రాష్ట్ర చైర్మెన్ కేఎల్ నారాయణ చేతుల మీదగా నేరేడ్ మెట్ డివిజన్ రామకృష్ణాపురం అంతయ్య కాలనీకి చెందిన ఎన్ కోటేశ్వరకి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరి మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ లో తను చేస్తున్న సేవలకు గుర్తించి తనను కార్యదర్శిగా నియమించెందుకు సహకరించిన ఆల్ ఇండియా ఫౌండర్, నేషనల్ అధ్యక్షులు అయ్యప్ప, చైర్మన్ కేల్ నారాయణరెడ్డి, స్థానిక ఆర్గనైజేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న కాలంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తీసుకున్న ప్రతి కార్యక్రమానికి తన వంతు సహకరిస్తూ, ఆర్గనైజేషన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మోమిన్ భాషా, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు ఎన్ కృష్ణ, మల్కాజిగిరి నియోజకవర్గం లీగల్ సెల్ అధ్యక్షురాలు దుర్గ, ఆర్గనైజేషన్ సభ్యులు విజయలక్ష్మి, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ సూరారం కాంగ్రెస్ యువజన నాయకులు పరుష శ్రీశైలం యాదవ్ పుట్టినరోజు సందర్భంగా.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం హన్మంత్ రెడ్డి శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యువజన నాయకులు వినయ్ యాదవ్,మౌనిష్ యాదవ్, 126 డివిజన్ అధ్యక్షులు గణేష్, రవీందర్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలి నూతన చైర్మెన్‌గా టీవీ5 అధినేత బీఆర్ నాయుడు నియమితులైన సందర్భంగా.. వారి కార్యాలయంలో పీఏసీ చైర్మెన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావులు కలిసి శాలవతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైడ్రా కమిషనర్‌కు అమీన్‌పూర్ బాధితుల ఫిర్యాదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను శుక్రవారం అమీన్‌పూర్ బాధితులు బాధితులు కలిశారు. మాధవరెడ్డి, చంద్రశేఖర్, కోటీశ్వరరావు అనే వ్యక్తుల దగ్గర ప్లాట్లు కొని మోసపోయామంటూ ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 6 అనుమతులు చూపించి సర్వే నెంబరు 12కు చెందిన ప్రభుత్వ భూమిని ప్లాట్లుగా అమ్మారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమను మోసం చేసి అమ్మిన వ్యక్తి నుంచి నష్టపరిహారం ఇప్పించాలంటూ హైడ్రా కమిషనర్‌ను బాధితులు వేడుకున్నారు. రద్దయిన అనుమతుల విషయాన్ని బయటకు చెప్పకుండా తమను మోసం చేసి ప్లాట్లు అమ్మేసారంటూ బాధితులు తెలిపారు. పూర్తి సర్వే చేయించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీనిచ్చారు.

చెరువు అలుగురు మూసేసి..

అమీన్‌పూర్ మండలంలోని పెద్ద చెరువు అలుగులు మూసేసి.. ఎగువ వైపు తమ స్థలాల్లోకి చెరువు నీరు వచ్చేలా చేశారంటూ మరి కొంతమంది హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దచెరువు నీరు కింద ఉన్న బండికుంట చెరువుకు వెళ్లేలా కాకుండా.. అటువైపు అలుగులు మూసేయడంతో ఎగువవైపు నీరు పారుతుండటంతో తమ ఇండ్ల స్థలాలు కోల్పోయామంటూ బాధితులు ఫిర్యాదు చేశారు.

పార్కు స్థలం కబ్జా..

సర్వే నెంబర్ 153లోని హుడా అనుమతి పొందిన లే ఔట్‌లో ఉన్న పార్కు స్థలాన్ని పక్కనే కొత్తగా వెంచర్ వేస్తున్న వారు కబ్జా చేశారంటూ అమీన్‌పూర్ మండలంలోని వెంకటరమణా కాలనీవాసులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి తమ పార్కుతోపాటు.. లే ఔట్‌లోని రహదారులను కాపాడాలంటూ వేడుకున్నారు.

ఇందిరా గాంధీ 40వ వర్ధంతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా.. ఆమె చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పూల మాలలువేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... భారతదేశ ప్రజాస్వామ్యంలో అనేక సంస్కరణలు చేసి, ప్రజాహిత నిర్ణయాలు తీసుకొని ఈ దేశ ప్రజలకు అమ్మగా ఇందిరా గాంధీ చిరస్మరణీయమన్నారు.

నేటి యువత ముఖ్యంగా మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఏ విధంగా తమ తమ రంగాల్లో వృత్తి పరంగా ఎలా ఉండాలో ఇందిరా గాంధీ ఆదర్శమని తెలిపారు. అందుకే మరోసారి ఇందిరమ్మ లాంటి నాయకురాలు ఆమె ఇచ్చిన స్ఫూర్తి ఈదేశ యువత ఆదర్శంగా తీసుకొని దేశ ఐక్యత కోసం జాతీయ భావం, అభివృద్ధి పేదల పట్ల పూర్తి శ్రద్ధ అన్ని రకాల అంశాలను ప్రాధాన్యత ఇచ్చిన ఇందిరా గాంధీ స్ఫూర్తి ప్రపంచ స్థాయిలో నిలిచిన నాయకురాలని కొనియాడారు. అత్యధిక కాలం ప్రధానిగా చేసిన ఇందిరా గాంధీకి కుత్బుల్లాపూర్ ప్రజల పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నమని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో గూడ ఐలయ్య గౌడ్ రషీద్ బేక్, జయరాం,బండి శ్రీనివాస్ గౌడ్, రాఘవేంద్ర గౌడ్, ఖాజా భాయ్, పాల కృష్ణ లాల్, మహమ్మద్ షాకీర్, బాలప్ప, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భారతదేశాన్ని బలమైన దేశంగా మార్చడంలో ఇందిరా గాంధీ చేసిన కృషి సాటిలేనిది..

బాలానగర్: భారతదేశపు తొలి మహిళా ప్రధాన మంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమా నికి టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అనేక సంస్కరణలు చేసి ప్రజాహిత నిర్ణయాలు తీసుకోన్నారన్నారు. ఈ దేశ ప్రజలకు అమ్మగా ఇందిరా గాంధీ చిరస్మరణీయం, వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ లేదా సైనిక శక్తి ఏదైనా సరే, భారతదేశాన్ని బలమైన దేశంగా మార్చడంలో ఇందిరా గాంధీ చేసిన కృషి సాటిలేనిదని కొనియాడారు. బాల్యం నుండే ఇందిరమ్మ ధైర్యం, సమయస్ఫూర్తి చర్యలే ఆవిడను ఎన్నో సంవత్సరాలు ప్రధాని పదవిలో ఉంటూ.. ప్రజలకు సేవచేసేలా చేశాయన్నారు. ఇందిరమ్మ కొద్ది కాలంలోనే తన సమర్థతను ప్రపంచానికి చాటుకున్నా రని తెలిపారు.ఇందిరా గాంధీ హయాంలో బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు లాంటి సంస్కరణలు తీసుకువచ్చి.. పేద ప్రజలకి అండగా ఉందని, భారత దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా గరీబీ హటావో అనే నినాదం ద్వారా ప్రజలకు చేరవేశారని పేర్కొన్నారు. దేశ ఐక్యత కోసం జాతీయ భావం, అభివృద్ధి పేదల పట్ల పూర్తి శ్రద్ధ అన్ని రకాల అంశాలను ప్రాధాన్యత ఇచ్చిన ఇందిరా గాంధీ స్ఫూర్తి ప్రపంచ స్థాయిలో నిలిచిన నాయకురాలు అని కొనియాడారు. ఇప్పటికి ఇందిరమ్మ రాజ్యం కొనసాగు తుందని, ఇందిరమ్మ లాంటి నాయకురాలు ఆమె ఇచ్చిన స్ఫూర్తి ఈ దేశ యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పి.నాగిరెడ్డి, కూకట్‌పల్లి మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, ఓబిసి చైర్మెన్ తూము సంతోష్, తూము వినయ్, కర్కే పెంటయ్య డివిజన్ల అధ్యక్షులు మొయినుద్దీన్, తమ్మినేని ప్రవీణ్, నరసింహ యాదవ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఈ నెల 5న జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలి



- ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి. కృష్ణ

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని డివిజన్ శ్రీశ్రీనగర్ ఏఐటీయూసీ మండల సమితి ఆధ్వర్యంలో.. ఈ నెల 105 నవ్యవస్థపాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి జి.కృష్ణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 5 జరుగనున్న ఆటో, క్యాబ్, ప్రయివేటు మోటార్స్, డ్రైవర్స్ సమస్యలను పరిష్కరించాలని చేపడుతున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సూచించారు. అనంతం కృష్ణ కార్యక్రమంలో హాజరై కార్మిక జెండా ఎగరావేశారు. అనంతరం ఎనో పోరాటాలు చేసి తెచ్చుకున్న కార్మిక చట్టాలను ఇప్పుడున్న ప్రభుత్వాలు రద్దు చేస్తున్నాయని అన్నారు. కనుక కార్మికుల సమీకరించి కార్మిక, రైతు, ప్రజా వెతిరేకంగా ప్రభుత్వలను గద్దెదించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేశాక ఆటో కార్మికుల బతుకులు ఆగమ్యగోచరంగా మారాయని వాపోయారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12500 ఆటో భృతి కల్పించాలని, ఆటో మీటరు ఛార్జీలు పెంచాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో ఏఐటీయూసీ నాయకులు మనోచారి, రాజు గౌడ్, దావీద్, రాములు, కృష్ణాచారి, ఉమాదేవి, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న వారి పిల్లలతో దీపావళి వేడుకలు ఎమ్మెల్యే జరుపుకున్నారు. గురువారం జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా.. ఎమ్మెల్యే తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న వారి కుటుంబాలతో.. ప్రతి సంవత్సరంలాగానే ఆప్యాయంగా గడిపారు. అనంతరం వారి పిల్లలతో.. టపాసులు కాలుస్తూ.. దీపావళి వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అదే విధంగా మా వద్ద పని చేస్తున్న వారి కుటుంబాలతో దీపావళి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మీ సమస్యలను సమాజానికి తెలపండి



- యాప్ ప్రారంభించిన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

మీ ప్రాంతంలోని సమస్యలను, అవినీతిని సమాజానికి చూపించే ప్రయత్నం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ 'ముందడుగు యాప్' ద్వారా చేయబోతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. బంజారాహిల్స్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో సమాజంలో జరుగుతున్న అవినీతి, ప్రజల సమస్యలు, నిజాయితీ వ్యక్తులకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేం దుకు ఈ యాప్‌ను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. ముఖ్యంగా యువత ఇలాంటి వాటిపై దృష్టి సారించి, తమ సమస్యలపై స్పందిస్తూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, ముందడుగు బందం కొన్నె దేవేందర్, చెరుకూరి జంగయ్య, కొమటి రమేశ్ బాబు, వరికుప్పల గంగాధర్, గీతానంద్, తదితరులు పాల్గొన్నారు.

మిత్ర హిల్స్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలి



- భాజపా నేత రవి కుమార్ యాదవ్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మిత్ర హిల్స్ పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భాజపా నేత రవి కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి రాసిన వినతి పత్రాన్ని రవి కుమార్ యాదవ్ నేతృత్వంలో .. మిత్ర హిల్స్ కాలనీ కమిటీ సభ్యులు హెచ్ఎండిఏ కమిషనర్ సిరాజ్ సర్ఫజెని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్కు చుట్టూ విష సర్పాలు తిరుగుతున్నాయని దానివల్ల ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. సుమారుగా 800 అపార్ట్‌మెంట్ ఉన్న కాలనీ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెంటనే ఆ పార్కును శుభ్రం చేయించి.. ప్రజలను విష సర్పాల నుంచికాపాడాలన్నారు. పిల్లల ఆడుకోవటానికి ఆట స్థలంగా గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తప్పకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలకు అందుబాటులో తీసుకొస్తానని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ బొల్లేపల్లి సీతారామరాజు, భరత్ కుమార్, సుబ్బారావు, సుధాకర్ రెడ్డి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండుగ శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

దీపావళీ పర్వదినం సందర్భంగా.. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నివాసంలో జరిగిన దీపావళి పండుగ వేడుకలలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పూజ కార్యక్రమాలు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఆయన దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు పిడికిటి గోపాల్ చౌదరి, శేషగిరి నాయుడు, శ్రీధర్ చారి ఆయనను శాలువాతో సత్కరించారు.



శేరి సతీష్ రెడ్డికి దీపావళి శుభాకాంక్షలు..

దీపావళి పర్వదినం సందర్భంగా.. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డిని వారి క్యాంప్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, సుధాకర్ బాబు, రంగస్వామిలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్ వారిగా పార్టీని బలోపేతం చేయాలన్నారు.



సీఐ ముత్తుకి దీపావళి శుభాకాంక్షలు..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, శేరి సతీష్ రెడ్డి, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ సీఐ ముత్తుకి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి



- ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐక్యమత్యమే.. మహాబలమని పటేల్ నిరూపించారని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా జాతీయ అధ్యక్షురాలు డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో.. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రామ కృష్ణ మఠంలోని బాలల సేవా విభాగంలో రఘునందన్ మహారాజు సహకారంతో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి యోగా గురు సరోజని రామారావు, శోభారాణి, జ్యోతి రాజా, జయశ్రీ,పూర్ణ, ఆరతి, లక్ష్మీ డా.హిప్నో పద్మా కమలాకర్ సోమవారం బహుమతులు, పజీల్స్, పుస్తకాలు, టపాసులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఐకమత్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఐకమత్యం ఉన్నచో, సమాజంలోని అన్ని అంశాలు సామరస్యంగా పనిచేస్తాయని వివాదాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. యోగా గురు సరోజని రామారావు మాట్లాడుతూ విభిన్న సంస్కృతులు, సంప్రదా యాలు, మతాలు, భాషల భూమి అయిన భారతదేశంలో, ప్రజల మధ్య ఐక్యతను కొనసాగించడం చాలా ముఖ్యమన్నారు. జ్యోతి రాజా మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాలను ఏర్పాటు చేయడంలో, వాటిని భారత యూనియన్ కిందకు తీసుకురావడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా ప్రముఖ పాత్ర పోషించారన్నారు. యోగా గురు రామా రావు మాట్లాడుతూ భారత దేశంలోని అనేక రాచరిక రాష్ట్రాలు విభజించబడిన సమయంలో, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సమైక్య భారతదేశం యొక్క దక్పథాన్ని పట్టుకొని దాని కోసం వాదించారన్నారు. క్లబ్ కోశాధికారి శోభారాణి మాట్లా డుతూ భారతదేశ ప్రజల మధ్య సంఘీభావాన్ని పున రుద్ఘాటించడం దీని లక్ష్యమన్నారు. ప్రజలలో "భిన్నత్వం లో ఏకత్వం" స్ఫూర్తిని కొనసాగించడం దీని లక్ష్యమని తెలిపారు. అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి అనేక కార్యక్రమాలు చేస్తున్న ఉక్కు మహిళ యోగ గురువు బి.సరోజని రామారావు పుట్టినరోజు ఈ రోజే కావడం విశేషమన్నారు. అందుకే ఆమెను పిల్లలందరూ ఘనంగా సన్మానించారు.

సదర్ వేడుకలకు ముస్తాబవుతున్న బహుబలి దున్నరాజు



నవతెలంగాణ-అంబర్‌పేట

యాదవ సోదరులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నవంబర్ 2వ తేదీన నారాయణగూడలో నిర్వహించే సదర్ వేడుకలకు దున్నలను ముస్తాబు చేస్తున్నారు. బుధవారం కాచిగూడ చెప్పల్బజార్లో సదర్ వేడుకల కోసం హర్యానా, ఉత్తరప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన దున్నలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సదర్ వేడుకల నిర్వహకులు లడ్డు యాదవ్, సి.సందీప్ యాదవ్ మాట్లాడుతూ సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల కోసం ప్రత్యేకంగా 9 దున్నలను వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చినట్లు వారు పేర్కొన్నారు. బాహుబలి దున్నరాజు సదర్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుందని తెలిపారు. బాహుబలి దున్నరాజుకు మూడు కిలోల బంగారు గొలుసును వేసినట్లు తెలిపారు. అలాగే చేతక్, సూర్యకుమార్, రుద్ర, భీమ్, విరాట్, భాదల్, మున్నా, బాబు తదితర దున్నలు సందడి చేయనున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం పట్ల వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సి. నందకిషోర్ యాదవ్, సి. వినోద్ యాదవ్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకకు పుట్టినరోజు శుభాకాంక్షలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ కూకట్‌పల్లి వివేకానంద నగర్ కాలనీ మేనేజర్ ప్రియాంక, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు తెల్ల హరికృష్ణ గురు స్వామి పుట్టినరోజు శుభాకాంక్షలు తేలియజేశారు.అనంతరం ఆమె కార్యాలయంలో కలిసి, శాలువతో సత్కరించాడు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ.. ఆ అయ్యప్ప స్వామి ఆశీస్సులు మీపై ఎల్లవేళలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, సోమయ్య యాదవ్, డీజీఎం నాగ ప్రియ, కూకట్‌పల్లి మేనేజర్ అమీరుద్దీన్, ఎల్లమ్మ బోండా మేనేజర్ ఝాన్సీ, భాగ్యనగర్ కాలనీ మేనేజర్ ప్రశాంతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి, శివరేజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొని, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్
అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం న్యూ బోయిన్‌పల్లి చిన్న తోకటలోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బద్రి యాదవ్, ముప్పిడి మధుకర్, అరుణ్ యాదవ్, జాజుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పర్వ దిన వేడుకలను నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గురువారం రాత్రి కుటుంబ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి బంజరా హిల్స్‌లోని వారి నివాసంలో ఘనంగా జరుపు కున్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



చున్ని బైక్‌లో ఇరుక్కుని మహిళకు గాయాలు



- వెంటనే స్పందించి ఆస్పత్రిలో చేర్చిన ఏసీపీ

నవతెలంగాణ-బేగంపేట్
మల్కాజిగిరి జైన్ అపార్ట్ మెంట్‌కు చెందిన ఉషారాణి, ఆమె కుమారుడు సందీప్‌లు గురువారం ద్విచక్ర వాహనంపై మెహిదీపట్నంలోని వారి బంధువుల ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో మల్కాజిగిరి ఆనంద్ బాగ్ దాటి ఏటిసి సెంటర్ వద్దకు రాగానే బైక్ వెనకాల కూర్చున్నఉషారాణి చున్ని బైక్ లో ఇరుక్కుపోయింది దీంతో ఆమె అక్కడే రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న సికింద్రాబాద్ నార్త్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అది గమనించి వెంటనే స్పందించారు. తన గన్మెన్ ప్రసాద్, డ్రైవర్ వెంకట్ సహాయంతో బాధితురాలిని తన కారులో ఎక్కించుకొని దగ్గరలోని ఏ.డి.ఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో స్పందించి ఆస్పత్రికి తీసుకురావడానికి సహాయం చేసిన ఏసీపీకి బాధితులు కతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా శంకర్ రాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా గమ్యాలకు చేరుకోవాలని.. బైక్ వెనకాల కూర్చునే మహిళలు చున్నీలు,చీరలను బైక్ వీల్స్ లో ఇరుక్కోకుండా జాగ్రతపడాలని సూచించారు.

నాణ్యమైన విద్య ద్వారానే పేదరికం నిర్మూలన



- సీఆర్‌పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ
- ఫీజుల దోపిడీని అరికట్టాలి: సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ
ప్రభుత్వాలు నాణ్యమైన విద్య అందించడం ద్వారానే సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, అసమానతలు నిర్మూలించవచ్చని సీఆర్పిఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ అన్నారు. అడ్డగుట్టలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 3 న జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా విద్యారంగం సమస్యలు పరిష్కరం కావడం లేదని, ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత పథకాలు కాదు పేద వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు.

సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల నెత్తురు తాగుతున్న ప్రయివేటు కార్పొరేటు పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, శ్రీహరి ,మల్లేష్, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జి. భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ బి. జమున, సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ పి ఎల్ ప్రవీణ్, శోభ, శాంత, రామలీల, వీరయ్య, వరలక్ష్మి సందీప్ ఆర్గనైజర్స్ సువర్ణ , భాగ్య , సుమలత,లావణ్య, అరుంధతిలు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కులోని చెట్టును ఢీకొన్న కారు

నవతెలంగాణ - బంజారా హిల్స్
హైదరాబాద్ బంజారాహిల్స్‌లో పోర్షే కారు బీభత్సం సష్టించింది. శుక్రవారం ఉదయం అతివేగంతో దూసుకు పోతున్న కారు అదుపుతప్పి కేబీఆర్ పార్కు బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలోని గోడను ఢీకొట్టడమే కాకుండా పల్టీలు కొడుతూ పార్కు లోపల ఉన్న చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. నిత్యం పదుల సంఖ్యలో యాచకులు ఫుట్ పాత్ పై పడుకుంటారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నిత్యం ఈ కారు కె.బీ.ఆర్ పార్క్ చుట్టూ రాత్రి పూట తిరుగుతున్నట్లు సమాచారం. ఈ కారుకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులు కారుని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ప్రమాదం జరగగానే పారిపోయినట్టు తెలిసింది.



సంస్కృతి ,సంప్రదాయలపై విద్యార్థులకు అవగాహన అవసరం





నవతెలంగాణ-ఓయూ
సికింద్రాబాద్ లాలాగూడలోని తక్షశిల పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు విద్య, క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం మొదలైన వాటితో పాటు సనాతన ధర్మాన్ని పరిచయం చేస్తూ దీప ప్రజ్వలన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాజమాన్య బందం,ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంప్రదాయ రీతిలో విచ్చేశారు. స్వాగత నత్యం, సజనాత్మక సంభాషణ ,దీపాలతో నత్యం మొదలైన కార్యక్రమాలతో ఆద్యంతంకన్నుల పండుగగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి విద్యార్థులకు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌ఆర్ భాను, ప్రిన్సిపల్ తను ప్రీత్ కౌర్ ,వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి హెచ్‌ఎం.నాజ్మ తదితరులు పాల్గొన్నారు.



చీకటిని పారద్రోలి వెలుగునందించే దివ్యమైన పండుగ దీపావళి అని ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మెన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు పవన్ ఖేరా, పార్టీ సనత్ నగర్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు.ఉజ్జయినీ మహంకాళి ఆలయాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి అనేది ఆనందానికీ ఉత్సాహానికీ ప్రతీకగా నిలిచే పండుగ అన్నారు. అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి విజయం సాధించే దివ్యసందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని తెలిపారు.
నవతెలంగాణ-బేగంపేట

ప్రో.కోదండరాం ను కలిసిన శాతవాహన యూనివర్సిటీ వీసీ



నవతెలంగాణ-ఓయూ
శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రో.యు.ఉమేష్ కుమార్ గురువారం ఎమ్మెల్సీ ప్రో.కోదండరాంను దీపావళి పండుగ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురు ఈ సందర్భంగా పలు విద్యా పరమైన అంశాలపై చర్చించారు.



దీపావళి పండుగను మొండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక ఘనంగా జరుపుకున్నారు. అందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు
నవతెలంగాణ-బేగంపేట



శ్రీ శబరి గీరిశా మహా పాదయాత్ర సమితి బందం (బోరబండ గ్రూప్) అధ్వర్యంలో బోరబండ నుంచి శబరిమలైకు పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప స్వాములకు బోరబండ కార్పొరేటర్ మహ్మద్ బాబా ఫసియుద్దీన్ స్వాగతం పలికి కుల మతాల సామరస్యం చాటి చెప్పారు. నవతెలంగాణ- జూబ్లీహిల్స్

త్వరలోనే తార్నాక జంక్షన్‌కు మోక్షం

- బారికేడ్లు ఓపెన్ చేయనున్న ట్రాఫిక్ పోలీసులు..!
- పరిశీలించిన అధికారులు



నవతెలంగాణ-ఓయూ
ఎన్నో ఏండ్లుగా మూసి ఉన్న తార్నాక జంక్షన్‌కు త్వరలో మోక్షం లభించనున్నది. నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు జంక్షన్ ను తెరిచేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. గత కొన్నేండ్ల క్రితం తార్నాక చౌరస్తాను మూసి వేసిన పోలీసులు స్థానికుల ఫిర్యాదు మేరకు ఎట్టకేలకు దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ట్రాఫిక్ అదనపు కమిషనర్ పి. విశ్వప్రసాద్, ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్, సుల్తాన్ బజార్ ఏసీపీ సంపత్ కుమార్, జోనల్ కమిషనర్ రవికుమార్, నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తదితరులు తార్నాకకు చేరుకుని.. తార్నాక జంక్షన్‌ను ఓపెన్ చేస్తే వచ్చే సమస్యలు, వాహనాదారులకు జరిగే మేలు, తెరవాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలు, సాధ్యాసాధ్యాల గురించి ఆరాతీశారు.

ఈ సందర్భంగా అదనపు డీసీపీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ. తార్నాక చౌరస్తాలో ఫ్లై ఓవర్ ఉన్నప్పటికి సుమారు మూడు కిలో మీటర్ల మేరకు వాహనదారులు వెళ్లాల్సి వస్తున్నదని తమకు ఫిర్యాదులు అందాయని, సీపీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు తాము త్వరలో జంక్షన్‌ను తెరిచేందుకు లేదా యూటర్న్‌ను తగ్గించేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు చెప్పారు. అందుకుగాను బస్టాపులను కొంచెం దూరం మార్చాల్సి వస్తే మారుస్తామన్నారు. అదేవిధంగా నగరంలో కూడా పలు చోట్ల ఫ్లైఓవర్లు ఉన్నప్పటికి యూటర్న్ ఎక్కువ దూరం తీసుకోవడం జరిగిందని వాటిని కూడా ఏవిధంగా మార్చాలో చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ పి.భరత్ కుమార్, కోటేశ్వర్ రావు, నల్లకుంట ట్రాఫిక్ ఏఎస్ఐ వెంటేశ్వరావు పాల్గొన్నారు.

ఓయూలో ఇందిరమ్మకు నివాళి



నవతెలంగాణ-ఓయూ
ఓయూలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఓయూ విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత కోసం ప్రాణాలర్పించి, తన పరిపాలన కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి, బ్యాంకుల జాతీయకరణ వంటివి చేసి, సంక్షేమ పాలనందించిన ఇందిరమ్మ స్ఫూర్తితో నేడు రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి విద్యార్థులందరూ మద్దతుగా నిలవాలన్నారు. విచ్ఛిన్న ,విద్వేష ,రాజకీయాలు చేస్తూ దేశ సమగ్రతకు భంగం కలిగిస్తున్న శక్తులను ఎదుర్కోవాలంటే కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తూ, రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో మనందరం కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా మండలి చైర్మెన్‌కు శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఓయూ
ఉన్నత విద్యా మండలి చైర్మెన్ కిష్టారెడ్డికి బీసీ నేత లింగం గౌడ్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ కళాశాలలో ఇంజనీరింగ్ కళాశాలలో, ఉన్నత విద్యా మండలి పరిధిలో ఉన్న అన్ని కళాశాలలో అనేక రకాల సమస్యలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నూతన చైర్మెన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కళాశాలలకు విశ్వవిద్యాలయాలకు తగిన బడ్జెట్ తీసుకొచ్చే విధంగా ప్రయత్నాలు చేయాలని అన్నారు. ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎంబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడేసాబ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొమ్ము కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



బోరబండలో ఇందిరాగాంధీ వర్ధంతి



నవతెలంగాణ - జూబ్లీహిల్స్
దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి గురువారం బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బోరబండ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు వివిధ బస్తీ నాయకులు నివాళులర్పించారు.

'స్కోర్ ఓవర్ ఇన్ఫెర్టిలిటీ'తో వంధత్వ సమస్యను అధిగమించండి

- అపోలో ఫెర్టిలిటీ 'స్కోర్ ఓవర్ ఇన్ఫెర్టిలిటీ' తో వంధత్వ సమస్యను అధిగమించడంలో సాయం
- అపోలో ఫెర్టిలిటీ కన్సల్టెంట్ ఐవీఎఫ్ డాక్టర్ కల్నల్ సందీప్ కరుణాకరన్



నవ తెలంగాణ- జూబ్లీహిల్స్
అపోలో ఫెర్టిలిటీ 'స్కోర్ ఓవర్ ఇన్ఫెర్టిలిటీ' ప్రోగ్రామ్ ద్వారా వంధత్వ సమస్యను అధిగమించడంలో జంటలకు సాయపడుతున్నట్టు అపోలో ఫెర్టిలిటీ కన్సల్టెంట్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ డాక్టర్ కల్నల్ సందీప్ కరుణాకరన్ తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా స్కోర్ ఓవర్ ఇన్‌ఫెర్టిలిటీ స్క్రీనింగ్ ప్యాకేజీ ద్వారా యువ జంటలు తమ సంతానోత్పత్తి ఆరోగ్యాన్ని ముందుగా అంచనా వేయడానికి ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల జంటలకు సహాయం చేసినట్టు తెలిపారు. ఈ సమగ్ర ప్యాకేజీలో ఏఎంహెచ్, సెమెన్ స్క్రీనింగ్, యూఎస్జీ, థైరాయిడ్ స్క్రీనింగ్ వంటి పరీక్షల ద్వారా దంపతుల ఆరోగ్యాన్ని విశ్లేషిస్తున్నట్లు తెలిపారు. మా నిపుణుల బృందం రోగులకు ప్రేమతో కూడిన సేవలు అందిస్తున్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా జంటలకు తమ ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచుకునే శక్తిని ఇవ్వడం, తల్లిదండ్రుల కలను సాకారం చేయడం తమ లక్ష్యమన్నారు. అపోలో ఫెర్టిలిటీ 'థింక్ ఈక్వల్' తత్వాన్ని పాటిస్తుందన్నారు. వంధ్యత్వం అనేది పురుషులు, మహిళలను సమానంగా ప్రభావితం చేయవచ్చన్నారు. ఇద్దరూ సమానంగా పరీక్షించుకోవడం ముఖ్యమని అన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నివేదిక ప్రకారం.. భారతదేశంలో ప్రతి నాలుగు జంటలలో ఒక జంట వంధ్యత్వ సవాళ్లను ఎదుర్కొంటున్నారని తెలిపారు. అపోలో ఫెర్టిలిటీ 'స్కోర్ ఓవర్ ఇన్ఫెర్టిలిటీ' ప్రచారం జంటలు తమ పేరెంట్‌హుడ్ జర్నీని ప్లాన్ చేసుకోవడానికి, తగిన చర్యలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుందని పేర్కొన్నారు. అధునాతన రోగనిర్ధారణ పరీక్షలు, వ్యక్తిగత చికిత్స ప్రణాళికలు ఉన్నాయన్నారు. ఇవి జంటలు తమ స్థితిని అర్థం చేసుకోవడంలోనూ సరైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ సహాయపడ తాయని తెలిపారు. పేరెంట్‌హుడ్ జర్నీని ప్రారంభించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తు ఫెర్టిలిటీ సంరక్షణను దష్టిలో ఉంచుకొని ఎగ్ ఫ్రీజింగ్ కోసం 'డ్రీమ్ ఆఫ్ టుమారో', 'నౌ ఫర్ ఫ్యూచర్' వంటివి రూపొందించడంలో అపోలో ఫెర్టిలిటీ ముందుందన్నారు. అపోలో ఫెర్టిలిటీ ఇప్పటివరకు 30 వేలకు పైగా జంటలు తల్లిదండ్రుల కలను సాకారం చేసుకోవడంలో సహాయపడిందని తెలిపారు. అపోలో ఫెర్టిలిటీ దేశవ్యాప్తంగా 22 కేంద్రాలలో అందుబాటులో వైద్యం అందిస్తున్నామని తెలిపారు.

దేశంలో తనదైన ముద్ర వేసుకున్న ఇందిరాగాంధీ

- కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ



నవతెలంగాణ-బేగంపేట
దేశ తొలి మహిళా ప్రధాని దివంగత ఇందిరా గాంధీ తన అసమానమైన రాజకీయ ప్రయాణంతో తనదై ముద్ర వేసుకున్నారని కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. కోట నీలిమ అన్నారు. వివాదాస్పద 'ఎమర్జెన్సీ' సమయంలో విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఆమె స్థిరత్వం, నాయకత్వం తదుపరి తరాల కోసం శక్తివంతమైన చిహ్నంగా నిలిచిపోయాయన్నారు. గురువారం సికింద్రాబాద్‌లోని మోండామార్కెట్ వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి ఆమె నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇండియా, ఇందిరా రెండూ వేర్వేరు పదాలు కావు.. ఇవి మన దేశ చరిత్రలో ఒకదానికొకటి అంతర్భాగమై ఉన్నాయన్నారు. ఆమె వారసత్వం నుంచి ప్రేరణ తీసుకుని సమాజానికి సేవ చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొని ఇందిరా గాంధీ సేవలను స్మరించుకున్నారు. అలాగే నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మీడియా, ప్రచార విభాగం చైర్మెన్, కాంగ్రెస్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పవన్ ఖేరా, సనత్ నగర్ ఇన్‌చార్జి డా. కోట నీలిమతో కలిసి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళ్లర్పించారు.

ఎలక్ట్రికల్ గోదాములో మంటలు

- టపాసుల నిప్పు రవ్వలు పడడంతో ప్రమాదం



నవతెలంగాణ-బేగంపేట్
సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్పీ రోడ్డులో ఓ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించింది. దీపావళి పండుగ నేపథ్యంలో కొందరు బాణసంచా కాలుస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు రెండో అంతస్తు లోని రమేష్ ఎలక్ట్రికల్స్‌కు చెందిన గోదాంలో పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడ ఎలక్ట్రికల్ సామాన్లతో పాటు ఖాళీ అట్ట పెట్టెలను నిల్వ చేశారు. టపాసుల నిప్పురవ్వలు పడి అవి కాలిపోయాయి. గోదాం నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వారు వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న మహంకాళీ ఇన్‌స్పెక్టర్ పరుశురాం, రెండు ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పరిసర ప్రాంతాలలో నివాసాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదంలో గోదాంలోని ఎలక్ట్రిక్ వస్తువులు, ఖాళీ అట్ట పెట్టెలు అగ్నికి ఆహుతవ్వగా కొంతమేర ఆస్తి నష్టం జరిగింది. ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్
న్యూ బోయినపల్లి బాపూజీనగర్‌లోని శ్రీ దేవి నల్లపోచమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, బోయిన్‌పల్లి సీఐ లక్ష్మి నారాయణ రెడ్డి, హ్యూమన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రకాష్ భాటియా, వీఆర్ హాస్పిటల్ ఎండీ నందకిషోర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ.. దీపావళి అమావాస్య రోజు లక్ష్మి దేవి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, ప్రేమ్ ముదిరాజ్, జహంగీర్ గౌడ్, పుట్టి నర్సింహ, రామారావు, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నూతన గృహంలో ఘనంగా దీపావళి

నవతెలంగాణ- జూబ్లీహిల్స్
జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10 లోని తన నూతన గహంలో, మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలందరికీ ఎమ్మెల్యే దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాత్రి జూబ్లీహిల్స్ లోని తన నివాసం వద్ద కుమారుడు తలసాని సాయి కిరణ్ యాదవ్, మనువడు తారక్‌లతో కలిసి ఎమ్మెల్యే బాణసంచా కాల్చి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.



నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com

ఆటల్లో చిచ్చర పిడుగు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిమ్నాస్టిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన హైదరాబాద్ జిల్లా జిమ్నాస్టిక్ క్రీడా పోటీలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎల్బీ స్టేడియంలో కోచ్ కే సతీష్ రెడ్డి వద్ద శిక్షణ పొందుతున్న అభయ్ రామ్ బుడిగే జిమ్నాస్టిక్స్ లో ఒక సిల్వర్, రెండు బ్రాంజ్ పతకాలు సాధించాడు. ఇతను హబ్సిగూడ లోని ఐఐసీటీ జెడ్ఎమ్ హై స్కూల్‌లో రెండవ తరగతి చదువుతున్నాడు బాలుడు ఆటల పోటీల్లో రాణించడం చూసి పలువురు ప్రశంసలు , అభినందనలు తెలియజేశారు.



అష్టకళలను ప్రోత్సహించేందుకు ఎగ్జిబిషన్

నవతెలంగాణ-కంటోన్మెంట్

హస్తకళావృత్తుల వారికి ప్రోత్సాహాన్ని అందిస్తూ వారి ఉత్పత్తులను దేశవ్యాప్తంగా విక్రయించేందుకు పలు చోట్ల ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవి దేవకీ చెప్పారు. శుక్రవారం రాత్రి జింఖానా మైదానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో విలేకరులతో మాట్లాడారు. హస్తకళలను భాగస్వామ్యం చేసినట్టు తెలిపారు. నెలరోజుల ముందు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ మరో 15 రోజులు అధికారికంగా పొడిగించి అనుమతించినట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన హస్తకళ కళాకారులను, వివిధ రకాల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. కేవలం హస్తకళలే కాకుండా వినోదపరితమైన కార్యక్రమాలను సైతం ఏర్పాటు చేసి చిన్న పెద్ద తేడా లేకుండా వినోదాన్ని అందించే వివిధ క్రీడలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే 171 ప్రాంతాలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రదర్శనలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. దేశవ్యాప్తంగా డ్వాక్రా మెప్మా సంఘాలకు ప్రదర్శన మూలంగా ప్రోత్సాహం లభిస్తున్నట్టు తెలిపారు.



ఎన్నికల విధుల నుంచి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఉపశమనం

- మరోసారి ఎన్నికల అబ్జర్వర్‌గా అదనపు కమిషనర్ పేరు ఖరారు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎట్టకేలకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఎలక్షన్ విధుల నుంచి ఉపశమనం లభించింది. త్వరలో జరగనున్న ఝార్ఖండ్ ఎన్నికలకు ఎలక్షన్ అబ్జర్వర్‌గా వెళ్లాల్సిన కమిషనర్ స్థానంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు వెళ్తున్నట్టు తెలిసింది. శివకుమార్ నాయుడు ప్రస్తుతం జీహెచ్ఎంసీలో లేక్స్, హౌసింగ్ విభాగానికి అదనపు కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఝార్ఖండ్ రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్‌గా జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరితి పేరును ఖరారు చేస్తూ భారత ఎన్నికల సంఘం కొద్దిరోజుల క్రితం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతలు స్వీకరించి నెల రోజులు గడవకపోవటం, జీహెచ్ఎంసీలో పాలనపై పట్టుసాధిస్తున్న సమయంలో ఆయనను ఎలక్షన్ అబ్జర్వర్‌గా నియమించడంతో పలు విమర్శలు వస్తున్నారు. ఇదిలావుండగా ఆర్థిక సంక్షోభం తో కొట్టుమిట్టాడుతున్న జీహెచ్ఎంసీని గట్టెక్కించేందుకు తనదైన శైలిలో వ్యూహాని ్ని సిద్ధం చేస్తున్న ఇలంబర్తిని ఝార్ఖండ్ ఎన్నికలకు అబ్జర్వర్ నియమించారు. అయితే ఇటీవలే ఆయనకు ఎలక్షన్ డ్యూటీ నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ కూడా రాసింది. కానీ ముందు ఝార్ఖండ్ ఎన్నికల కమిషన్‌లో రిపోర్టు చేయాలని సూచించటంతో ఇలంబర్తి రిపోర్టు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో లేఖను పరిగణలోకి తీసుకున్న జాతీయ ఎన్నికల సంఘం ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ శివకుమార్ నాయుడు పేరును ఖరారు చేయటంతో ఆయన ఎలక్షన్ డ్యూటీకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

పదేపదే వారిపేర్లే?

ఇతర రాష్ట్రాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు 'ఎలక్షన్ అబ్జర్వర్స్‌గా' వెళ్లి ఎన్నికలు జరిపించాలంటే అంత ఆశామాషీకాదు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయాలని ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఆశించిన ఫలితాలు పొందలేక పోవచ్చు. మరికొన్ని కొన్ని రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినా ఆందోళన కారులు రెచ్చిపోయి, దాడులు, ప్రతి దాడులకు దిగుతుంటారు. తుపాకులు, బాంబులతో రెచ్చిపోయే ప్రమాదముంటుంది. ఇక జమ్మూకాశ్మీర్‌తో పాటు ఇతర బార్డర్ ఏరియాలో ఎన్నికలంటే వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. అయినా మన వద్ద పనిచేస్తున్న ఐఏఎస్‌లు ఇతర రాష్ట్రాలకు 'ఎలక్షన్ అబ్జర్వర్లుగా' వెళ్లి సమర్థవంతంగా ఎన్నికలను పూర్తి చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కానీ, దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా కొంత మంది సీనియర్ ఐఏఎస్ అధికారులనే పదేపదే 'ఎలక్షన్ అబ్జర్వర్లగా' నియమిస్తున్నారు. సీనియర్ ఐఏస్ అధికారులు సువర్ణ పండాదాస్, ఖాలీచరణ్, శివకుమార్ నాయుడుని ఇప్పటికే పలు సార్లు ఎలక్షన్ అబ్జర్వగా నియమించారు. సీనియర్ ఐఏఎస్ సువర్ణ పండాదాస్ దాదాపు 8 సార్లు ఎలక్షన్ అబ్జర్వర్‌గా వెళ్లగా, ఖాలీచరన్ దాదాపు 6 సార్లు, శివకుమార్ నాయుడు ఇప్పటికే మూడు సార్లు ఎన్నికల అబ్జర్వర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా నియామకం అయిన శివకుమార్ నాయుడు కేవలం 8 నెలల్లోనే మూడు సార్లు ఎన్నికల అబ్జర్వర్‌గా కీలక బాధ్యతలు అప్పగించారు. మరోసారి ఝార్ఖండ్ రాష్ట్ర ఎన్నికలకు అబ్జర్వర్‌గా పేరును ఖరారు చేశారు. ఆయన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పార్లమెంట్, శాసనసభ ఎన్నికలతోపాటు జమ్మూకాశ్మీర్‌లోని (భారాముల్లా) అసెంబ్లీ ఎన్నికలకు అబ్జర్వర్‌గా పనిచేశారు. ఈ సారి సైతం కీలకమైన బాధ్యతలు కేటాయించడంతో నాలుగో సారీ ఎన్నికల అబ్జర్వర్‌గా వెళ్లనున్నారని తెలిసింది. జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులల్లోనే మరో సారీ ఎన్నికల అబ్జర్వర్‌గా శివకుమార్ నాయుడుకి బాధ్యతలు అప్పగించడం సంచలనంగా మారింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా నియామకం అయిన శివకుమార్ నాయుడుని కేవలం 8 నెలల్లోనే నాలుగు సార్లు ఇతర రాష్ట్రాలకు పంపించడంతో ఆయన జీహెచ్ఎంసీలో పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించ లేకపోతున్నారు. దాంతో ఆయన విభాగంలో లేక్స్, హౌసింగ్ విభాగంలో కీలకమైన నిర్ణయం తీసుకోవడంతో జాప్యం జరుగుతోంది.

సున్నితమైన అంశాలతో జాగ్రత్త





- వదంతులను నమ్మొద్దు
- పీస్‌కమిటీ సభ్యులతో హైదరాబాద్ సీపీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో శాంతి భద్రతలకు ఢోకాలేదని, కొందరు కావాలని వదంతులూ సృష్టిస్తున్నారని వాటిని నమ్మొద్దని నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నగరంలో శాంతిని నెలకొల్పేందుకు పీస్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని సీసీసీలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నగరంలో ఇటీవల జరిగి సున్నితమై అంశాలపై చర్చించారు. మతపరమైన అంశాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రజలు, పీస్ వెల్ఫేర్ కమీటీ సభ్యులు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మెరుగు పర్చుకోవాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే చర్చించి సులువుగా పరిష్కరించుకోవాలన్నారు. మతపరమైన, సున్నితమైన అంశాలపై వస్తున్న వదంతులు నమ్మొద్దని, ప్రజలల్లో మరింత అవగాహన తీసుకురావాల్సి అవసరముందన్నారు. నగరంలో జరుగనున్న పండుగలు ప్రశాంత వాతారణంలో పూర్తి చేద్దామని కోరారు.



ఉద్యమకారుల గర్జనను విజయవంతం చేయండి

- తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి

నవతెలంగాణ- సిటీబ్యూరో

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారిని అన్ని విధాలుగా ఆదుకోవాలనే డిమాండ్ తో నవంబర్ 3న(రేపు) హనుమకొండ జిల్లా కేంద్రం పబ్లిక్ గార్డెన్ లోని వేణుమాధవ్ ప్రాంగణంలో జరుగు తెలంగాణ ఉద్యమ కారుల గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర కార్యవర్గం ఒక ప్రకటన విడుదల చేసింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్ర ప్రాంతాన్ని తెలంగాణలో కలిపిన నాటి నుండి 2014 లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించేవరకు తెలంగాణ ప్రాంతంలో జరిగిన దోపిడీ, అణచివేతలపై పోరాటం చేసిన ఉద్యమకారులను, ఉద్యమ కుటుంబాలను గుర్తించి వారికి అన్ని విధాల న్యాయం చేయాలని రాష్ట్ర కన్వీనర్ గోధుమల కుమారస్వామి కోరారు. గడిచిన ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పేర్కొన్నా విధంగా ఉద్యమకారులకు అన్ని విధాలుగా సహాయం అందించాలనీ తెలిపారు. ఉద్యమకారులను గుర్తించడానికి స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కమిటీని నియమించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానం చేసినట్లుగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఉద్యమకాలంలో నష్టపోయిన వారిని గుర్తించి వారికి ఉద్యోగాలు ఇవ్వాలని, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ లాంటి సంస్థలను స్థాపించి తెలంగాణ ఉద్యమకారులకు ఉద్యోగాలు ఇవ్వాలని కుమారస్వామి కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తారని కార్మికుల ఆశించి రాష్ట్రం కోసం ఉద్యమంలో మొదటి వరుసలో ఉండి తెలంగాణ ప్రజలను చైతన్యం చేసి రాష్ట్రం సాధిస్తే సిద్ధించిన తర్వాత ఆర్టీసీ కార్మికుల బతుకులు దుర్భరంగ మరాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లో రద్దు చేసిన యూనియన్ లను పురరుద్ధరించాలని వెంటనే ఆర్టీసీని ప్రభుత్వం లో విలీనం కు సంబంధించిన అపాయింట్మెంట్ డేట్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం అక్రమంగా తొలగించిన 469 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు అవకాశం కల్పించాలనే తదితర డిమాండ్లతో జరుగు ఉద్యమకారుల గర్జన సభకు తెలంగాణ నలుమూలల నుండి ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభకు టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు

నాటి కవులందరిపై కృష్ణ శాస్త్రి భావ కవిత్వ ప్రభావం



- వంశీ రామరాజు

నవతెలంగాణ-కల్చరల్

భావ కవిత్వ వైతాళికుడు రాయప్రోలు సుబ్బారావు కాగా అయన అనంతరం భావ కవిత్వంలో తనదైన శైలిని తో రచనలు చేసిన దేవులపల్లి కృష్ణ శాస్త్రి ప్రభావం పడని వారు నాడు లేరంటే అతిశయోక్తి కాదనీ వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళావేదికలో గాన సభ నిర్వహణ లో ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా దేవులపల్లి కృష్ణశాస్త్రి సంస్మరణ సమావేశం జరిగింది .కీలక ప్రసంగ కర్త గవంశీ రామరాజు మాట్లాడుతూ చివరి రోజుల్లో కృష్ణ శాస్త్రి గళం మూగ పోయినా ఆయన కవితా ధార మూగ పోలేదని అన్నారు. కృష్ణ శాస్త్రికి కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ ఇవ్వటం తెలుగు కవికి తొలిసారి దక్కిన గౌరవం అన్నారు. కళావీఎస్ జనార్దన్ మూర్తి మాట్లాడుతూ భావ కవిత్వ సార్వభౌముడు కృష్ణ శాస్త్రి అనీ సులువైన పదాలతో గాఢమైన భావాన్ని చెప్ప గల నేర్పు కల వారని వివరించారు. అడుగు అడుగునా గుడి ఉంది, అందరిలో గుడి వుంది, ఆ గుడి లో దీపం ఉంది ,అదియే దైవం అన్న పాటలో దైవం ఎక్కడో బైట లేదని ప్రతి వారిలో ఉన్నారని ఆయన నమ్మిన బ్రహ్మ సమాజం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని తెలిపారు. కృష్ణ శాస్త్రి కి పాట అంటే ప్రాణం అని అందుకే ఒక సినీ గీతం లో ప్రతి నిముషం పాట లాగ సాగాలి అన్నారని వివరించారు. సూరి భగవతం ట్రస్ట్ స్థాపకుడు ఎస్బి రామ్ మాట్లాడుతూ కమ్యునిజం సారాన్ని జీర్ణించుకొన్న శ్రీ శ్రీ సైతం కృష్ణ శాస్త్రి ప్రభావం నుంచి బైట పడడానికి పదేండ్లు పట్టిందన్న విషయం గుర్తు చేశారు. కార్యక్రమంలో గానసభ పాలకమండలి సభ్యురాలు శ్రీలత వర్మ గానసభ సభ్యుడు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీపై ప్రిన్సిపాల్స్‌కు శిక్షణ కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లోని రాచిటలో మహబూబియా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ కు కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం లో అగ్నిమాపక సమయములో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.



'ప్రమాద సమయంలో ధైర్యంగా. కొన్ని జాగృత్తలు పాటించాలి. ప్రధానంగా ఎలక్ట్రిక్ స్విచ్‌లను ఉపయోగించరాదు, సెలఫోన్లను వాడరాదు, లిఫ్టను వాడకుండా మెట్లమీద నుండి దిగాలి, తడిపిన కర్చీ కర్చీఫ్ ను ముక్కుకు కట్టుకుని, పాకుతూ రావాలి, డోర్లను నేరుగా కాకుండా క్రాస్ గా ఓపెన్ చెయ్యాలి, ప్రభుత్వ టోలీఫ్రీ నెం: 101 కు కాల్ చేసి సహయం పొందవచ్చును' అని హైదరాబాద్, గౌలిగూడ స్టేషన ఫైర్ ఆఫీసర్ ఎన్.ప్రవీణ్మనరీ తెలియజేశారు.

న్యాక్‌లో ఇంటీరియల్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో అందిస్తున్న ఇంటీరియల్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానించారు. జనరల్ కేటగిరీలో ఇంటర్మీడియేట్, డిప్లొమా, డీగ్రీ, బిటెక్ అర్హతవున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ శుక్రవారం తెలిపారు. ఆరు నెలల ఫ్లేస్‌మెంట్ లింక్డ్ పేమెంట్ ఇంటీరియల్ డిజైనింగ్ కోర్సుకు సంబంధించి అడ్మిషన్స్ ప్రారంభించినట్లు తెలిపారు. కోర్సులో చేరడానికి ఆసక్తిగల అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సు ఫీజుకు సంబంధించిన వివరాలను హైటెక్స్‌లోని న్యాక్ కార్యాలయంలోగానీ, లేదా 9063208703 సెల్‌ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

త్రినాథ రావు భక్తి గీతాల గానం సమ్మోహనం



నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ గాయకుడు త్రినాథ రావు ఏక గళ గానంతో శ్రోతలను సమ్మోహితుల చేశారు. శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో చింతలపూడి త్రినాధరావు తన జన్మ దిన సందర్భంలో భక్తి గీతాలను రస ప్రవాహం గా మూడు గంటల పైగా పాడి శ్రోతల ప్రశంసలందు కున్నారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ త్రినాథ రావు డెభై పై బడిన వయస్సు లోనూ గళం లో జీర లేకుండా హాయిగా పాడటం ఆయనలోని శక్తి కి నిదర్శనం అని కొనియాడారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ త్రినాథ రావు నిరంతరం గాన సాధన చేయటం వల్ల ఆయనకు వయస్సు మీద పడదని చెప్పారు. దర్శకుడు రేలంగి నరసింహారావు నిర్మాత రామసత్యనారాయణ గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి వంశీ రామరాజు తదితరులు తమ అభినందనలు తెలిపారు. సంస్థ అధ్యక్షులు చిల్ల శివ పార్వతి నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో త్రినాథ రావును అతిధులు భక్తి గాన సుధాకర బిరుదు తో సత్కరించారు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
శనివారం | నవంబర్ 02, 2024 | www.navatelangana.com



మాజీ మంత్రి, మహేశ్వరం నియోజక వర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రా రెడ్డిని, యువనాయకులు కార్తీక్ రెడ్డిని వారి నివాసంలో జల్‌పల్లి మున్సిపల్ యువ నాయకులు ఇద్రిస్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత ప్రత్యేకంగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు

నవతెలంగాణ- బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా బి.వెంకట్రాం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో జల్ పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ వర్కింగ్ ప్రసిడెంట్ యంజాల అర్జున్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత కమిషనర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి.. ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ మున్సిపల్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, అదేవిధంగా శానిటేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కమిషనర్ కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో మాజీ ఆర్మీ మెన్, సోషల్ మీడియా వారియర్ వాసు బాబు, యువ నాయకులు సిద్ధు తదితరులు ఉన్నారు.

నూరు శాతం ఖచ్చితత్వంతో

సమగ్ర సర్వేను పక్కాగా చేపట్టాలి

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

నూరు శాతం ఖచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల సర్వేను సమగ్రంగా చేపట్టాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిశోర్ సూచించారు. ఖైరతాబాద్ జోన్‌లో చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శుక్రవారం సూపర్ వైజర్‌లు, ఎన్యూమరేటర్లకు బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ కమ్యూనిటీ హాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 6 నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వివిధ వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. గ్రేటర్ పరిధిలో సర్వేను చేపట్టేందుకు 21 వేల మంది ఎన్యూమరేటర్లను వినియోగించు కుంటున్నామన్నారు. ఆర్పీలను కూడా సర్వేలో భాగం చేశామన్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు ప్రతి 10 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్‌ను నియమించామని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే సూపర్ వైజర్‌లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమగ్ర సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు చిట్టచివరి పేదవారికి చేరేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సర్వే వివరాలు నిక్కచ్చిగా నమోదు చేసేందుకు వీలుగా క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టే ముందు ప్రతి ఎన్యూమరేటర్ జిరాక్స్ సర్వే పత్రాలతో ప్రాక్టీసు చేసేలా చూడాలని, అప్పుడే వారికి పూర్తి అవగాహన వస్తుందని ముగ్పల్ అధికారులకు ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (లేక్స్) కె.శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు.



లోటస్ ల్యాప్ స్కూల్‌లో ఘనంగా దీపావళి

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్



దిల్‌సుఖ్‌నగర్ లోటస్ ల్యాప్ స్కూల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నట్టు స్కూల్ చైర్ పర్సన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కృతి సంప్రదాయాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. దీపావళి పండుగకు మూల కారణం చెడుపై మంచి సాధించిన విజయమే ప్రధానం అని పేర్కొన్నారు. శబ్ద కాలుష్యంతో పాటు పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న టపాసులు కాల్చడం వల్ల పెను ప్రమాదం ఉందని వివరించారు. దీపావళి పండుగను కాలుష్య రహితంగా నిర్వహించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరీపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్. రంగయ్య జాతీయ కన్వీనర్ త్యాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణలో ఉప్పల శ్రీనివాస్ గుప్త





నవతెలంగాణ- నాగోల్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి మంజుల రాజు ఆధ్వర్యంలో అమావాస్యను పురస్కరించుకొని కొత్తపేటలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కో కన్వీనర్ అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పబ్బ చంద్ర శేఖర్, కట్ట రవి, కటకం శ్రీనివాస్, ఆలేటి రవీందర్, వీరేందర్, ఆర్య వైశ్య సంఘం నాయకులు, మహిళా సోదరీమణులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం డివిజన్‌లో సెలూన్ ప్రారంభం

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్



ఆర్కేపురం డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రిన్స్ సెలూన్‌ను చిలుక ఉపేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యువత స్వయం ఉపాధి అవకా శాల ద్వారా ఆర్థికంగా నిలదొక్కు కోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక పద్ధతుల్లో ప్రిన్స్ సెలూన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సెలూన్ యజమాని రవికుమార్, సాయి, రాజు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

దీపాలు తీసుకెళ్తుండగా చైన్ స్నాచింగ్

నవతెలంగాణ-హయత్ నగర్

దీపావళి పండుగ సందర్భంగా దుకాణానికి వెళ్లి దీపాలు తీసుకొని ఇంటికి వస్తుండగా ఓ మహిళ మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును అపహరించారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో గురువారం మేకం బాలమ్మ దీపాలు తీసుకొని వస్తుండగా..ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును లాక్కుని వెళ్లారు. ఈ క్రమంలో బాధితురాలుతో పాటు నిందితుడు కూడా కింద పడిపోయాడు. ఆమె లేచి తెరుకునే లోగా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న వనస్థలి పురం ఏసీపీ కాశీ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.





- సమస్యలు పరిష్కరించాలని ఆందోళన
- టీచర్స్ ఉండగానే బయటకు పరుగులు
- కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం
- టపాసులు కాల్చనీయలేదని ఉపాధ్యాయులను డిఫెన్స్‌లో పెట్టడానికే ధర్నా : ప్రిన్సిపాల్

రోడ్డెక్కిన విద్యార్థులు

నవతెలంగాణ -అబ్దుల్లాపూర్ మెట్

మండలంలోని బాటసింగారం గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమ సమస్యలపై అనేక మార్లు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే జాతీయ రహదారిపై ఆందోళనకు దిగినట్టు తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను పరిష్క రించాలని వేడు కుంటున్నామన్నారు.

విద్యార్థులకు రక్షణ కరువు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాట సింగారం మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్ విద్యా ర్థులు సమస్యలతో బాధపడుతున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి హాస్టల్ నుంచి విద్యార్థులు ఒక కిలోమీటరు దూరం నడుచుకుంటూ విజయవాడ జాతీయ రహదారిపైకి వచ్చి ఆందోళనకు దిగారు. విద్యార్థులు బయటకు వెళ్లే వరకు ఉపాధ్యాయులకు, హాస్టల్ సిబ్బందికి సోయిలేదు. కనీసం సమా చారం లేని పరిస్థితిలో వెల్ఫేర్ ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాల్సిన ప్రభుత్వాలు.. విద్యారంగం పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారు. అనేక చోట్ల విద్యార్థులు చేసిన ఆందోళనలో ప్రభుత్వ తప్పిదాలర్ అందుకు ఉదాహరణ. ఇకనైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించిన వారిని విధుల నుంచి తప్పించాలి.

- శివ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఉపాధ్యాయులను డిఫెన్స్‌లో పెట్టడానికే విద్యార్థుల ధర్నా

మహాత్మ జ్యోతిరావు పూలే క్యాంపస్‌లో సుమారుగా వెయ్యికి పైగా విద్యార్థులు, 50 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. నాణ్యమైన విద్యతో పాటు క్రమం తప్పకుండా మెను ప్రకారం భోజనం అందిస్తాం. క్యాంపస్ బయటకు వెళ్లనీయకుండా, దీపావళికి టపాసులు కాల్చనీయకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో కొంతమంది విద్యార్థులు అల్లరి చేశారు. ఈ క్రమంలో తమపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారని బయపడి కొంతమంది విద్యార్థులు.. ఉపాధ్యాయులను డిఫెన్స్‌లో పడవేయడానికి ధర్నా చేశారు. క్యాంపస్‌లో టపాసులు కాల్చడం ప్రభుత్వ నిషేదం ఉంది. క్యాంపస్‌కు చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులు దొంగ చాటుగా బయటకు వెళ్తున్నారు. ఇక్కడ పరిస్థితిని జాయింట్ డైరెక్టర్ మద్దులేటి, ఆర్‌సీఓ ఆదిత్య వర్మ పరిశీలించారు. ఆందోళనకు దిగిన విద్యార్థులను గుర్తించాం. వారిని ఇతర క్యాంపస్‌కు పంపే ఏర్పాట్లు చూస్తాం..

- నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్

కుల గణనలో భాగస్వాములు కావాలి

కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతిష్మాత్మకంగా చేపట్టిన కుల గణనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో నిర్వహించే కుల గణన సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలు తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి తలపెట్టిన కుల గణన సర్వేకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిగా అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్న కుల గణన సర్వే 30 నాటికి పూర్తి చేసి దేశానికి ఆదర్శంగా నిలుస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి ఫలాలు పేద వర్గాలకు అందేలా, రాజ్యాంగం ప్రసాదించిన సమాన హక్కులు బడుగు, బలహీన వర్గాలకు అందేలా కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ చెప్పినట్టు అన్ని వర్గాలకు సమ న్యాయం జరగాలంటే కుల గణన సర్వే అవసరమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో చేపట్టబోయే ఈ సర్వేపై విపక్షాలు అనవసర రాద్ధాంతం చేయకుండా... మేధావులు, సామాజిక వేత్తలు, కుల సంఘాల పెద్దలు సహకరించి అమూల్యమైన సలహాలు ఇవ్వాలని కోరారు.

క్రాకర్స్‌తో పలు చోట్ల అగ్నిప్రమాదం

ఫైర్ అధికారి శ్రీధర్



నవతెలంగాణ-హయత్ నగర్

దీపావళి పండుగ కొందరి ఇళ్లల్లో సంబరాలు..మరి కొందరి ఇండ్లల్లో విషాదం నింపిందని ఫైర్ అధికారి శ్రీధర్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ గురువారం రాత్రి సమయంలో హయత్ నగర్ ఫైర్ స్టేషన్ పరిధిలో ఉన్న నాగోల్ విశాల్ మార్ట్ పక్కన ఉన్న చెత్తకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని చెప్పారు. సకాలంలో స్పందించిన చుట్టుపక్కల వారు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆ నిప్పును ఆర్పేశారని తెలిపారు. అదేవిధంగా మన్సూరాబాద్‌లోని మధురానగర్ కాలనీలో రాకెట్ అంటుకుని ప్రింటింగ్ ప్రెస్‌లో అగ్నిప్రమాదం జరిగితే.. కాలనీ వాసులు అప్రమత్తతో వెంటనే ఆ మంటలు ఆర్పివేశారని చెప్పారు. సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా పాత సోఫా గదిలో రాకెట్ పడి మంటలు చెలరేగాయి.. ఫైర్ సిబ్బంది అప్రమత్తతో వెంటనే ఆర్పివేసినట్టు పేర్కొన్నారు. హయత్ నగర్‌లోని వినాయక నగర్ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న బిల్డింగ్‌లో క్రాకర్స్ కాల్చే సమయంలో రాకెట్ అంటుకుని పడుకున్న అనిల్ చేతులు కాలినట్టు తెలిపారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. అదృష్టవశాత్తు హయత్ నగర్ ఫైర్ స్టేషన్ పరిధిలో ఎవరికి కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని ఫైర్ అధికారి శ్రీధర్ వెల్లడించారు.

ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి దీపావళి శుభాకాంక్షలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్



దీపావళి పర్వ దినాన్ని పురస్కరించుకొని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ చిలుక మధు సూదన్‌రెడ్డి శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

బడంగ్‌పేట్‌లో ఇంటింటి సర్వే ప్రారంభం

- కుల గణనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి



గనవతెలంగాణ- బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని డివిజన్లలో ఇంటింటికీ కుల గణన సర్వే కార్యక్రమం ప్రారంభించినట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30వ డివిజన్ పరిధిలోని రోమా 2 కాలనీలో స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డితో కలసి కుల గనన సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన సర్వేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో 110 బ్లాకులు, 1బ్లాకుకు 150 ఇండ్లు ఉండేవన్నారు. 2024జనాభా లెక్కల ప్రకారం 373 బ్లాకులకు గాను 397మంది ఎన్విరేటర్ల సహాయంతో ప్రతి ఇంటికి ఎన్వరెటర్లు వెళ్లి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర అంశాలపై సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 10శాతం ఎన్విరేటర్లు రిజర్వులో ఉంటారన్నారు. ఈ సర్వేలో డ్వాక్రా పీఆర్‌పీలు, అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది సర్వే చేయడం జరుగుతుందన్నారు.

ఈ సర్వేలో భాగంగా 1వ, 2వ,3వ తేదీల్లో ఎన్వేరటర్లు ప్రతి ఇంటికీ వెళ్లి స్టీకరింగ్ చేయటం జరిగిందన్నారు. 6వ తేది నుండి 18వ తేదీ వరకు ప్రతి ఇంటికి వెళ్లి పలు అంశాలపై సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. 19 నుండి 27వరకు పూర్తి వివరాలను ఆన్లైన్‌లో పూర్తి వివరాలను రికార్డు చేయడం జరుగుతుందన్నారు. 10మందికి 1ఒక్కరు సూపర్వైజర్లను నియమించడం జరిగిందని, వీరందరీపై డీఈఈ నర్సింగ్ రాజ్ పర్యవేక్షణ అధికారిగా పని చేస్తారన్నారు. 2011లో జనాభా లెక్కల ప్రకారం 21వేల 455 ఇండ్లు ఉండగా..2024 జనాభా లెక్కల ప్రకారం 50వేల 359 ఇండ్లు ఉన్నట్లు కమిషనర్ సరస్వతి తెలిపారు. ఈ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అంగరంగ వైభవంగా సదర్ ఉత్సవాలు



నవతెలంగాణ-నాగోల్

అఖిల భారతీయ యాదవ సంఘం నగేష్, మన్సూరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా హాజరై మాట్లాడారు. యాదవుల ఐక్యత, పాడిపంటలు, పశువు సంపదను ప్రతిబింబిస్తూ ప్రతి ఏటా నిర్వహించే సదర్ పండుగ ఉత్సవాలలో భాగంగా యాదవ్ సోదరుల ఆహ్వానం మేరకు పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. అధికారికంగా సదర్ సమ్మేళనం జరపడం సంతోషమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యాదవ సోదరులు దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసుకునే సదర్ ఉత్సవాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమైన అంశమని పేర్కొన్నారు. సదర్ అనేది యాదవుల ఖదార్ అని అందుకే ప్రతి దీపావళి పండుగ సందర్భంగా సదర్ ఉత్సవాలు చేసుకోవడం జరుగుతుందని వివరించారు.




నవతెలంగాణ- బడంగ్‌పేట్

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే సదర్ ఉత్సవాలను నాదర్‌గుల్ గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించినట్టు మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. గురువారం రాత్రి మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్ గుల్, పలు డివిజన్‌లలో నిర్వహించిన సదర్ ఉత్సవాలకు అందెల శ్రీరాములు యాదవ్ హాజరై.. దున్న రాజులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, జీ.ఇంద్రసేన, రైతు సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి, డైరెక్టర్లు తోట ప్రతాప్ రెడ్డి, మాజీ చైర్మెన్ పి.పుల్లారెడ్డి, సీనియర్ నాయకులు ఏనుగు రాంరెడ్డి, వివిధ మోర్చాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భాగస్వామి తీరు నచ్చకపోవడమో, తమ కోరికలకు తగ్గట్టు నడుచుకోక పోవడమో, ప్రేమ తగ్గిపోవడమో, వైవాహిక బంధంలో అసంతృప్తితోనో ఇలా అనేక కారణాలతో ఇతరులతో సంబంధాలు పెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా భార్యభర్తల బంధంలోకి అడుగుపెట్టిన తర్వాత దానికి ఒక విలువ ఇవ్వాలి. ఏదైనా సమస్యలు వస్తే కూర్చొని మాట్లాడుకోవాలి. అలా కాకుండా భాగస్వామిని మోసం చేయడం సరైనది కాదు. దీని వల్ల అనేక సమస్యలు ఎదురవుతాయి. అలాంటి ఓ కథనమే ఈ వారం ఐద్వా అదాలత్‌లో...



బంధానికి విలువివ్వండి

సాక్షికి సుమారు 40 ఏండ్లు ఉంటాయి. నవీన్‌తో పెండ్లయి 20 ఏండ్లు అవుతుంది. ఇద్దరిదీ ప్రేమ వివాహం. నవీన్ వాళ్ల ఇంట్లో మాట్లాడి పెద్దలను ఒప్పించి ఆర్య సమాజ్‌లో పెండ్లి చేసుకున్నాడు. సాక్షి వారి కుటుంబం మాత్రం వారి వివాహాన్ని అంగీకరించడానికి కొంత సమయం పట్టింది. ఇప్పుడు వారికి ఇద్దరు పిల్లలు. ఓ అబ్బాయి, ఓ అమ్మాయి. అంతకు ముందు ఉమ్మడి కుటుంబంలో అందరూ కలిసి ఉండేవారు. నాలుగేండ్ల నుండి విడిగా ఉంటున్నారు. అయితే ఉండేది మాత్రం ఒకే బిల్డింగ్‌లో. అందరూ ఉద్యోగాలు చేసుకుంటూ ఎవరి సంసారం వాళ్ల నడుపుకుంటున్నారు. పండగైనా, ఫంక్షనైనా అందరూ కలిసి ఒకే దగ్గర చేసుకుంటారు. సాక్షి మామయ్య చనిపోయారు. అత్తయ్య మాత్రమే ఉంటుంది. అందరూ ఒకరికి ఒకరు సహకరించుకుంటారు. సాక్షి, నవీన్ ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంట్లో పని చేయడానికి కూడా ఓ అమ్మాయిని పెట్టుకున్నారు. పిల్లలు డిగ్రీ చదువుతున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా అందరూ కలిసి పరిష్కరించుకుంటారు. కానీ సాక్షి సమస్యను మాత్రం అత్తయ్య పట్టించుకోవడం లేదు.

నవీన్ వేరే మహిళతో సంబంధం పెట్టుకున్నాడు. అత్తకు చెబితే 'మగాడు అన్న తర్వాత సంబంధాలు పెట్టుకుంటాడు. ఎవరితో సంబంధం ఉన్నా నిన్ను బాగానే చూసుకుంటున్నాడు కదా! ఇంకెందుకు గొడవ చేస్తావు. నువ్వు సరిగ్గా పట్టించుకోకనే వాడు ఇలా తయారయ్యాడు' అంటూ తన కొడుకునే సమర్థిస్తుంది. నవీన్ అన్నకు తెలిసి పిలిచి మాట్లాడితే 'అలాంటిది ఏమీ లేదు' అన్నాడు. తర్వాత ఆయన ఫోన్ తీసుకొని చెక్ చేస్తే విషయం అర్థమై కోప్పడ్డారు. దాంతో రెండేండ్లు బాగానే ఉన్నాడు. నవీన్ అన్న ఉద్యోగ రీత్యా వేరే రాష్ట్రం వెళ్ళిపోయాడు. దాంతో మళ్లీ మొదటికొచ్చాడు. ఇలాంటి పరిస్థితుల్లో తోటికోడలి సలహాతో సాక్షి తనకు న్యాయం చేయమంటూ ఐద్వా లీగల్‌సెల్‌కు వచ్చి తన సమస్య మొత్తం చెప్పుకుంది.

మేము నవీన్‌కు ఫోన్ చేసి పిలిపించాము. సాక్షి చెప్పిన దాని గురించి అడిగితే 'ఆమెను నేను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. అలాంటిది నన్ను ఇంట్లో అందరిముందు తలదించుకునేలా చేసింది. మా వదినమ్మ నన్ను తన తమ్ముడిలా చూస్తుంది. నాకు మంచి సలహాలు ఇచ్చేది. మా పెండ్లప్పుడు కూడా ఆమే అందరితో మాట్లాడి ఒప్పించింది. ఆమంటే నాకెంతో గౌరవం. అలాంటి ఆమె దగ్గర నా పరువు పోయింది. నాకు చాలా బాధగా ఉంది. మా అన్నయ్య చెప్పిన తర్వాత నేను ఎవరితోనూ సంబంధం పెట్టుకోకూడదని నిర్ణయించుకున్నాను. ఇప్పుడు నాకు ఎవరితోనూ సంబంధం లేదు. మా అన్నయ్యకు మా బంధువుల్లో మంచి గౌరవం ఉంది. నేను దాన్ని పాడు చేయలేను. కానీ సాక్షి నన్ను అనుమానిస్తూనే ఉంది. నాతో పాటు ఉద్యోగం చేస్తున్న ఆమెతో నేను సంబంధం పెట్టుకున్నాను అనుకుంటుంది. ఆమె భర్త వేరే చోట ఉంటాడు కాబట్టి ఆమెకు ఎప్పుడైనా అవసరమైతే చిన్న చిన్న పనులు చేసి పెడుతుంటాను అంతే తప్ప ఆమెకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు' అని చెప్పుకొచ్చాడు.

> ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. ఇదేనా ప్రేమంటే. ప్రేమించి పెండ్లి చేసుకోవడం గొప్ప కాదు. జీవితాంతం ఆ ప్రేమను నిలబెట్టుకోవడం ముఖ్యం. మీ పిల్లలు పెద్ద వాళ్లు అయ్యారు. తల్లిదండ్రులుగా మీ బాధ్యతలు పెరుగుతాయి. అయినా ఒకరికోసం ఒకరు కొంత సమయం కేటాయించుకోండి. వేరే వాళ్లతో సంబంధాలు పెట్టుకొని సంసారాన్ని పాడుచేసుకోవద్దు.

'సాయం చేస్తే ఎవరూ అనుమానించరు. ముందు నువ్వు మీ అన్నా, వదిలను ఒకసారి తీసుకొని వస్తే వాళ్లతో కూడా ఓ సారి మాట్లాడతాము' అని చెప్పాము. 'వాళ్లు వేరే దగ్గర ఉంటున్నారు. కావాలంటే మా అమ్మను తీసుకొస్తాను' అన్నాడు. 'మీ అన్నా వదినలు వస్తేనే మేము మాట్లాడతాము' అని చెప్పాము. పైగా వాళ్ల వదినే సాక్షిని ఇక్కడకు పంపించిందనది కూడా చెప్పాము. దాంతో అతను మా వదిన ముందు మళ్లీ నా పరువు తీశావు. ఇక నువ్వు నాకు వద్దు. విడాకులు ఇచ్చేస్తాను' అంటూ కేకలు పెట్టాడు.

సాక్షి వెంటనే తన తోటికోడలికి ఫోన్ చేసి నవీన్ మాటలు వినిపించింది. ఆమె మాతో 'నవీన్ నా కొడుకు లాంటి వాడు. కొంచెం దారి తప్పుతున్నాడు. ఏది మంచి, ఏది చెడు అనే విషయం మర్చిపోయి ప్రవర్తిస్తున్నాడు. భార్యను కాదని వేరే ఆమెతో సంబంధం పెట్టుకున్నాడు. భార్య బాధ్యతలు గుర్తు చేస్తుంది. వేరే వాళ్లకు అలాంటి అవసరం ఏమీ లేదు. అందుకే ఆమె అతనికి మంచిగా కనిపిస్తుంది' మీరే ఎలాగైనా కౌన్సెలింగ్ ఇచ్చి వారి సంసారాన్ని నిలబెట్టండి. మరో ఏడాదిలో మేము తిరిగి వచ్చేస్తున్నాము. అప్పటి వరకు మీరే వాళ్లకు నచ్చజెప్పండి' అని చెప్పి ఫోన్ పెట్టేసింది.

'నవీన్‌కు నాతో ఉండటం ఇష్టం లేకపోతే విడాకులు తీసుకుంటాను. నేను ఉద్యోగం చేసుకుంటున్నాను. నా బతుకు నేను బతకగలను. నాకూ ఆత్మాభిమానం ఉంది. ఇలాంటి వ్యక్తితో నేను ఎలా కలిసి బతకాలి మేడం. అక్కా, బావ వచ్చిన తర్వాత విడాకులు ఇచ్చి వెళ్లిపోతాను' అంటూ ఏడ్చేసింది. దానికి మేము 'చూడు సాక్షి ఆవేశ పడొద్దు, అతనితో మేము మాట్లాడతాము కదా!' అని సర్ది చెప్పి...

'నవీన్ నువ్వు చేస్తుంది తప్పు. పైగా సాక్షినే బెదిరిస్తున్నావు. నువ్వు ఏం చేసినా చూస్తూ ఊరుకోవాలా? ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. ఇదేనా ప్రేమంటే. ప్రేమించి పెండ్లి చేసుకోవడం గొప్ప కాదు. జీవితాంతం ఆ ప్రేమను నిలబెట్టుకోవడం ముఖ్యం. మీ పిల్లలు పెద్ద వాళ్లు అయ్యారు. తల్లిదండ్రులుగా మీ బాధ్యతలు పెరుగుతాయి. అయినా ఒకరికోసం ఒకరు కొంత సమయం కేటాయించుకోండి. వేరే వాళ్లతో సంబంధాలు పెట్టుకొని సంసారాన్ని పాడుచేసుకోవద్దు. మీ పిల్లలకు తెలిస్తే మీ పరువు పోతుంది. వాళ్లు మీ మాట వినరు. మిమ్మల్ని అసహ్యించుకుంటారు. సాక్షితో సంతోషంగా ఉండండి. అది మీకూ, మీ కుటుంబానికి మంచిది. అలా కాకుండా మీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తానంటే మీ ఇష్టం. మీ కుటుంబాన్ని మీరు దూరం చేసుకోవల్సి వస్తుంది. తర్వాత ఎంత బాధపడ్డా ఫలితం ఉండదు. మీ భార్యకు మీరంటే ఎంతో ఇష్టం. అందుకే తన సంసారాన్ని నిలబెట్టమని మా దగ్గరకు వచ్చింది. అర్థం చేసుకోండి. ఇద్దరూ సంతోషంగా ఉండండి' అని చెప్పాము.

అంతా విన్న తర్వాత అతను కాస్త ఆలోచించి 'మీరు చెప్పింది నిజమే మేడం, అనవసరంగా నా భార్యను బాధపెట్టాను. వేరే మహిళ ఆకర్షణలో పడి నా కుటుంబాన్ని పక్కన పెట్టాను. మా అన్నయ్య, వదిన కూడా నన్ను అసహ్యించుకుంటున్నారు. రేపు నా పిల్లల ముందు కూడా దోషిలా నిలబడాల్సి వస్తుంది. ఇకపై ఎలాంటి తప్పు చేయను. నా భార్య పిల్లలతో సంతోషంగా ఉంటాను. బాధ్యతగా నడుచుకుంటాను' అని చెప్పి సాక్షిని తీసుకొని వెళ్లాడు.

- వై వరలక్ష్మి
9948794051

వాల్‌నట్స్ తింటే..

వాల్‌నట్స్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. వీటి గురించి అందరికీ తెలుసు. వీటిని అక్రోట్లు అని కూడా పిలుస్తారు.

డ్రై ఫ్రూట్స్‌లో ఇవి కూడా ఒకటి. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపున వాల్‌నట్స్ తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన వాల్‌నట్స్‌లో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ తినొచ్చు.



వీటిని నానపెట్టి ఉదయం తినడం వల్ల గుండెకు చాలా మంచిది. హార్ట్ బ్లాక్స్ వంటివి ఏర్పడకుండా చేస్తుంది.

ఇవి తినడం వల్ల చర్మానికి, జుట్టుకు కూడా మంచి పోషణ అందుతుంది. జుట్టు బలంగా, దృఢంగా తయారవుతుంది. అదే విధంగా దెబ్బతిన్న చర్మ కణాలను రిపేర్ చేస్తుంది. కాబట్టి చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి.

పరగడుపున నానబెట్టిన వాల్‌నట్స్ తినడం వల్ల ఎముకలు కూడా బలంగా ఉంటాయి. ఇందులో ఐరన్ కూడా మెండుగా లభిస్తుంది. కాబట్టి రక్త హీనత సమస్య ఉన్న వారు వీటిని తింటే త్వరలోనే ఉపశమనం పొందుతారు.

ఇందులో ఫైబర్ చాలా ఎక్కువ. కాబట్టి జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. మల బద్ధకం సమస్య తగ్గుతుంది. అలాగే బరువు తగ్గాలి అనుకునేవారు వీటిని తింటే ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. వీటిని తింటే.. మెదడు చక్కగా పని చేస్తుంది. జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుంది.

కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

(మొదటిపేజీ తరువాయి)

ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనుంది. కాగా తొలి దఫా ఉత్తర్వుల్లో మూడు నెలలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు అనుగుణంగా జస్టిస్ ఘోష్ విచారణ కొనసాగిస్తున్న విషయమూ విదితమే. కాగా తొలి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వ గడువు పెంపు శుక్రవారంతో పూర్తయింది. అయితే, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా ముగియలేదు. విచారణలో భాగంగా ఎగ్జామినేషన్, క్రాస్ ఎగ్జామినేషన్ ఇంకా నడుస్తున్నది. అది కూడా అధికారులు, ఇంజినీర్లు, రిటైర్డ్ ఇంజినీర్ల వరకే పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదిక ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే అప్పటి ప్రభుత్వ పెద్దలైన సీఎం, సాగునీటి శాఖ మంత్రి, ఈ విషయంతో సంబంధమున్న ఇతర ప్రజాప్రతినిదులు, రాజకీయ నాయకులను కూడా విచారించేందుకు కమిషన్ సన్నద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత ఫైలు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ అయ్యే అవకాశం ఉంది.

కొత్త డైట్‌ను అందుబాటులోకి తేవాలి

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో ముఖ్యమంత్రికి విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, వివిధ సంక్షేమ విభాగాల సెక్రెటరీలు కృతజ్ఞతలు తెలిపారు. దీపావళి కానుకగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని వసతిగృహాల్లో డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. డైట్ చార్జీల పెంపు విషయంలో కమిటీ ప్రతిపాదనను యథావిధిగా అమలు చేయడంపై ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీలతో 7,65,705 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

రూ.7 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డీఆర్ఐ అధికారుల నిఘా

చందానగర్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-శంషాబాద్/చందానగర్

దీపావళి పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ విక్రయించాలనే లక్ష్యంతో అక్రమ మార్గాల ద్వారా స్మగ్లర్లు పెద్ద ఎత్తున డ్రగ్స్ స్మగ్లింగ్‌కు పాల్పడ్డారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు చందానగర్ పరిధిలో డీఆర్ఐ అధికారులు, పోలీసులు రూ.7కోట్లకు పైగా విలువ చేసే డ్రగ్స్‌ను పట్టుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రగ్స్ తరలిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందుకున్న డీఆర్ఐ అధికారులు.. అక్టోబర్ 31న బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు వ్యక్తుల లగేజ్‌ని చెక్‌ఇన్‌లో భాగంగా తనిఖీ చేశారు. అందులో 13 వాక్యూమ్ ప్యాకెట్ల లోపల కెల్లోస్ చాక్లెట్లు కనిపించాయి. వాటిని ఆకుపచ్చని రంగులో ఉన్న ఫోమ్‌లో చుట్టి ఉంచారు. స్వాధీనం చేసుకున్న అధికారులు.. వాటిని పరీక్షించగా మరిజున అని తేలింది. స్వాధీనం చేసుకున్న 7.096 కిలోల హైడ్రోపోనిక్ వీడ్ విలువ.. రూ.7 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకున్న అధికారులు వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మధ్యప్రదేశ్ నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి రాజస్థాన్, హైదరాబాద్, విజయవాడలో అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని రంగారెడ్డి జిల్లా చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో అరెస్ట్ చేశారు. అతని నుంచి 150 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. గుల్మొహర్ పార్కు కాలనీ ఇంటి నెంబర్ 56లో ఎండీఎంఏ డ్రగ్స్ ఓ వ్యక్తి దగ్గర ఉన్నట్టు సమాచారం అందుకున్న చందానగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రఘు.. క్లూస్ టీమ్‌తో వెళ్లి దాడులు నిర్వహించి కృష్ణారాం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

వీసీలతో నేడు సీఎం సమావేశం

వర్సిటీల అభివృద్ధి, అధ్యాపకుల ఖాళీలు, నిధుల కేటాయింపుపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్వవిద్యాలయాల నూతన ఉపకులపతుల (వీసీ)తో శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో సమావేశం కానున్నారు. ఈనెల 18న నూతన వీసీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. సామాజిక తరగతులు, వారి ప్రతిభ ఆధారంగా వీసీలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. 107 ఏండ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) చరిత్రలో దళిత ప్రొఫెసర్ ఎం కుమార్‌కు వీసీ పదవిని ప్రభుత్వం కట్టబెట్టింది. కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి, పీయూ వీసీగా జీఎన్ శ్రీనివాస్, ఎస్‌యూ వీసీగా ఉమేష్‌కుమార్, పీఎస్‌టీయూ వీసీగా నిత్యానందరావు, ఎంజీయూ వీసీగా అల్తాఫ్ హుస్సేన్, టీయూ వీసీగా యాదగిరిరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీగా అల్దాస్ జానయ్య, ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా రాజిరెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అంతకుముందు మహిళా విశ్వవిద్యాలయం వీసీగా ధనావత్ సూర్య, ఆర్జీయూకేటీ బాసర ట్రిపుల్‌ఐటీ వీసీగా ఎ గోవర్ధన్‌ను ప్రభుత్వం నియమించింది. దీంతో రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలకు వీసీలను నియామకం పూర్తయ్యింది. ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్‌గా ఇటిక్యాల పురుషోత్తంను ప్రభుత్వం నియమించింది. తొలిసారిగా వారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సమావేశం కానున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, విశ్వవిద్యాలయాలు సాధించాల్సిన ప్రగతి, విద్యార్థులకు అందించాల్సిన మౌలిక వసతులు, అధ్యాపక పోస్టుల ఖాళీలు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై చర్చించే అవకాశమున్నది. నూతన వీసీల నుంచి ప్రభుత్వం ఎలాంటి ప్రగతిని ఆశిస్తున్నదో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేయనున్నట్టు తెలిసింది. వర్సిటీల్లో ఉన్న ఇబ్బందుల గురించి వీసీల నుంచి అడిగి తెలుసుకునే అవకాశమున్నది.

వారం, పది రోజుల్లో అంబేద్కర్ వీసీ నియామకం : బుర్రా వెంకటేశం

వారం, పది రోజుల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీసీ నియామకం ప్రక్రియ పూర్తవుతుందని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. శుక్రవారం రాజ్‌భవన్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం ఇప్పటికే జరిగిందని వివరించారు. జేఎన్ఏఎఫ్ఏయూ సెర్చ్ కమిటీ సమావేశం జరగాల్సి ఉందన్నారు. జేఎన్టీయూహెచ్ వీసీ నియామకంపై కొంత ఇబ్బంది వచ్చిందని చెప్పారు. సెర్చ్ కమిటీ నిర్వహించినా వీసీ పేరును గవర్నర్ ఆమోదించలేదనీ, ఆ సెర్చ్ కమిటీని రద్దు చేస్తారా?అన్న ప్రశ్నకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు లైంగిక వేధింపులు!

నవతెలంగాణ-కోదాడరూరల్

సీడీపీఓ కార్యాలయం సూపర్‌వైజర్ లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ప్రభుత్వాధి కారులే టార్గెట్‌గా చేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేస్తూ మహిళలను వేధిస్తున్నాడు. ఓ బాధిత సూపర్‌వైజర్ తెలిపిన వివరాల ప్రకారం.. తనకు ఓ వ్యక్తి ఇటీవల కాల్ చేసి "నేను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పీఏని.. మీ కార్యాలయానికి సంబంధించిన వివరాలు, సిబ్బంది వివరాలు కావాలని అడిగారు. అనుమానం వచ్చి అసలు మీరెవరు అని అడగ్గా.. మీ డీపీ ఫొటో ఎంతో అందంగా ఉంది. నాకు నచ్చారు.. ఎంత డబ్బైనా ఇస్తా లొంగిపోవాలి" అంటూ వేధిస్తూ మెసేజ్‌లు పెట్టాడు. ఆ మెసేజ్‌లు చూసి.. సంబంధిత నెంబర్‌కు కాల్ చేయగా 'నీవు అందంగా ఉన్నాయ్.. నాకు నచ్చావ్ అందుకే ఇటువంటి మెసేజ్‌లు పెడుతున్న.. ఇటీవలే నేను జైలుకు వెళ్లి వచ్చా. నువ్వు ఏమీ చేయలేవు' అని అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నాడు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి కోదాడ సీడీపీఓ కార్యాలయానికి మాత్రమే కాకుండా మెదక్, హుజూర్‌నగర్ ఐసీడీఎస్ పరిధిలోని మరికొంతమంది సూపర్‌వైజర్లకు కూడా ఫోన్లు చేసి లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు సమాచారం. ఈ విషయం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి "నేను మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పర్సనల్ పీఏనంటూ పరిచయం చేసుకుంటున్నాడు. వారి వివరాలు అడిగి తెలుసుకుంటాడు. మీ సమస్యలు చెప్పాలని" అలా మాటలు కలుపుకొని ఇబ్బంది పెడుతున్నాడని పలువురు ఆవేదన చెందుతున్నారు. అతనికి సూపర్‌వైజర్ల నెంబర్లు, బయోడేటాలు ఎలా తెలుస్తున్నాయి? ఎవరు ఇస్తున్నారనేది చర్చనీయాంశం గా మారింది. అసలు సీడీపీఓ కార్యాలయంలో ఏం జరుగుతోందని పలువురు చర్చించుకుంటు న్నారు. ప్రభుత్వ అధికారులకే ఈ విధమైన పరిస్థితి వస్తే సామాన్య మహిళల పరిస్థితి ఏంటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎక్సైజ్ పీఎస్‌లో రాజ్ పాకాల

విచారణకు హాజరైన కేటీఆర్ బావమరిది

నవతెలంగాణ-చేవెళ్ల

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో పోలీసు అధికారులు శుక్రవారం విచారించారు. జన్వాడలోని ఫామ్‌హౌస్‌లో గత శనివారం రాజ్‌పాకాల కుటుంబ సభ్యులు దావత్ చేసుకున్న నేపథ్యంలో విదేశీ మద్యం పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో రాజ్ పాకాల శుక్రవారం తన న్యాయవాదితో కలిసి చేవెళ్ల ఎక్సైజ్ ఆఫీస్‌కు వచ్చి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఫామ్‌హౌస్‌లో పట్టుబడిన అనుమతి లేని విదేశీ మద్యం, ఎన్డీపీ మద్యం విషయమై ఆయన్ను పోలీసులు విచారించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ ఎస్. జీవన్ కుమార్, ఎక్సైజ్ సీఐ శ్రీలత ఆధ్వర్యంలో విచారించారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు ఇప్పటికే ఆధారాలు సేకరించారు. పార్టీలో డ్రగ్స్ వాడకంపై కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో మోకిలా పోలీసులు సైతం రాజ్ పాకాలను విచారించారు. అతనిపై ప్రశ్నల వర్షం కురిపించారు. అతని నుంచి పార్టీకి సంబంధించిన అనేక విషయాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు.

రాష్ట్రంలో రూ.5,211 కోట్ల జీఎస్టీ వసూలు

(మొదటిపేజీ తరువాయి)



వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.5,211 కోట్లు వసూలైందని, పెరుగుదల 7 శాతం నమోదైందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది అక్టోబర్ రూ.3,493 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది అక్టోబర్‌లో రూ.3,815 కోట్లు పెరిగిందని, పెరుగుదల 12 శాతం నమోదైందని తెలిపింది.

తెలంగాణకు రూ.25,306 కోట్లు.. ఏపీకి రూ.19,171 కోట్లు

ఈ ఏడాది అక్టోబర్ వరకు ఎస్‌జీఎస్‌టీ నిధులు తెలంగాణకు రూ.25,306 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,171 కోట్లు ఇచ్చినట్టు తెలిపింది. తెలంగాణకు గతేడాది అక్టోబర్ వరకు రూ.23,478 కోట్లు ఇవ్వగా, ఈ ఏడాది 8 శాతం నిధులు పెరిగాయి. ఏపీకి గతేడాది అక్టోబర్ వరకు రూ.18,488 కోట్లు ఎస్‌జీఎస్‌టీ నిధులు ఇవ్వగా, ఈ ఏడాది నాలుగు శాతం నిధులు పెరిగాయి.

రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ నో అపాయింట్‌మెంట్

2025 జూన్-డిసెంబర్ మధ్యలో సీఎం మార్పు : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి ఏడుసార్లు వెళ్లినా దొరకలేదనీ, ఆయన హనీమూన్ హాలిడే పీరియడ్ ముగిసిందని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. 2025 జూన్-డిసెంబర్ మధ్యలో సీఎం మార్పు ఉంటుందనీ, రేసులో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నారని బాంబు పేల్చారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కూడా సీఎం అయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. ఇప్పుడే తొలగిస్తే ఇబ్బందులొస్తాయనే దానితో హైకమాండ్ కూడా ఓటుకు నోటు కేసు కోసం ఎదురు చూస్తున్నట్టు కనిపిస్తోందన్నారు. పక్కా ఆధారాలతోనే ఈవిషయం చెబుతున్నానని తెలిపారు. శుక్ర వారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మహేశ్వర్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ నిర్వహించారు. కొత్త సీఎం ఎంపిక కోసం కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తున్నదని తెలిపారు. ఢిల్లీలోనే కాదు..ప్రియాంక గాంధీ నామినేషన్ సందర్భంగా కేరళలోనూ రేవంత్‌రెడ్డితో రాహుల్‌గాంధీ మాట్లాడలేదని చెప్పారు. లక్షన్నర కోట్ల రూపాయలతో చేపట్టనున్న మూసీ సుందరీకరణలో పెద్ద ఎత్తున అవినీతి జరగబోతున్నదనీ, తన వ్యక్తిగత ఎజెండా కోసం రేవంత్‌రెడ్డి పార్టీని వాడుకుంటున్నాడనే విషయాన్ని కాంగ్రెస్ అధిష్టానం గ్రహించిందని తెలిపారు. అందుకే ఆయన్ను అధిష్టానం దూరం పెడుతున్నదని నొక్కిచెప్పారు. మొదటి నుంచీ పార్టీలోనే ఉన్న నేతలు సీఎంను వ్యతిరేకిస్తున్నారనీ, మంత్రులు రెండుగా చీలిపోయి కొందరు సీఎం నిర్ణయాలను తప్పుబడుతున్నారని వివరించారు. కొందరు మంత్రులు ఢిల్లీకెళ్లి సీఎంను తప్పించేందుకు అధిష్టానాన్ని కూడా ఒప్పించారని బాంబు పేల్చారు. హైడ్రా, మూసీ, ల్యాండ్ సెటిల్‌మెంట్లపై పూర్తి ఆధారాలను హైకమాండ్‌కు మంత్రులు పంపారని చెప్పారు. ఒక సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజులు కలిసి మూసీ అంశంపైనా, తెలంగాణలో జరుగుతున్న పరిణామాలపైనా సోనియాగాంధీకి నేరుగా వివరించి రేవంత్‌పై ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆమె స్వయంగా కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో రేవంత్‌రెడ్డికి ఫోన్ చేయిస్తే లిఫ్ట్ చేయలేదనీ, దీన్ని చిట్‌చాట్‌లో సీఎం స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు. దీంతో ఆ పార్టీ అధిష్టానం ఆయనపై మరింత ఆగ్రహానికి గురవుతున్నదని తెలిపారు. రేవంత్ వ్యక్తిగత లాభం కోసం పార్టీని ఇరికిస్తున్నాడని పార్టీ భావిస్తున్నదన్నారు. కేవీపీ రామచంద్రరావు ఇల్లు కూల్చివేత అంశంపై రేవంత్ చిన్న పిల్లాడిలా మాట్లాడారని విమర్శించారు. దీన్ని అధిష్టానం సీరియస్‌గా తీసుకున్నదని చెప్పారు. అందుకే ప్రత్యామ్నాయంగా ఎవరిని సీఎం చేస్తే బాగుంటుందనే విషయంపై ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగిందన్నారు. ఖాళీగా ఉన్న మంత్రి పదవుల కోసం రేవంత్, ఆయన వ్యతిరేక గ్రూపు మధ్య పోరు తీవ్రస్థాయిలో నడుస్తున్నదనీ, అందుకే అధిష్టానం దాన్ని పక్కనబెట్టేసిందని తెలిపారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవద్దనే విధానాన్ని పక్కనబెట్టాలనీ, అవకాశమిస్తే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేస్తానని అధిష్టానానికి మాట ఇచ్చి వచ్చారని వివరించారు. తీరా చూస్తే 11 మంది ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లోకి రాలేదనీ, వచ్చినవాళ్లలో ఐదుగురు తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లబోతున్నారని చెప్పారు. ఈ విషయం కూడా ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందని తెలిపారు.

మతిలేని మాటలు

టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం, మంత్రులు ఐక్యతలేదంటూ బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి మతిలేని మాటలు మాట్లాడుతున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ విమర్శించారు. లీడర్ కావడం కోసం పిచ్చి ప్రకటనలు చేస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. మూసీ ప్రక్షాళనపై అనేక సార్లు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. సీఎం, మంత్రుల గురించి ఆయన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. ఏలేటికి బీజేపీలో తగిన ప్రాధాన్యత లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై హద్దులు దాటి విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు.

నవచిత్రం



వెంకీ అట్లూరి, సూర్యదేవర నాగవంశీ


ఈ స్థాయి స్పందన ఊహించలేదు

దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. దీపావళి కానుకగా విడుదలైన ఈ చిత్రానికి విశేష ప్రేక్షకాదరణ లభిస్తోంది. షో, షోకి వసూళ్ళు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకుడు వెంకీ అట్లూరి తమ సంతోషాన్ని మీడియాతో షేర్ చేసుకున్నారు.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "సోషల్ మీడియాలో ఎక్కడా సినిమా గురించి ఒక్క నెగటివ్ కామెంట్ కూడా కనిపించలేదు. అంతలా సినిమాకి పాజిటివ్ టాక్ వచ్చింది. మా సినిమా పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమకు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలుగుతోంది. బాలకృష్ణ 109వ సినిమా టీజర్, విడుదల తేదీకి సంబంధించిన అప్డేట్‌ను వారం రోజుల్లో ఇస్తాం. రాబోయే రోజుల్లో ఒక భారీ రాజకీయ నేపథ్యం ఉన్న సినిమా చేసే ఆలోచన ఉంది. అలాగే మా బ్యానర్‌లో భిన్న సినిమాల నిర్మాణమే లక్ష్యంగా పని చేస్తున్నాం' అని తెలిపారు.

'నిర్మాత నాగవంశీ ఈ సినిమా మీద ఎంతో నమ్మకంగా ఉన్నారు. సినిమా విడుదలకు ముందే ఈ సినిమాకి ఎక్కడైనా నెగటివ్ కామెంట్ వస్తే అడగండని చెప్పారు. అయితే ఈస్థాయి స్పందన లభిస్తుందని నేను కూడా ఊహించలేదు. ప్రీమియర్ షోల నుంచే సినిమాకి ఎంతో మంచి టాక్ వచ్చింది. దర్శకుడిగా ఇంత మంచి పేరు రావడమనేది చాలా అరుదైన విషయం. ఈ సినిమా పట్ల మీడియా మద్దతుకి, ప్రేక్షకుల ఆదరణకి చాలా చాలా థ్యాంక్స్. పండగ అయినా కూడా మొదటిరోజు మంచి వసూళ్ల రావడం సంతోషంగా ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు అన్ని చోట్ల మంచి స్పందన లభిస్తుంది. మలయాళ ప్రేక్షకులు దీనిని డబ్బింగ్ సినిమాలా చూడటంలేదు. సొంత సినిమాగానే భావిస్తున్నారు' అని దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పారు.

దేశం కోసం.. ధర్మం కోసం




రాకేష్ వర్రే

రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. 'ఉయ్యాలా జంపాల, మజ్ను' సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈనెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్ అందరినీ ఆకట్టుకుంటూ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడేలా చేసింది.

ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునే అంశాలతో ఉండగా, ప్రధాన పాత్ర పోషించిన రాకేష్ నటన హైలైట్‌గా నిలిచింది. నిజ జీవిత ఘటనలు ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో అన్ని సన్నివేశాలను చక్కగా చిత్రీకరించారు. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ దేశం కోసం, ధర్మం కోసం నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ఈ సినిమాలో చూపించారు.

అంతే కాకుండా ఆ తర్వాత అతను రాజకీయాల్లోకి రావడం, అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న సీనియర్‌తో మాట్లాడటం ట్రైలర్‌లో చూపించారు. యాక్షన్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో డైలాగ్స్ ప్రధాన ఆకర్షణగా ఉన్నాయి. చక్కని కెమెరా వర్క్‌కి నేపథ్య సంగీతం కూడా తోడవడం కలిసొచ్చే అంశం. టెక్నికల్‌గా ఈ సినిమా అన్ని విభాగాల్లో టాప్‌గా నిలిచింది. రాకేష్ ఇప్పటి వరకు పోషించిన అన్ని పాత్రల్లోకి ఇది చాలా డిఫరెంట్ అని తెలుస్తుంది. 1980 కాలంలో జగిత్యాల చుట్టు పక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా ఇది అని చిత్ర బృందం తెలిపింది. ముదుగంటి క్రియేషన్స్ పై ముదుగంటి రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.



రామ్ చరణ్

అంచనాలు మించేలా..

రామ్ చరణ్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్ బ్యానర్స్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమాలో కియారా అద్వాని హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నారు.

డిఫరెంట్ ప్రమోషనల్ ప్లానింగ్‌తో మేకర్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచుతున్నారు. ఈ అంచనాలను మరింత రెట్టింపు చేసేలా ఈనెల 9న టీజర్‌ను విడుదల చేస్తున్నారు. దీంతో మెగాభిమానులు, సినీ ప్రేక్షకుల్లో ఎగ్జైట్‌మెంట్ మరింత పెరిగింది. టీజర్ రిలీజ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ గమనిస్తే రైల్వే ట్రాక్‌పై రామ్‌చరణ్ కూలింగ్ గ్లాస్ పెట్టుకుని లుంగీ, బనియన్‌తో పక్కా మాస్ లుక్‌లో అందర్నీ అలరిస్తున్నారు.

ఈ లుక్ ఉన్న పోస్టర్‌ను మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, ఈ సినిమాలో ట్రైన్ ఫైట్ ఉండబోతుందని, ఆ ఫైట్ అందరి అంచనాలను మించేలా ఉంటుందని చెప్పటంతో అంచనాలు నెక్ట్స్ లెవల్‌కు చేరుకున్నాయి.

ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్స్, 'జరగండి జరగండి..', 'రా మచ్చా మచ్చా' సాంగ్స్‌కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చాయి. డైరెక్టర్ శంకర్ లార్జర్ దేన్ లైఫ్ సినిమాలను తెరకెక్కించటమే కాకుండా, అభిమానులకు, ప్రేక్షకులకు డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుంటారు. రామ్ చరణ్‌లాంటి మాస్ హీరో ఉన్నప్పుడు ఆ సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఎలా ఉంటుందో చూడాలని మెగాభిమానులు, మూవీ లవర్స్ ఈ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన తెరకెక్కించిన సినిమాలను మించేలా దీన్ని ఆయన రూపొందిస్తున్నారు. పవర్‌ఫుల్ రోల్‌లో చరణ్‌ను ప్రెజెంట్ చేస్తున్నారు శంకర్. రామ్ చరణ్ కెరీర్‌లోనే హయ్యెస్ట్‌గా ఈ సినిమా నార్త్ ఇండియా డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ను 'ఎ' ఫిల్మ్స్ ఫ్యాన్సీ రేటుకి సొంతం చేసుకుంది. ఈ భారీ చిత్రానికి తమన్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. ప్రముఖ ఆడియో కంపెనీ సారేగమ ఈ సినిమా ఆడియో రైట్స్‌ను ఫ్యాన్సీ ప్రైజ్‌కి దక్కించుకుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్ చంద్ర తదితరులు నటిస్తున్నారు.

ప్రేక్షకుల ప్రశంసలు ఆనందాన్నిస్తున్నాయి



సుజీత్, సందీప్

'క' సినిమాకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. ఈ ఫీలింగ్‌ని మాటల్లో చెప్పలేకపోతున్నాం' అని అంటున్నారు దర్శక ద్వయం సుజీత్, సందీప్.

హీరో కిరణ్ అబ్బవరం నటించిన భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా 'క'. రీసెంట్‌గా థియేటర్స్‌లోకి వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద దీపావళి విజేతగా నిలిచింది. థ్రిల్లర్ సినిమాల్లో ఓ సరికొత్త ప్రయత్నంగా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.

ఈ సినిమా సక్సెస్ పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ దర్శక ద్వయం సుజీత్, సందీప్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.


ఈ దీపావళిని ఎంతో స్పెషల్ చేశారు : సుజీత్

'పరిశ్రమలో విజయం సాధిస్తేనే మనుగడ అనుకున్నాం. అందుకే పట్టుదలగా సినిమా చేశాం. థియేటర్స్‌లో ప్రేక్షకులు సినిమా చూస్తూ చివరలో స్టాండింగ్ ఓవేషన్ ఇస్తున్నారు. మేము ఈ కథ అనుకున్నప్పుడు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో అని భయపడ్డాం. కానీ ఈరోజు ప్రేక్షకులు కథకు చాలా కనెక్ట్ అవుతున్నారు. ప్రేక్షకులు మేము ఆశించిన ఫలితాన్ని ఇచ్చారు. ఈ దీపావళిని ఎంతో స్పెషల్ చేశారు. మా కుటుంబ సభ్యుల సంతోషానికి హద్దు లేదు. హీరో కిరణ్ మమ్మల్ని సోదరుల్లా చూశారు. ఇకపై మేం చేసే సినిమాలను స్ట్రాంగ్ కంటెంట్‌తో, యూనిక్ స్టోరీస్‌తో, ఇంటర్నేషనల్ రేంజ్ ఐడియాస్‌తో చేస్తాం. ఈ సినిమాకు ప్రీక్వెల్ చేసే ఆలోచన ఉంది. కృష్ణగిరి ఊరు నేపథ్యం ఏంటి?, ఆ ఊరిలోని ప్రత్యేకతలకు కారణాలు ఏంటి అనే అంశాలు ప్రీక్వెల్‌లో చూస్తారు'.

'క'కి ప్రీక్వెల్ చేస్తాం : సందీప్

'మా సినిమాకు ప్రేక్షకులు ఇచ్చిన విజయం ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. సోషల్ మీడియాలో ఎక్కడైనా మా సినిమా గురించి నెగిటివ్‌గా వస్తే ప్రేక్షకులే వాటికి సమాధానాలు ఇస్తున్నారు. ఒకప్పుడు థియేటర్స్ దగ్గర హౌస్ ఫుల్ బోర్డ్స్ చూశాం. ఇప్పుడు మా సినిమాకు అలా హౌస్‌ఫుల్స్ కావడం గ్రేట్ ఫీల్ ఇస్తోంది. ఏపీ, తెలంగాణ అంతటా థియేటర్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. హీరో కిరణ్ వల్లే ఇంత ఘన విజయం మాకు సాధ్యమైంది. డిస్ట్రిబ్యూటర్ వంశీ నందిపాటి మా ప్రాజెక్ట్‌లోకి వచ్చినప్పుడే మాకు ఎంతో నమ్మకం కలిగింది. మన సినిమా సేఫ్ హ్యాండ్స్‌లోకి వెళ్లిందని అనుకున్నాం. బడ్జెట్ కాదు సబ్జెక్ట్ బాగుంటే ఇంటర్నేషనల్ లెవెల్‌కు సినిమాలు తీసుకెళ్లవచ్చని డైరెక్టర్ రాజమౌళి చెప్పినట్లు మా రాబోయే సినిమాలను సరికొత్తగా రూపొందించే ప్రయత్నం చేస్తాం'.

సమ్మర్ స్పెషల్‌గా రిలీజ్



మోహన్‌లాల్

2019లో 'లూసిఫర్' విడుదలై బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఎల్2 ఎంపురాన్' తెరకెక్కుతోంది. లైకా ప్రొడక్షన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది.

మోహన్‌లాల్ హీరోగా రాబోతోన్న ఈ చిత్రంలో సౌత్ స్టార్‌లు నటిస్తున్నారు. తొలి భాగం హిట్ కావటంతో సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో ముందుగానే అంచనా వేసిన మేకర్స్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా సినిమాను నిర్మిస్తున్నారు.

మోహన్ లాల్, యాక్టర్, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న మూడో చిత్రం కావటంతో అభిమానుల్లోనూ అంచనాలు ఆకాశన్నంటాయి.

ఇటీవల మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా ఖురేషి అబ్రమ్‌గా విడుదల చేసిన లుక్, అలాగే పృథ్వీరాజ్ సుకుమార్ పోషిస్తోన్న క్యారెక్టర్ జయేద్ మసూద్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేయగా అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఇంకా ఈ చిత్రంలో టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ తదితరులు మరోసారి వారి పాత్రలతో మెప్పించబోతున్నారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్‌ను తెలియజేస్తూ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.

ఈ చిత్రానికి నిర్మాతలు: సుభాస్కరన్, ఆంటోని పెరుంబవూర్, రచన: మురళీ గోపి, సినిమాటోగ్రఫీ: సుజిత్ వాసుదేవ్, మ్యూజిక్: దీపిక్ దేవ్, ప్రాజెక్ట్ డిజైన్: పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్, ప్రొడక్షన్ కంట్రోలర్: సిదు పనకల్, ఆర్ట్: మోహన్ దాస్, ఎడిటర్ : అఖిలేష్ మోహన్.

వాంఖడెలో తొలి రోజు నుంచే స్పిన్ మాయ మొదలైంది. ఇటు రవీంద్ర జడేజా (5/65), వాషింగ్టన్ సుందర్ (4/81).. అటు అజాజ్ పటేల్ (2/33) మ్యాజిక్‌తో మెరవటంతో మూడో టెస్టు తొలి రోజు ఆటలోనే ఏకంగా 14 వికెట్లు కుప్పకూలాయి. న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకు కుప్పకూలగా.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 86/4తో పోరాడుతోంది.



స్పిన్ మాయ

తొలి రోజు ఆటలో 14 వికెట్లు

రవీంద్ర జడేజా ఐదు వికెట్ల మాయ
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 235/10
భారత్ తొలి ఇన్నింగ్స్ 86/4

నవతెలంగాణ-ముంబయి

స్పిన్ మాయకు బ్యాటర్లు విలవిల్లాడారు. వాంఖడె ఎర్రమట్టి పిచ్‌పై తొలి రోజు ఆటలోనే స్పిన్నర్లు వికెట్ల జాతర సాగించారు. భారత స్పిన్ ద్వయం రవీంద్ర జడేజా (5/65), వాషింగ్టన్ సుందర్ (4/81) మాయ చేయగా న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకే చేతులెత్తేసింది. డార్లీ మిచెల్ (82, 129 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సులు), విల్ యంగ్ (71, 138 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (30, 52 బంతుల్లో 4 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (31 నాటౌట్, 38 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లలో 86/4తో కొనసాగుతుంది. విరాట్ కోహ్లి (4), మహ్మద్ సిరాజ్ (0), రోహిత్ శర్మ (18) నిరాశపరిచారు. న్యూజిలాండ్ స్పిన్నర్ అజాజ్ పటేల్ (2/33) రెండు వికెట్లతో మెరిశాడు. తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో మరో 149 పరుగుల వెనుకంజలో నిలిచింది.

మిచెల్, యంగ్ జోరు

టాస్ నెగ్గిన న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆ జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. డెవాన్ కాన్వే (4) ఆరంభంలోనే నిష్క్రమించాడు. విల్ యంగ్ (71), టామ్ లేథమ్ (28) రెండో వికెట్‌కు మంచి భాగస్వామ్యం నమోదు చేశారు. రచిన్ రవీంద్ర (5)ను సుందర్ అవుట్ చేసినా.. విల్ యంగ్, డార్లీ మిచెల్ (82) జోడీ భారత బౌలర్లను విసిగించింది. అర్థ సెంచరీలు బాదిన యంగ్, మిచెల్ న్యూజిలాండ్‌ను భారీ స్కోరు దిశగా నడిపించారు. కానీ రెండు సార్లు ఒకే ఓవర్లో రెండేసి వికెట్లు పడగొట్టిన రవీంద్ర జడేజా.. కివీస్ ఇన్నింగ్స్‌ను శాసించాడు. ఈ ఇద్దరు మినహా కివీస్ నుంచి ఎవరూ భారత బౌలర్లను ఎదుర్కోలేకపోయారు. 65.4 ఓవర్లలో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయ్యింది.

ఆ ఇద్దరు మెరిసినా

తొలి రోజు 19 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసిన భారత్ ఆఖర్లో ఇక్కట్లో పడింది. రోహిత్ శర్మ (18, 18 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడుతూ వికెట్ కోల్పోయినా.. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (30), శుభ్‌మన్ గిల్ (31 నాటౌట్) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నిర్మించారు. మరో రెండు ఓవర్లలో తొలి రోజు ఆట ముగియనుండగా.. భారత్ ఏకంగా మూడు వికెట్లు చేజార్చుకుంది. యశస్వి జైస్వాల్‌ను అజాజ్ పటేల్ అవుట్ చేయగా.. అదే ఓవర్లో నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన మహ్మద్ సిరాజ్ (0) సైతం నిష్క్రమించాడు. విరాట్ కోహ్లి (4) లేని పరుగు కోసం ప్రయత్నించి చేజేతులా రనౌట్ అయ్యాడు. 78/1తో మెరుగ్గా కనిపించిన టీమ్ ఇండియా.. 84/4తో ఒత్తిడిలో పడింది. గిల్‌కు తోడుగా రిషబ్ పంత్ (1 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచాడు. న్యూజిలాండ్ బౌలర్లలో అజాజ్ పటేల్ (2/33) రెండు వికెట్లు ఖాతాలో వేసుకోగా.. మాట్ హెన్రీ (1/15) ఓ వికెట్ పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 149 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: టామ్ లేథమ్ (బి) వాషింగ్టన్ సుందర్ 28, డెవాన్ కాన్వే (ఎల్బీ) ఆకాశ్ దీప్ 4, విల్ యంగ్ (సి) రోహిత్ (బి) జడేజా 71, రచిన్ రవీంద్ర (బి) వాషింగ్టన్ సుందర్ 5, డార్లీ మిచెల్ (సి) రోహిత్ (బి) వాషింగ్టన్ 82, టామ్ బ్లండెల్ (బి) జడేజా 0, గ్లెన్ ఫిలిప్స్ (బి) జడేజా 17, ఇశ్ సోధి (ఎల్బీ) జడేజా 7, మాట్ హెన్రీ (బి) జడేజా 0, అజాజ్ పటేల్ (ఎల్బీ) వాషింగ్టన్ 7, విలియం ఓరౌర్క్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 13, మొత్తం : (65.4 ఓవర్లలో ఆలౌట్) 235.

వికెట్ల పతనం : 1-15, 2-59, 3-72, 4-159, 5-159, 6-187, 7-210, 8-210, 9-228, 10-235.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 6-0-16-0, ఆకాశ్ దీప్ 5-0-22-1, రవి చంద్రన్ అశ్విన్ 14-0-47-0, వాషింగ్టన్ సుందర్ 18.4-2-81-4, రవీంద్ర జడేజా 22-1-65-5.

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (బి) అజాజ్ 30, రోహిత్ శర్మ (సి) లేథమ్ (బి) హెన్రీ 18, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 31, మహ్మద్ సిరాజ్ (ఎల్బీ) అజాజ్ 0, విరాట్ కోహ్లి (రనౌట్) 4, రిషబ్ పంత్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 2, మొత్తం : (19 ఓవర్లలో 4 వికెట్లకు) 86.

వికెట్ల పతనం :1-25, 2-78, 3-78, 4-84

బౌలింగ్ : మాట్ హెన్రీ 5-1-15-1, విలియం ఓరౌర్క్ 2-1-5-0, అజాజ్ పటేల్ 7-1-33-2, గ్లెన ఫిలిప్స్ 4-0-25-0, రచిన్ రవీంద్ర 1-0-8-0.

ఆటలు

క్లాసెన్‌కు రూ.23 కోట్లు

సన్‌రైజర్స్ విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఐపీఎల్ రిటెన్షన్‌లో చరిత్ర సృష్టించాడు. భారత క్రికెటర్లకు సైతం అందని రీతిలో అత్యధిక ధర దక్కించుకున్నాడు. రూ.5.5 కోట్లకు సన్‌రైజర్స్ గూటికి చేరిన క్లాసెన్ తాజాగా రిటెన్షన్‌లో ఏకంగా రూ.23 కోట్ల ధర సాధించాడు. విరాట్ కోహ్లిని రూ.21 కోట్ల ధరకు బెంగళూర్ నిలుపుకుంది.

వేలంలోకి పంత్, రాహుల్, అయ్యర్
ఐపీఎల్ రిటెన్షన్ ఆటగాళ్ల జాబితా

నవతెలంగాణ-ముంబయి

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ ఆటగాళ్ల వేలానికి ముందు.. పది ప్రాంఛైజీలు అట్టిపెట్టుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌లు కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకోగా.. ఇతర ప్రాంఛైజీలు ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకున్నాయి. రిటెన్షన్ జాబితా సమర్పించేందుకు గడువు అక్టోబర్ 31న ముగిసింది. అట్టిపెట్టుకున్న ఆటగాళ్లు, దక్కించుకున్న ధర వివరాలను బీసీసీఐ శుక్రవారం విడుదల చేసింది. సఫారీ స్టార్ హెన్రిచ్ క్లాసెన్ రూ.23 కోట్లతో రిటెన్షన్ ధరలో రికార్డు నెలకొల్పగా.. విరాట్ కోహ్లి రూ.21 కోట్లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. ముంబయి ఇండియన్స్‌లో జశ్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్య, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య వంటి మేటి ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఎవరికీ రూ.20 కోట్ల మార్క్ దక్కలేదు. ఎం.ఎస్ ధోని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా రూ. 4కోట్లకు చెన్నై సూపర్‌కింగ్స్ జాబితాలో నిలిచాడు. రిషబ్ పంత్, కెఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్‌లు ఈ ఏడాది వేలంలోకి రానున్నారు. ఐపీఎల్‌లో నిలకడగా రాణించిన తెలుగు తేజాలు తిలక్ వర్మ, నితీశ్ కుమార్‌లు రిటెన్షన్ జాబితాలో నిలువటం విశేషం. తిలక్ వర్మను రూ.8 కోట్లకు ముంబయి ఇండియన్స్ నిలుపుకోగా.. నితీశ్ కుమార్ రెడ్డిని రూ.6 కోట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అట్టిపెట్టుకుంది. కెఎల్ రాహుల్‌ను వదులుకున్న లక్నో సూపర్‌జెయింట్స్ విండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ నికోలస్ పూరన్ కోసం రూ.21 కోట్లు వెచ్చించటం గమనార్హం.





ప్రాంఛైజీలు అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల వివరాలు..

చెన్నై సూపర్‌కింగ్స్ రుతురాజ్ గైక్వాడ్ (18), మతీశ పతిరణ (13), శివం దూబె (12), రవీంద్ర జడేజా (18), ఎం.ఎస్ ధోని (4)లను నిలుపుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌ను వేలంలోకి వదిలేసింది. అక్షర్ పటేల్ (16.50), కుల్దీప్ యాదవ్ (13.25), ట్రిస్టన్ స్టబ్స్ (10), అభిషేక్ పోరెల్ (4) నిలిచారు. గుజరాత్ టైటాన్స్‌లో రషీద్ ఖాన్ (18), శుభ్‌మన్ గిల్ (16.50), సాయి సుదర్శన్ (8.50), రాహుల్ తెవాటియ (4), షారుక్ ఖాన్ (4) రిటెన్షన్ లిస్ట్‌లో ఉన్నారు. కోల్‌కత నైట్‌రైడర్స్ సైతం ట్రోఫీ విన్నింగ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను వదులుకుంది. రింకూ సింగ్ (13), వరుణ్ చక్రవర్తి (12), సునీల్ నరైన్ (12), ఆండ్రీ రసెల్ (12), హర్షిత్ రానా (4), రమణ్‌దీప్ సింగ్ (4) కోల్‌కత జాబితాలో ఉన్నారు. లక్నో సూపర్‌జెయింట్స్ కెప్టెన్ కెఎల్ రాహుల్ వేలంలోకి రానున్నాడు. నికోలస్ పూరన్ (21), రవి బిష్ణోయ్ (11), మయాంక్ యాదవ్ (11), మోషిన్ ఖాన్ (4), ఆయూశ్ బదాని (4) లక్నోలో నిలిచారు. జశ్‌ప్రీత్ బుమ్రా (18), సూర్యకుమార్ యాదవ్ (16.35), హార్దిక్ పాండ్య (16.35), రోహిత్ శర్మ (16.30), తిలక్ వర్మ (8)లను ముంబయి ఇండియన్స్ అట్టిపెట్టుకుంది. పంజాబ్ కింగ్స్ స్వదేశీ ఆటగాళ్లు శశాంక్ సింగ్ (5.50), ప్రభుసిమ్రన్ సింగ్ (4)లను నిలుపుకుంది. రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజు శాంసన్ (18), యశస్వి జైస్వాల్ (18), రియాన్ పరాగ్ (14), ధ్రువ్ జురెల్ (14), షిమ్రోన్ హెట్‌మయర్ (11), సందీప్ శర్మ (4) నిలిచారు. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జాబితాలో విరాట్ కోహ్లి (21), రజత్ పటీదార్ (11), యశ్ దయాల్ (5) మాత్రమే నిలిచారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ కీలక ఐదుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. రూ.75 కోట్లు వెచ్చించి.. హెన్రిచ్ క్లాసెన్ (23), పాట్ కమిన్స్ (18), అభిషేక్ శర్మ (14), ట్రావిశ్ హెడ్ (14), నితీశ్ కుమార్ రెడ్డి (6)లను సన్‌రైజర్స్ నిలుపుకుంది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

యుద్ధం కాదు.. ఆరు గ్యారంటీల అమలేది?

- మూసీ పునరుజ్జీవం కమీషన్ల కోసమేనని మండిపాటు
- కేంద్ర ప్రభుత్వ అవాస్ యోజనతోనే ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం : కేంద్ర మంత్రి, బీజేపీ నాయకులు ఎంపీ బండి సంజయ్



నవతెలంగాణ-బెజ్జంకి

సమగ్ర ఇంటింటి సర్వే అనంతరం కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం విడ్డూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేయాల్సింది యుద్ధం కాదని.. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను యుద్ధప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన సంఘ ఎల్లవ్వ అనారోగ్యంతో బాధపడుతుండటంతో బండి సంజయ్.. బాధితురాలి కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల, మత, వర్గ భేదం లేకుండా దేశ ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పనిచేస్తున్నందుకు యుద్ధం చేస్తారా.. లేకా నరేంద్ర మోడీని ప్రధానిగా తొలగించి రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడానికి యుద్ధం చేస్తారా అని ప్రశ్నించారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. మూసీ పునరుజ్జీవం కమీషన్ల కోసమేనని.. మూసీకి కేటాయించిన రూ.1.50 లక్షల కోట్లతో ప్రజా సమస్యలన్నీ పరిష్కారించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అవాస్ యోజనతో ఇందిరమ్మ ఇండ్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేటీఆర్.. పాదయాత్ర కాదు మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వరదలు వచ్చినప్పుడు, ఉద్యోగుల, హైడ్రా, మూసీ సమస్యల పరిష్కారానికి బయటకు రారని.. కుటుంబ సభ్యులకు సమస్యలు వస్తేనే బయటకు వస్తారని అన్నారు. నాయకుడులేని నావలా బీఆర్ఎస్ తయారైందని అసహనం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొడుకు కేటీఆర్‌ను అహంకారంతోనే ప్రజలు చీదరించుకుంటున్నారన్నారు. ఇప్పటికైన బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారానికి, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యమవ్వాలని సూచించారు.

ఏపీలో దళిత యువకులపై దాడి

- పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా

కడియం : అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటలో ముగ్గురు దళిత యువకులపై పెత్తందారులు దాడికి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు.. మండపేట పట్టణంలో రెల్లి సామాజిక తరగతికి చెందిన బొత్స మోహన్ కిరణ్ తన కుటుంబం సభ్యులతో కలిసి పట్టణంలోని ఒక సినిమా థియేటర్‌కు వెళ్ళారు.

ఈ క్రమంలో స్టాండ్‌లో ఉన్న ఒక బైక్ కిందపడిపోయింది. కొద్దిసేపటి తర్వాత మోటార్ సైకిల్ యజమాని, అతని స్నేహితులు వచ్చి బైక్‌ను కిందపడేసిన వారి కోసం థియేటర్ లోపలికి వెళ్లారు. దీంతో కిరణ్ బయటకు వచ్చి మోటార్ సైకిల్ బాగు చేయించి ఇస్తానని చెప్పినా గొడవకు దిగారు. కిరణ్ స్నేహితులైన కొల్లి చంటి, పాలపర్తి చంద్రశేఖర్‌పైనా దాడికి తెగబడ్డారు. ప్రాణభయంతో కిరణ్ అక్కడి నుండి పారిపోయారు. కిరణ్ స్నేహితులను మోటార్ సైకిల్ యజమాని తమ గ్రామమైన మండపేట మండలం ఏడిదకు తీసుకువెళ్లారు. అక్కడ వారిని చేతులు కట్టేసి కులం పేరుతో దూషిస్తూ దాడికి దిగారు. సుమారు 40 మంది దాడికి పాల్పడ్డారని బాధితులు చెబుతున్నారు.ఈ విషయం తెలియడంతో పరిసర ప్రాంతాలకు చెందిన దళితులు పెద్ద ఎత్తున పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎనిమిది మందిపై అట్రాసిటీ కేసు

ఈ ఘటనలో ఏడిద గ్రామానికి చెందిన ఎనిమిది మందిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు తెలిపారు. ఈ కేసులో మరికొందరు నిందితులుగా ఉన్నారని, వారందరినీ గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ తెలిపారు.

డెంగ్యూతో బాలుడు మృతి

- నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో ఘటన

నవతెలంగాణ - ఉప్పునుంతల

నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని మర్రిపల్లిలో శుక్రవారం బాలుడు డెంగ్యూతో మృతిచెందాడు. బాలుడు శివవర్ధన్ డెంగ్యూ జ్వరంతో బాధపడ్డాడు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు, అధికారులు సూచించారు.

రైతులు కన్నీరు పెడుతుంటే డైవర్షన్ పాలిటిక్స్‌తో సీఎం బిజీ

- ఎక్స్ వేదికగా కేటీఆర్ విమర్శ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఓ వైపు రైతులు పొలాల్లో కన్నీరు పెడుతుంటే తెలంగాణ సీఎం రేవంత్ మాత్రం రోత పుట్టించే కూతలతో... డైవర్షన్ పాలిటిక్స్‌తో బిజీబిజీగా గడుపుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం కారణంగా ఐకేపీ కేంద్రాల్లో ఉంచిన రైతుల ధాన్యం పూర్తిగా తడిసిపోయిందని ఓ రైతు విమర్శలు చేస్తున్న వీడియోను కేటీఆర్ పోస్ట్ చేసి... ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ దళారి ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని వాపోయారు. వానాకాలం వరికోతలు సాగుతున్నాయని... కానీ ఈరోజు వరకు రైతుబంధు వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రూ.15 వేల రైతు భరోసా ఊసే లేదన్నారు. కనీసం హార్వెస్ట్ చేసిన పంటను కూడా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నారనీ, గత నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా నిర్ణయించిందని వివరించారు. కానీ, పోయిన నెల 28 వరకు 913 మంది రైతుల నుంచి 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. రైతన్న అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి నిర్లక్ష్యమని విమర్శించారు. దళారులతో కుమ్మక్కైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనే లేదని విమర్శించారు.

27 నుంచి అర్ధసంవత్సరం పరీక్షలు : టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్ధసంవత్సరం పరీక్షలు, ఆలిండియా సర్వీసెస్, స్టేట్ సర్వీసెస్ అధికారులకు లాంగ్వేజ్ టెస్ట్, రాష్ట్రంలో పనిచేస్తున్న ఆలిండియా అధికారులకు ప్రొఫిషియెన్సీ టెస్ట్‌ను ఈనెల 27 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు టీజీపీఎస్సీ ప్రకటించింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు ఈనెల 16 వరకు గడువుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం ఋఋఋ.ఎజూఅ.ఔ్రశ్రీజ.అఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తులను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

నిర్వాసితులకు మెరుగైన పరిహారం..!

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందుకు..
- ఆర్ఆర్ఆర్ భూ బాధితులకు మూడింతల పరిహారం



నవతెలంగాణ-గజ్వేల్

రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు సమాచారం. గత అనుభవాలను, నిబంధనలను దృష్టిలో పెట్టుకొని మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగా ప్రాజెక్టుల భూసేకరణ సమయంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో కొండపోచమ్మ, దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్న సాగర్ నిర్వాసితుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని రీజనల్ రింగ్ రోడ్‌లో అలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూడాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని అధికారులు చెబుతున్నారు. 2022లో రీజనల్ రింగ్ రోడ్డు నోటిఫికేషన్ వెలువడక ముందే మూడేండ్ల పాటు భూమి విలువను తీసుకొని దానికి మూడింతల పరిహారం భూ బాధితులకు అందించడానికి కసరత్తు చేస్తున్నట్టు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం.

భూసేకరణలో ముందుకు..

నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్‌లో అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం భూమి విలువ ఎకరాకు రూ.8-10 లక్షల వరకు ఉన్నట్టు సమాచారం. ఈ విలువ మూడేండ్ల క్రితం 25శాతం తక్కువగా ఉండగా దీన్ని మూడింతలు లెక్కించి ఆ స్థాయిలో పరిహారం ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో భూముల విలువకు, ప్రభుత్వం ఇచ్చే పరిహారానికి పొంతనలేదని, రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉందని ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులు ఆరు నెలలకుపైగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులో కోల్పోయిన భూముల్లో పౌల్ట్రీ ఫారాలు, వ్యవసాయ భూముల్లో బోరు బావులు, చెట్లు ఇతర నిర్మాణాలకు ప్రత్యేకంగా ధర కట్టి ఇస్తామని గతంలో ప్రభుత్వం చెప్పి భూములు తీసుకున్న తర్వాత చేతులు దులిపేసుకుందన్న విమర్శలూ ఉన్నాయి. రీజనల్ రింగ్ రోడ్ విషయంలోనూ ముందుగా చెప్పి తర్వాత చేతులెత్తేసే అవకాశం లేకపోలేదని రైతులు అనుమానిస్తున్నారు. కానీ రెవెన్యూ అధికారులు ముందుగానే వాటిపై రైతులకు క్లారిటీ ఇస్తామని చెప్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎక్కువ భూ సేకరణ..

ఉమ్మడి మెదక్ జిల్లాలోని వివిధ రెవెన్యూ డివిజన్ల వారీగా (క్యాంప్టన్ అథారిటీ ఫర్ ల్యాండ్ ఆక్వా జైషెన్) కాల పరిధిలో ఉమ్మడి నల్లగొండ, మెదక్ జిల్లాలో 84 గ్రామాల్లోని 4750 ఎకరాలు భూ సేకరణ చేస్తుండగా, అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలకుపైగా భూసేకరణ చేస్తున్నారు. ఉత్తర భాగం రీజనల్ రింగ్ రోడ్డును ఆనుకొని 158 కిలోమీటర్ల కాగా ఇందులో 110 కిలోమీటర్లకు పైగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోనే భూములు ఉన్నాయి. వీటికి సంబంధించిన నోటిఫికేషన్లు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే కొన్ని గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి భూసేకరణకు అధికారులు ముందుకు సాగుతున్నారు. గజ్వేల్ ప్రాంతంలో 980 ఎకరాలకు పైగా భూసేకరణకు 97.5 ఎకరాలకు సంబంధించి త్రీడీ, త్రీజీ నోటిఫికేషన్ పెండింగ్‌లో ఉండగా పూర్తి చేశామన్నారు. గజ్వేల్ ప్రాంతంలో రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణలో రైతుల నుంచి సమస్య రాకుండా చూడాలనేదే ప్రభుత్వ నిర్ణయమని అధికారులు అంటున్నారు.

ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా సాగర్

- ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో స్టార్ హోటల్ నిర్మాణం : పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్‌ను గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంలో స్టార్ హోటల్ నిర్మాణంతోపాటు వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ బుద్ధవనం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన హార్ట్‌ఫుల్‌నెస్ (రామచంద్ర మిషన్) మార్గదర్శి కమలేష్ డి.పటేల్ (దాజీ), ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, టూరిజం, రెవెన్యూ అధికారులతో కలిసి బుద్ధవనం లే-అవుట్, విజయ విహార్ లేబొట్లను పరిశీలించారు. 274 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుద్ధ వనం విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి, దాజీకి వివరించారు. అనంతరం వీరు బుద్ధవనాన్ని సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి నివాసంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్, బుద్ధవనానికి ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుంచి ఎక్కువ మంది వస్తారని, వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి అవసరం ఉందని అన్నారు.

అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను ఆదేశించారు. నాగార్జునసాగర్‌ను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసే దశలో హార్ట్‌ఫుల్‌నెస్ మార్గదర్శి దాజీతో కలిసి బుద్ధవనం పక్కన ఉన్న విపస్యన ధ్యాన కేంద్రం, ఇతర ప్రదేశాలను పరిశీలించామన్నారు. నాగార్జునసాగర్‌లో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా కాటేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నామని, నియోజకవర్గంలో నూటికి నూరు శాతం పెద్దఎత్తున టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే కె.జయవీర్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అంతకుముందు విజయవిహార్ అతిథి గృహానికి వచ్చిన మంత్రి జూపల్లికి పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి ప్రకాష్‌రెడ్డి, బుద్ధవనం ఓఎస్‌డి.సుధన్‌రెడ్డి, బుద్ధిష్ట్ కన్సల్టెంట్ శివనాగిరెడ్డి, బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జ్ శ్యాంసుందర్, టూరిజం అధికారులు పాల్గొన్నారు.

ఏపీలో 'యురేనియం'పై పోరుకు జేఏసీ

దేవనకొండ : కర్నూలు జిల్లాలో యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటం తీవ్రమౌతోంది. దేవనకొండ మండలం కప్పట్రాల రిజర్వు ఫారెస్ట్‌లో ప్రతిపాదించిన యురేనియం తవ్వకాలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే అనేక విధాలుగా నిరసన తెలిపినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరుల్లో మార్పు రాకపోవడంతో పరిసర ప్రాంతాలకు చెందిన 12 గ్రామాల ప్రజలు శుక్రవారం పెద్దఎత్తున కదిలారు. యురేనియం తవ్వకాలతో వచ్చే సమస్యలను చర్చించారు. భావి తరాలకు శాపంగా మారే ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలని నిర్ణయించారు. పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి)ని ఏర్పాటుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంతవరకు జెఏసి ఆధ్వర్యంలో పోరాడతామని ప్రకటించారు.

కౌలుట్ల స్వామి దేవాలయం ఆవరణలో శుక్రవారం ఉదయం ఈ సమావేశం జరిగింది. కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, నెల్లిబండ, కోటకొండ దుప్పనగుర్తి, జిల్లేడు బుడకల, చెల్లెలచెలిమెల, బండపల్లి, బంటుపల్లి, బేతపల్లి గ్రామాల ప్రజలు వివిధ పార్టీల నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పార్టీలకతీతంగా యురేనియం తవ్వకాల జెఏసిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి రామచంద్ర నాయుడు, ఆస్పరి మాజీ జడ్పిటిసి బొజ్జమ్మ, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు కప్పట్రాళ్ల మల్లికార్జున, మల్లేపల్లి రంగడు, వెంకటస్వామిగౌడ్, సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు వీరశేఖర్ మాట్లాడుతూ రిజర్వ్ ఫారెస్టు పరిధిలో యురేనియం కోసం 68 బోర్ల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. యురేనియం తవ్వకాల వల్ల భారీగా నష్టం వాటిల్లుతుందని, అడవి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రోగాల బారిన పడతారని చెప్పారు. పచ్చని పొలాలు బీళ్లుగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తవ్వకాలు ఆపకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వైసిపి నాయకులు దివాకర్ నాయుడుతో పాటు

కప్పట్రాళ్ల, కోటకొండ, బేతపల్లి, చెల్లెల చెలిమెల, బంటుపల్లి కి చెందిన సర్పంచులు చెన్నమనాయుడు, తిమ్మక్క, మహేశ్వర్ రెడ్డి, చిన్నరామప్ప, సూర్యప్రకాష్, సీపీఐ(ఎం) నాయకులు కోటకొండ సూరి, యూసుఫ్ బాష తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2017లో కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్‌లో ఎనిమిది చోట్ల తవ్వకాలు జరిపి యురేనియం నిక్షేపాలను నిర్ధారించారు. ఆ తరువాత 17 ఎకరాల్లో బోర్లు తవ్వేందుకు అటామిక్ మినరల్ డైరక్టరేట్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చి సంస్థ ప్రతిపాదనలు పంపింది. దీంతో గ్రామస్తులు ఆందోళనలకు దిగారు.

మరింత మెరుగ్గా దీపం-2

- కేంద్ర అడ్డంకుల వల్ల కొన్ని ఇబ్బందులు
- ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభోత్సవంలో సీఎం



శ్రీకాకుళం : రాబోయే రోజుల్లో ఉచిత గ్యాసు సిలిండర్ల పథకం (దీపం-2)ను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు బాబు వెళ్లారు. గ్యాస్ సిలిండర్లను, ఫించన్లను స్వయంగా అందచేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కేంద్రం అడ్డంకుల వల్లే ముందుగా డబ్బులు తీసుకున్న తర్వాత్త లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. రాబోయే రోజుల్లో ఈ పథకాన్ని మరింత మెరుగ్గా తీర్చి దిద్దుతామని, లబ్ధిదారులు ముందుగా చెల్లించాల్సిన అవసరం లేకుండా చూస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.55 కోట్ల మందికి ఉచిత సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తామని, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మారుస్తామని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటు విషయంలో తాము స్పష్టంగా ఉన్నామని అన్నారు. రెండో బ్లాస్ట్ ఫర్నేస్ సైతం ప్రారంభమైందన్నారు. విశాఖ రైల్వేజోన్‌కు గత ప్రభుత్వం స్థలం కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు. తాము లైన్ క్లియర్ చేశామని, త్వరలో శంకుస్థాపన కూడా చేయనున్నట్లు తెలిపారు. ఇసుకను ఉచితంగా అందించేందుకు అన్ని ట్యాక్స్‌లను రద్దు చేశామని, ఎవరైనా స్వేచ్ఛగా తవ్వుకోవచ్చన్నారు. ఇకపై నాసిరకం మద్యం ఉండదని, అదే సమయంలో బెల్టుషాపులు తెరిస్తే బెల్టు తీస్తామన్నారు. మద్యం ధరలను పెంచితే వారిపై పిడి యాక్ట్‌ను నమోదు చేసి, అరెస్టు చేస్తామని హెచ్చరించారు. రాజకీయాల్లో కక్షసాధింపులకు పాల్పడబోమని, తప్పు చేసిన వారిని విడిచిపెడితే మాత్రం అది అసమర్థత అవుతుంద న్నారు. పింఛను మొత్తాన్ని మూడు నెలలకోసారి తీసుకోవచ్చని స్పష్టం చేశారు. పింఛను ఎవరు ఆపినా నిలదీయాలని, అది హక్కు అని అన్నారు. పోలవరం కోసం రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తున్నామని, ఫేజ్-1 కింద కేంద్రం రూ.12,500 కోట్లు ఇచ్చిందన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా 16,347 ఉద్యోగాలు డిసెంబరు లోపు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉచిత సిలిండర్లపై ప్రజల్లో అపోహలు సృష్టించేందుకు వైసిపి ప్రయత్నిస్తోందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన దీపం వెలుగులను గత ప్రభుత్వం ఆర్పేసిందన్నారు. ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సిఎంను కోరారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పౌరసరఫరాల శాఖకు ఇచ్చిన రూ.42 వేల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉన్నా టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్వయంగా టీ చేసిన చంద్రబాబు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో భాగంగా ఈదుపురానికి చెందిన అంబటి శాంతమ్మ అనే లబ్ధిదారుడి ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. గ్యాస్ స్టవ్ వెలిగించి, తానే స్వయంగా టీ తయారు చేసి అక్కడ ఉన్న మంత్రులకు అందించారు. అక్కడ్నుంచి మరో లబ్ధిదారు బలిజపల్లి జానకి ఇంటికి వెళ్లి ఆమెతో మాట్లాడి పింఛన్ అందించారు. అనంతరం ఉచిత గ్యాస్ సిలిండర్లతో పంపిణీకి సిద్ధం చేసిన వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.

మీడియాపై ఆంక్షలు

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా మీడియాపై తీవ్ర ఆంక్షలు విధించింది. పకొన్ని మీడియా ఛానళ్లకు, పత్రికలకు పాసులు కూడా మంజూరు చేయ లేదు. ప్రభుత్వ కార్యక్రమానికి కొన్ని మీడియా ఛానళ్లను దూరంగా ఉంచడంపై జర్నలిస్టు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

చైతన్యదీప్తి..పోరాట స్ఫూర్తి వట్టికోట

- మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజాక్షేత్రంలో పోరు విత్తనాలు జల్లి ఉద్యమాలను ఉరకలెత్తించిన చైతన్యదీప్తి, పోరాటస్ఫూర్తి వట్టికోట ఆళ్వారుస్వామి అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. శుక్రవారం వట్టికోట ఆళ్వార్‌స్వామి జయంతిని పురస్కరించుకుని తెలంగాణ సమాజానికి ఆయన అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కలాన్ని ఖడ్గంగా ప్రయోగించి, అక్షరాలను పదునెక్కించి అణచివేతను, వివక్షను ఎదిరించి నిలిచిన ధీశాలి వట్టికోట అని కొనియాడారు. నిజాం వ్యతిరేక పోరాటం, గ్రంథాలయోద్యమం మొదలు స్వాతంత్రయోద్యమం వరకు ప్రతి పోరాటంలోనూ ఆయన అద్వితీయమైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. సమాజ హితం కోసం రచయితగా, పాత్రికేయునిగా, పౌరహక్కుల నేతగా, గ్రంథాలయోద్యమాల నాయకుడిగా తన జీవిత సర్వస్వాన్ని అర్పించిన ధన్యజీవి అని కీర్తించారు. కార్మికునిగా జీవితం ప్రారంభించి, ప్రజల మనిషిగా చరిత్రలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న వట్టికోట ఆళ్వారుస్వామి నేటి యువతరానికి స్ఫూర్తిదాయకుడని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వట్టికోట బాటలో పయనిస్తూ, ప్రజల ఆకాంక్షలను గుర్తించి ఆ దిశగా నిబద్ధతతో పని చేస్తున్నదని మంత్రి స్పష్టం చేశారు.

14 నుంచి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

- టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ సంక్షేమ శాఖల పరిధిలో 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, వార్డెన్, మ్యాట్రన్, మహిళా సూపరింటెండెంట్ పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 14 నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం సాధారణ అభ్యర్థులు 1:2 నిష్పత్తిలో, వికలాంగులను 1:5 నిష్పత్తిలో ఎంపిక చేశామని తెలిపారు. గైర్హాజరైన వారికోసం వచ్చేనెల రెండు నుంచి నాలుగో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తామని వివరించారు. ఇందుకోసం ఎంపికైన అభ్యర్థుల జాబితా టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అవసరమైన ధ్రువపత్రాల వివరాలను ఈనెల నాలుగున వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. అభ్యర్థులు దాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలనీ, అవసరమైన అన్ని ధ్రువపత్రాలనూ పరిశీలనకు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈనెల 13 నుంచి వచ్చేనెల నాలుగో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలని కోరారు. వారికి ఆ తర్వాత అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. ఈ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు ఎవరైనా గైర్హాజరైతే వారు తర్వాత నిర్వహించే ప్రక్రియలో ఉండబోరని తెలిపారు. ఇతర వివరాల కోసం ఋఋఋ.ఎజూఅ.ఔ్రశ్రీజ.అఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 581 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 23న టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు 1,45,359 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

గిరిజన యూనివర్సిటీకి భూమి కేటాయింపు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో హైదరాబాద్

ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించింది. సర్వే నెంబర్.837/1లో 211 ఎకురాల 26.5 గుంటల భూమిని కేటాయిస్తూ రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం జీవో నెంబర్ 114 జారీ చేశారు. తెలంగాణ విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ (ఉన్నత విద్యా శాఖ) ఆధ్వర్యంలో పూర్వపు వరంగల్ జిల్లాలో (ప్రస్తుతం ములుగు జిల్లా) గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లుగా యూనివర్సిటీ ఏర్పాటుపై కేంద్రానికి ఎన్ని వినతులు చేసినా ముందుకు సాగలేదు. తాజాగా ఏర్పడిన రేవంత్ సర్కార్ చొరవతో ములుగులో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ఇటీవల కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే.. ఈ క్రమంలో రూ.10 కోట్లకు పైగా విలువ గల భూమిని గిరిజన విశ్వవిద్యాలయానికి ఉచితంగా కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

బాలికపై సామూహిక లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఘటన

నవతెలంగాణ-దోమ

బాలికపై ఐదుగురు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. 8వ తరగతి చదువుతున్న బాలికకు కొన్ని నెలల నుంచి అదే గ్రామానికి చెందిన ఓ బాలుడితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ చనువుగా మెలిగారు. అదే అదును చూసుకుని గత నెల 28న పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత సాయంత్రం బాలికకు మాయమాటలు చెప్పి ఆ వ్యక్తి తన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. అప్పటికే ప్రీ ప్లాన్‌తో ఉన్న ముగ్గురు మైనర్లు, ఇద్దరు మేజర్లు బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. అనంతరం ఇంటికి వచ్చిన బాలికను.. ఎక్కడికి వెళ్లావని తల్లిదండ్రులు మందలించడంతో జరిగిన విషయాన్ని వారికి చెప్పింది. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, బాలికకు పరీక్షలు నిర్వహించగా.. 12 వారాల గర్భం దాల్చినట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ప్రస్తుతం నిందితులు డీఎస్పీ కస్టడీలో ఉన్నట్టు తెలుస్తోంది. గంజాయి మత్తులో బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితులపై పోక్సో చట్టంతో పాటు 96, 172, 127, 76, 351 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు దోమ ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు.

మహిళపై లైంగికదాడికి యత్నం

- అవమానంతో పురుగుల మందు తాగిన బాధితురాలు
- వేములపల్లి మండలంలో ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగా- వేములపల్లి

వివాహిత ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. దాంతో అవమానభారంతో ఆమె పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..

లక్ష్మీదేవిగుడెం గ్రామానికి చెందిన గంట క్రిష్ణయ్య గత నెల 21 తేదీన రాత్రి సమయంలో ఓ మహిళ ఇంట్లోకి ప్రవేశించి భయపెట్టి లైంగికదాడికి ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటపడటంతో పారిపోయాడు. అనంతరం మహిళ మనస్తాపంతో పురుగు మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు సూర్యాపేట ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్లో బాధిత కుటుంబ సభ్యులు గత నెల 22వ తేదీన ఫిర్యాదు చేశారు. కేసు నమోదు కావడంతో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధి సమక్షంలో రాజీ చేయడానికి ప్రయత్నించి విషయాన్ని గోప్యంగా ఉంచారు. అదే సమయంలో నిందితుడు క్రిష్ణయ్య కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. చికిత్స అనంతరం ఆయన కోలుకున్నడు. కానీ బాధితురాలి పరిస్థితి ఇంకా విషమంగానే ఉన్నది. నిందితునిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన రోజే కేసు నమోదు చేసినట్టు, డీఎస్పీ ఆధ్వర్యంలో విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.